www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 13-4-2020 | పేజీలు: 8 + 4 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 60 సంచిక (Issue) : 359

శ్రీశార్వరినామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళపక్షం; తిథి: షష్ఠి సా. 4.19 వరకు తదుపరి సప్తమి; నక్షత్రం: మూల రా. 7.03 తదుపరి పూర్వాషాఢ; వర్జ్యం: సా. 5.27-7.03, తె. 4.54 మొదలు; దుర్ముహూర్తం: మ. 12.41-1.31, మ. 3.10-3.59; అమృతఘడియలు: మ. 12.41-2.17; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.05; సూర్యాస్తమయం: 6.28 | విజయవాడ సిటీ*

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bangalore

| వరల్డోమీటర్ ప్రకారం ఆదివారం రాత్రి 11:00 గంటలకు | మొత్తం కేసులు | కొత్త కేసులు | మొత్తం మృతులు | ఒక్కరోజులో మృతులు |
|---|---|---|---|---|
| ప్రపంచం | 18,31,130 | 75,811 | 1,13,013 | 6,078 |
| భారతదేశం | 8,447 | 918 | 273 | 31 |
| ఆంధ్రప్రదేశ్ | 429 | 24 | 7 | 1 |
| తెలంగాణ | 531 | 28 | 16 | 2 |
| అమెరికా | 5,45,934 | 24,892 | 21,474 | 1,432 |
| స్పెయిన్ | 1,66,019 | 4,167 | 16,972 | 619 |
| ఇటలీ | 1,56,363 | 4,092 | 19,899 | 431 |

# ఒక్క రోజులో 918

## దేశంలో 8,447కు చేరిన కేసులు

## 24 గంటల్లో 31 మంది మృతి.. 273కు పెరిగిన మృతుల సంఖ్య

ప్రస్తుతం 1,671 పడకలు అవసరమైతే ఆస్పత్రుల్లో లక్షకు పైనే ఉన్నాయి

1.87 లక్షల మందికి పరీక్షలు.. కేంద్ర ఆరోగ్య శాఖ జేఎస్ లవ్ అగర్వాల్

మహారాష్ట్రలో మరో 134 కేసులు.. తెలంగాణలో 28 కేసులు, ఇద్దరి మృతి

**నిత్యావసరాలకు సురక్షా స్టోర్లు** దేశవ్యాప్తంగా 20 లక్షల దుకాణాలు!

8

*కరోనా విజృంభణ కొనసాగుతోంది. దేశవ్యాప్తంగా ఆదివారం ఒక్కరోజే 918 కేసులు నమోదయ్యాయి. దీంతో మొత్తం పాజిటివ్‌లు 8,447కు చేరాయి. వీటిలో ఒక్క మహారాష్ట్రలోనే 1,895 కేసులు ఉన్నాయి. మరోవైపు కచ్చితమైన భద్రతా ప్రమాణాలు పాటిస్తూ ప్రజలకు నిత్యావసరాలు అందించేందుకు దేశంలో రానున్న 45 రోజుల్లో 20 లక్షల 'సురక్షా స్టోర్లు' ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. కరోనా కారణంగా డిమాండ్ మందగించడంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2020-21)లో భారత జీడీపీ వృద్ధి రేటు మూడు దశాబ్దాల కనిష్ఠ స్థాయికి పడిపోతుందని ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది.*



బెజవాడ మార్కెట్‌లో కొనుగోలుదారులు లేక మామిడి వ్యాపారుల దిగాలు

## వృద్ధి రేటు 3 శాతంలోపే

భారత్‌పై ప్రపంచ బ్యాంకు అంచనా 6

## అదనపు డబ్బుతో తీవ్ర ద్రవ్యోల్బణం

**రూపాయి విలువ పతనమయ్యే ముప్పు**

**డబ్బు సరఫరాకు తగ్గట్టు ఉత్పాదకత పెంచాలి** 8

**కేసీఆర్ క్యూఈ ప్రతిపాదనపై ఆర్థిక వేత్త గోవిందరావు**



కరోనాపై సమీక్షలో సీఎం జగన్, సీఎస్ నీలం సాహ్ని, డీజీపీ సవాంగ్

# ప్రతి మనిషికీ 3 మాస్కులు

16 కోట్ల మాస్కులు పంచండి

దీంతో కొంతవరకు కరోనా కట్టడి

32,349 మందికి పరీక్షలు: సీఎం

అమరావతి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ నివారణలో భాగంగా రాష్ట్రమంతా 16 కోట్ల మాస్కులను పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశించారు. 5.3 కోట్ల జనాభాకు.. ఒక్కొక్కరికీ మూడేసి చొప్పున పంచాలన్నారు. ఆదివారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో కొవిడ్-19 నివారణ చర్యలపై ఆయన ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని, డీజీపీ గౌతమ్ సవాంగ్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు సతీశ్ చంద్ర, ఎంటీ కృష్ణబాబు, జవహర్‌రెడ్డి, సీఎం కార్యదర్శి ఆరోఖ్యరాజ్, సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. మాస్కులతో కరోనా నుంచి కొంత రక్షణ లభిస్తుందని.. వీలైనంత త్వరగా వీటిని పంపిణీ చేయాలని సీఎం పేర్కొన్నారు. మూడో విడత సర్వే పూర్తయిందని.. 32,349 మందిని వైద్యాధికారులకు

మిగతా 7వ పేజీలో...

## బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మి వేయడం నిషిద్ధం

**పొగాకు, గుట్కా నమిలి రోడ్లపై ఊస్తే కఠిన చర్యలు** 7

# రెడ్‌జోన్లపై వార్

## తీవ్రత ఉన్న జిల్లాలకు పొరుగు నుంచి బలగాలు



ఆదివారం రాత్రి విజయవాడ రాణిగారితోటలోని రెడ్‌జోన్ వద్ద అదనపు బలగాలు

**మరింత కఠినంగా లాక్‌డౌన్ అమలు.. ఆరెంజ్ జోన్ ప్రాంతాల్లోనూ కట్టుదిట్టం**

**కృష్ణా సహా 6 జిల్లాలకు అదనపు సిబ్బంది.. అవసరమైతే గ్రీన్‌జోన్ల నుంచి సర్దుబాటు**

## కరోనాను కట్టడి చేసేది ఇలాగేనా?

**కేసులు ఎందుకు పెరుగుతున్నాయి?.. డీజీపీ సీరియస్.. కొందరు ఐపీఎస్‌లకు మెమోల జారీ**

## గుంపులుగా వస్తే నేతల్నీ ఉపేక్షించొద్దు

**మామిడి, బత్తాయి, ద్రాక్షను అడ్డుకోవద్దు.. ప్రయాణికులను తరలిస్తే సీజ్ చేయండి**

**పోలీసులకు డీజీపీ సవాంగ్ నిర్దేశం.. అనవసరంగా బయటికొస్తే బండి సీజ్**

అమరావతి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కరోనా వైరస్ కట్టడికి పోలీసులు కదిలారు. ఇక నుంచి రెడ్‌జోన్స్‌లో కఠినంగా ఆంక్షలు అమలు చేయాలని నిర్ణయించారు. ఆ ప్రాంతాల్లో భారీగా బలగాలను మోహరించారు. లాక్‌డౌన్ అమలుకు సంబంధించి తాజా పరిస్థితులపై ఆదివారం జిల్లాల పోలీసు అధికారులతో డీజీపీ గౌతమ్ సవాంగ్ సుదీర్ఘంగా సమీక్షించారు. కొన్ని జిల్లాల్లో ఆశించినట్లు పనిచేయని పోలీసు అధికారులపై సీరియస్ అయ్యారు. కొందరు ఐపీఎస్ అధికారులకు మెమోలు కూడా జారీ చేశారు. లాక్‌డౌన్ ఆంక్షలను మూడు వారాలుగా అమలు చేస్తున్నా.. కర్నూలు, నెల్లూరు, ప్రకాశం, గుంటూరు, విశాఖ, కృష్ణా జిల్లా (విజయవాడ)ల్లో వైరస్ ఎందుకు అదుపులోకి రావడం లేదనే విషయమై జిల్లాల ఎస్పీలు, మంగళగిరి పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని ఉన్నతాధికారులతో డీజీపీ చర్చించారు. కర్నూలు, నెల్లూరు, గుంటూరు, విజయవాడ లాంటి చోట్ల లాక్‌డౌన్ అమలు, వైరస్ సోకిన వ్యక్తులతో కలిసి ఉన్నవారిని గుర్తించడంలో పోలీసుల పనితీరుపై ఆయన పెదవి విరిచినట్లు సమాచారం. తమకు సిబ్బంది తక్కువగా ఉన్నారని కొందరు ఎస్పీలు చెప్పడంతో అదనపు బలగాలను తక్షణమే

మిగతా 7వ పేజీలో...

## దాస్తే ముప్పే!

**కేసులపై ప్రభుత్వం దాటవేత**

**మరణాల ధ్రువీకరణలోనూ అంతే**

**బులెటిన్‌లో ఒక లెక్క.. రిపోర్టులో మరొకటి** 7

**వైరస్ తీవ్రత లేనేలేదంటున్న సీఎం**

**ఉన్నతాధికారులదీ అదే పాట**

**అలా అంటూనే మూడుసార్లు సర్వే**

**తీవ్రత లేకుంటే అన్ని పరీక్షలెందుకు?**

**మనిషికి 3 మాస్కులెందుకు?**

## గుంటూరు గిలగిల

### 91 కేసులతో అగ్రస్థానానికి.. కర్నూలు 84

**గుంటూరులో ఆర్ఎంపీ, వలంటీర్‌కూ..**

**సెంచరీ దిశగా గుంటూరు, కర్నూలు**

**50 కేసులు దాటేసిన నెల్లూరు**

**రాష్ట్రంలో ఒకేరోజు 24 మందికి వైరస్**

**మొత్తం 429కి చేరిన కరోనా కేసులు**

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

కరోనా మహమ్మారి ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం 24 కొత్త కేసులు నమోదయ్యాయి. దీంతో మొత్తం పాజిటివ్‌ల సంఖ్య 429కి చేరింది. ఈ వైరస్ తీవ్రతకు గుంటూరు జిల్లా

మిగతా 7వ పేజీలో...

# గంటకు 83 చావులు

## అమెరికాలో కరోనా కల్లోలం

**కొవిడ్-19 వైరస్‌కు 21,474 మంది బలి**

**ప్రపంచంలో అత్యధిక మరణాలు ఇక్కడే**

**5.45 లక్షల కేసులతో మొదటి స్థానంలో**

**50 రాష్ట్రాల్లో ఈ నెల 30 వరకు లాక్‌డౌన్**

**స్పెయిన్‌లో ఒక్కరోజే 619 మంది మృతి**

**సింగపూర్‌లో 51 మంది భారతీయులకు వ్యాధి**

**ప్రపంచాన్ని కమ్మేస్తున్న కరోనా**



భారత్ నుంచి న్యూయార్క్‌కు చేరుకున్న హైడ్రాక్సీ క్లోరోక్విన్, ఇతర మందులు

వాషింగ్టన్, ఏప్రిల్ 12: కరోనా మహమ్మారి అగ్రరాజ్యం అమెరికాను అతలాకుతలం చేస్తోంది. కరోనా బారిన పడి అట్టుడుకుతున్న దేశాల్లో నిన్న మొన్నటి వరకు ఇటలీ తొలిస్థానంలో ఉండగా ఇప్పుడు అమెరికా ఈ స్థానానికి ఎగబాకింది. కరోనా మృతుల సంఖ్య సహా పాజిటివ్ కేసుల్లోనూ అమెరికా ముందు వరుసలో నిలవడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. కొవిడ్-19 వైరస్ సోకిన వారిలో గంటకు 83 మంది చొప్పున పిట్టల్లా రాలిపోతున్నట్టు జాన్ హాప్కిన్స్ యూనివర్సిటీ వెల్లడించింది. ఆదివారం రాత్రికి దేశవ్యాప్తంగా 21,474 మంది కరోనా కాటుతో తుదిశ్వాస విడిచినట్టు పేర్కొంది. వాస్తవానికి ఫిబ్రవరి చివరిలో ఒకరి మరణంతో మొదలైన మృత్యుఘోష.. శరవేగంగా ప్రజల ప్రాణాలను కబళించేస్తోందని తెలిపింది. ప్రస్తుతం

మిగతా 2వ పేజీలో...

## చైనాలో మళ్లీ 99 కేసులు

2

97 మంది విదేశాల నుంచి వచ్చినవారే

రష్యా సరిహద్దుల్లో ప్రబలుతున్న వైరస్

**కర్ఫ్యూ పాస్ చూపమన్నందుకు..**

## ఏఎస్సై చేయి నరికేశాడు

**పంజాబ్ పటియాలాలో ఘటన** 8



**అమెరికాలో కాల్పులు..**

## నెల్లూరు విద్యార్థికి తీవ్ర గాయాలు

**కడుపు, కాలులోకి దూసుకెళ్లిన బుల్లెట్లు** 7

**వెంటిలేషన్‌పై చికిత్స.. విషమంగా పరిస్థితి**

**ప్రభుత్వం ఆదుకోవాలని బంధువుల వినతి**



3

కువైత్‌లోని సైనిక స్థావరానికి చేరుకున్న భారత వైద్యబృందం విమానం

## కువైత్‌లో ప్రవాసాంధ్రులు విలవిల

**మాతృభూమికి తిరిగి రావడానికి అగచాట్లు**

**ప్రధాని జోక్యంతో పరిష్కారం దిశగా అడుగులు**

**కువైత్‌కు చేరుకున్న భారత వైమానిక దళం**



పరంజ్యోతి



## నిజమైన భక్తుడి లక్షణాలు

*దాసవత్సన్నతార్యాంఘ్రిః పితృవద్దీన వత్సలః*
*భ్రాతృవత్సదృశే స్నిగ్ధో గురుష్వీశ్వర భావనః*
*విద్యార్థరూప జన్మాఢ్యో మానస్తమ్భవివర్జితః*

..మహాభక్తుడైన ప్రహ్లాదుని గుణగణాల గురించి వ్యాస భగవానుడు శ్రీమద్భాగవతంలో వివరించిన శ్లోకమిది. "పెద్దల విషయంలో దాసుని వలె మెలగుతూ వారి పాదాలకు నమస్కరించువాడు, దీనజనుల విషయంలో తండ్రివలె వాత్సల్యం చూపించువాడు, గురువుల యందు ఈశ్వర భావన కలవాడు, విద్యా విషయంలోను, ధన విషయంలోను, రూపం విషయంలోను మిక్కిలి ప్రశస్తుడైనా ఏ మాత్రము గర్వము లేని వాడు" అని ప్రహ్లాదుని కొనియాడాడు. రాక్షస రాజైన హిరణ్యకశిపుని నలుగురు పుత్రులలో అగ్రజుడైన ప్రహ్లాదుడు.. అత్యంత భక్తి శ్రద్ధలు కలిగిన బాలుడు. చిన్నతనంలోనే హరి భక్తి పుష్కలంగా కలిగి తన జీవితంలోనే శ్రీహరికి ప్రథమ స్థానమిచ్చిన మహానుభావుడు. ఆ శ్రీహరిని చేరుకోగలగడమే మానవ జన్మ పరమార్థమని త్రికరణ శుద్ధిగా నమ్మినవాడు. చిన్నవయసులోనే.. భాగవత సేవకు ప్రాధాన్యమిచ్చి మెలిగినవాడు. భాగవతుల దాస్యమే శుద్ధ భక్తిగా భావించి ఆచరించినవాడు. తన తండ్రి తీవ్రంగా ద్వేషించే శ్రీహరియే తనకు రక్షకుడని నమ్మి ఎన్ని కష్టాలెదురైనా వాటిని ఎదిరించి నిలిచిన భక్త శిరోమణి. అయితే కేవలం భక్తి మాత్రమే పరమాత్మని చేరుకోవడానికి సాధనం కాదని ప్రహ్లాదుని వ్యక్తిత్వం నిరూపించింది. ప్రహ్లాదుడి ఉన్నతమైన వ్యక్తిత్వమే.. ఆ పరంధాముడి మహా భక్తులలో ప్రథమునిగా అతణ్ని నిలబెట్టింది. అందుకే ఈ లోకం పుణ్యపురుషులను, పరమభాగవతులను స్మరించే సందర్భంలో "ప్రహ్లాద నారద పరాశర పుండరీక..." అంటూ మొట్టమొదట ప్రహ్లాదునికే తొలి వందనం సమర్పిస్తుంది.

ప్రహ్లాదుడు బాలుడు. తండ్రి కోరిక కారణంగా గురువులైన చండామార్కుల వద్ద విద్యనభ్యసిస్తూనే తన సహజ బుద్ధి జనితమైన నారాయణ తత్త్వ విచారణ మరువక కొనసాగించాడు. తోటి బాలురకు విష్ణు తత్త్వ విశేషాలను వివరించేవాడు. ధర్మ, అర్థ, కామాదులనే కేవల త్రివర్గాలను బోధించే గురువుల బోధనకు తోడు.. మోక్షకారణమైన విష్ణు తత్త్వాన్ని సైతం తనంత తానే అభ్యసిస్తూ ఇతర బాలురతోనూ ఈ విషయాల్ని పంచుకునేవాడు. ఈ ఆధ్యాత్మిక పార్శ్వమే గాక ఒక మానవునికి కొన్ని మానవత్వపు లక్షణాలు అవసరమని భావించిన భాగవతం ప్రహ్లాదుని రూపంలో వాటిని లోకానికి అందించింది. అవే పైన పేర్కొన్న శ్లోకంలో వ్యాసులు వర్ణించిన నిజమైన భక్తుడి లక్షణాలు. తెలుగులో భాగవత మకరందాన్ని మనకందించిన బమ్మెర పోతన.. ఈ భావాలనే వర్ణిస్తూ.. "తన యందు, అఖిల భూతములందు సమహితత్వము" నెరపువానిగా ప్రహ్లాద కుమారుని అభివర్ణించాడు. అందరిలో గోవింద దర్శనాన్ని చేసుకోగలిగిన ప్రహ్లాదుడు గొప్పశీల సంపన్నుడేగాక సత్యసంధుడు, జితేంద్రియుడు. మహోన్నతవ్యక్తిత్వంతో ఆదర్శమూర్తిగా నిలిచిపోయే ప్రహ్లాదుని చరిత్ర పరమోత్కృష్టమైనది. ఆ పరంధాముని భక్తులందరికీ ఆదర్శప్రాయమైనది.

**- గన్నమరాజు గిరిజా మనోహర బాబు**

## లోకం తీరు




# గంటకు 83 చావులు!

(మొదటిపేజీ తరువాయి)

5.45 లక్షల మంది పాజిటివ్ బాధితులకు చికిత్స అందిస్తున్నారు. కరోనాపై ఆదిలో ఉదాసీనంగా వ్యవహరించిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇప్పుడు కఠిన చర్యలకు దిగారు. దేశవ్యాప్తంగా జాతీయ అత్యవసర పరిస్థితిని విధించడంతోపాటు 50 రాష్ట్రాల్లో లాక్‌డౌన్‌ను ఈ నెల 30 వరకు పొడిగించారు. కరోనాను పెనువిపత్తుగా ప్రకటించారు. భౌతిక దూరం పాటించడం సహా మాస్కులు ధరించడాన్ని తప్పనిసరి చేశారు. దేశంలో తొలిసారి 50 వేల మంది సైన్యాన్ని కరోనా కట్టడి విధులకు నియోగిస్తూ ఉత్తర్వులిచ్చారు. కరోనా కట్టడికి తీసుకుంటున్న సత్ఫలితాలు ఇస్తున్నాయని, మొదట్లో ఉన్నంత తీవ్రత ఇప్పుడు లేదని అధ్యక్ష భవనం ఏర్పాటు చేసిన కరోనా టాస్క్‌ఫోర్స్ వెల్లడించింది. దీంతో మరణాల సంఖ్య 60 వేలకు పరిమితమయ్యే అవకాశం ఉందని అంచనా వేసింది.

### న్యూయార్క్ కుదుటపడింది!

"దేశంలో ఆంక్షలు విధించడం చాలా క్లిష్టమైన అంశం. గతంలో ఎప్పుడూ ఇలాంటి పరిస్థితి ఎదురుకాలేదు. అయితే, ఇది మంచి ఫలితం ఇస్తోంది" అని అధ్యక్షుడు ట్రంప్ మీడియాకు తెలిపారు. మహమ్మారికి కేంద్ర స్థానంగా ఉన్న న్యూయార్క్ ఇప్పుడిప్పుడే కుదుటపడుతోందని, కొత్త కేసులు నమోదు కావడం లేదన్నారు. ఆంక్షల ఎత్తివేతపై ఇప్పటి వరకు నిర్ణయం తీసుకోలేదని, మే తొలి వారంలో దీనిపై ప్రకటన చేసే అవకాశం ఉందని అధ్యక్ష భవనం వర్గాలు తెలిపాయి. మరోపక్క నేవీలోని 4800 మంది సిబ్బందిలో 550 మందికి కరోనా పాజిటివ్ వచ్చినట్లు అధికారులు తెలిపారు.

### అందిన భారత్ సాయం

కరోనాపై పోరులో అమెరికాకు ఆపన్న హస్తం అందిస్తామని హామీ ఇచ్చిన భారత్ అన్నమాటను నిలబెట్టుకుంది. కరోనా కట్టడిలో కీలకంగా భావిస్తున్న హైడ్రాక్సీ క్లోరోక్విన్ మాత్రలు(35.82 లక్షలు) సహా 9 వేల కిలోల ఇతర ఔషధాలను భారత్ అందించింది. ఈ సాయంపై అమెరికన్లు హర్షం వ్యక్తం చేశారు. ఇండియన్ అమెరికన్ స్వచ్ఛంద సంస్థలు తమ దాతృత్వాన్ని చాటుతున్నాయి. ఇప్పటి వరకు 4 లక్షల డాలర్ల విలువైన సామగ్రిని అందించాయి. మరో 6 లక్షల డాలర్ల విలువైన సామగ్రిని అందిస్తామని 'సేవ' ఇంటర్నేషనల్, ఇండియాస్పోరా స్వచ్ఛంద సంస్థలు తెలిపాయి. కొవిడ్-19 బ్లడ్ ప్లాస్మా రిజిస్ట్రీని ప్రారంభించనున్నట్టు సేవ ఇంటర్నేషనల్ తెలిపింది. కాగా, కరోనా మహమ్మారి అమెరికాను పీల్చిపిప్పి చేస్తుండడం వెనుక అధ్యక్షుడి నిర్వాకమే ప్రధాన కారణమని స్థానిక మీడియా విమర్శలు గుప్పించింది. కొవిడ్-19పై అధికార వర్గాలు ట్రంప్‌ను ముందుగానే హెచ్చరించినా ఆయన నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే మృత్యుఘోష పెరిగిందని, పక్కా ప్రణాళికను రూపొందించుకుని పోరుకు సన్నద్ధం కావడంలోనూ ఆయన విఫలమయ్యారని 'న్యూయార్క్ టైమ్స్' దుయ్యబట్టింది. అత్యంత విలువైన మూడు వారాల సమయాన్ని అధ్యక్షుడు వృథా చేశారని తెలిపింది. మరో పత్రిక 'వాషింగ్టన్ పోస్ట్' కూడా ఇదే అభిప్రాయం వెల్లడించింది. వైద్య అధికారులు, ఇంటిలిజెన్స్ హెచ్చరించినా ట్రంప్ మేల్కొనలేదని నిప్పులు చెరిగింది. పాజిటివ్ వచ్చిన ప్రతి 10 మంది మధ్య వయస్కుల్లో ఒకరు చొప్పున, 85 ఏళ్ల పైబడిన ప్రతి 10 మందిలో నలుగురు మృత్యువాత పడుతున్నారని పత్రిక వివరించింది.



రోమ్ నుంచి వచ్చిన 42 మంది విద్యార్థులను హైదరాబాద్‌కు తీసుకొచ్చిన దృశ్యం

**పాజిటివ్ కేసుల్లో తొలి 5 దేశాలు**

| | |
|---|---|
| అమెరికా | 5,45,934 |
| స్పెయిన్ | 1,66,019 |
| ఇటలీ | 1,56,363 |
| ఫ్రాన్స్ | 1,32,591 |
| జర్మనీ | 1,26,656 |

### రోడ్డున పడ్డా.. భయంవద్దు!

**భారతీయ విద్యార్థులకు అభయం**

అమెరికాలో అత్యవసర పరిస్థితి విధించడంతో యూనివర్సిటీలు మూతబడిన నేపథ్యంలో భారతీయ విద్యార్థులు రోడ్డున పడ్డారు. హాస్టళ్లను ఖాళీ చేయించడంతో దొరిన చోట తలదాచుకుంటున్నారు. దీంతో వీరి పరిస్థితి దయనీయంగా మారింది. అయితే, విద్యార్థులు ఎక్కడివారు అక్కడే ఉండిపోవాలని, భయపడాల్సిన పనిలేదని అమెరికాలో భారత దౌత్యవేత్త తరణ్‌జిత్ సింగ్ సంధు సూచించారు. మొత్తం రెండున్నర లక్షల మంది భారతీయ విద్యార్థులు అమెరికాలో ఉన్నారని, వీరికి ఎలాంటి సాయం కావాలన్నా చేస్తామని సంధు తెలిపారు. ఇన్‌స్టాగ్రామ్ లైవ్‌లో 500 మంది విద్యార్థులతో మాట్లాడి వారి పరిస్థితిని తెలుసుకున్నారు. హాస్టళ్లను ఖాళీ చేయించారని, తాము స్వదేశం వెళ్లిపోతామని విద్యార్థులు ఈ సందర్భంగా మొరపెట్టుకున్నారు. అయితే, భారత్‌లో ఇంకా లాక్‌డౌన్ పొడిగించే అవకాశముందని, పరిస్థితులు చక్కబడ్డాక పంపిస్తామని సంధు హామీ ఇచ్చారు.

## చేటు తెచ్చిన లేటు!

- ఆలస్యంగా మేల్కొన్న న్యూయార్క్
- ఈ లోగా పంజా విసిరిన వైరస్

న్యూయార్క్, ఏప్రిల్ 12: కరోనా కారణంగా ఎక్కువగా అతలాకుతలమైన దేశం అమెరికా. ముఖ్యంగా న్యూయార్క్ రాష్ట్రంలోనైతే మృత్యుఘోష వినిపిస్తోంది. ప్రపంచంలో అత్యధికంగా ప్రభావితమైన ఐరోపా దేశాల్లో నమోదైన వాటికంటే న్యూయార్క్‌లో ఎక్కువ పాజిటివ్ కేసులు వెలుగుచూశాయి. అమెరికాలో సంభవించిన మరణాల్లో సగం న్యూయార్క్‌లోనే ఉన్నాయి. ఆదివారానికి అమెరికా వ్యాప్తంగా 5.33లక్షల మందికి పాజిటివ్‌గా తేలితే అందులో న్యూయార్క్‌లోనే 1.8 లక్షల మంది ఉన్నారు. అమెరికా మొత్తమ్మీద 20 వేల మందికి పైగా చనిపోతే ఇక్కడే 8600కిపైగా ఉండడం వైరస్ తీవ్రతకు అద్దం పడుతోంది. న్యూయార్క్‌లోనే ఎక్కువ కేసులు, మరణాలు ఎందుకు నమోదవుతున్నాయి? ఆర్థిక నగరం ఇంతలా కరోనా కోరల్లో చిక్కుకోవడానికి కారణమేమిటి? అంటే.. ఆ రాష్ట్ర గవర్నర్ ఆండ్రూ కుమో చెప్పినట్టు.. న్యూయార్క్ జనసాంద్రత, విదేశీ ప్రయాణికుల తాకిడి ఎక్కువగా ఉండడం ఈ విలయానికి ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. దానికితోడు వైరస్ వ్యాప్తిని నివారించే ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంలో అక్కడి ప్రభుత్వం తాత్సారం వహించింది. జనసాంద్రత అధికం కాబట్టి భౌతిక దూరం పాటించడం కష్టమే! న్యూయార్క్ నగరానికి ఏటా 6 కోట్ల మంది విదేశీ పర్యాటకులు వస్తుంటారు. అలాగే చాలామంది ప్రయాణికులకు అమెరికాలోని ఇతర రాష్ట్రాలకు వెళ్లేందుకు ఇదే ఎంట్రీ పాయింట్. కాబట్టి ఏ ఒక్క ప్రయాణికుడు వైరస్‌ను మోసుకొచ్చినా ఇక్కడది ఎక్కువగా వ్యాప్తి చెందడానికి అవకాశాలు చాలా ఎక్కువ. మార్చి 1న న్యూయార్క్‌లో తొలి కరోనా కేసు నమోదైంది. దానికి ముందే ఫిబ్రవరిలోనే ఐరోపా దేశాల్లో ఈ వైరస్ విజృంభణ మొదలైంది. పలువురు హెచ్చరించినా.. గవర్నర్ కుమో మాత్రం తమకు ప్రపంచంలోనే అత్యుత్తమ వైద్య సదుపాయాలున్నాయని చెప్పారు. కానీ ఇప్పుడు ఆయనే 'ఇతర దేశాల్లో ఉన్నంత తీవ్రంగా ఉంటుందని ఊహించలేకపోయాం' అని అంటున్నారు. తొలి కేసు నమోదు అనంతరం 15 రోజులకు లాక్‌డౌన్ ప్రకటించారు. కానీ అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. కాలిఫోర్నియాలో కూడా అధిక జనాభా ఉన్నా.. అక్కడి ప్రభుత్వం సకాలంలో స్పందించి వైరస్ వ్యాప్తి తీవ్రతను నిరోధించగలిగిందని కొలంబియా యూనివర్సిటీ ప్రొఫెసర్ రెడ్లెనర్ చెప్పారు.

## ఎండాకాలం

| కేంద్రం | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| శ్రీకాకుళం | 36.0 | 29.0 |
| గుంటూరు | 36.8 | 26.1 |
| విశాఖపట్నం | 37.8 | 24.6 |
| హైదరాబాద్ | 37.8 | 22.2 |
| విజయవాడ | 38.8 | 25.0 |
| కర్నూలు | 40.9 | 26.2 |
| ఏలూరు | 41.0 | 24.0 |

## నేడు సీమలో భగభగలు

- ఉత్తర కోస్తాలో 4 రోజులు వర్షాలు!

అమరావతి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో రానున్న 4రోజులు భిన్నమైన వాతావరణ పరిస్థితులు నెలకొంటాయని అమరావతి వాతావరణ కేంద్రం అంచనా వేసింది. ఉత్తర కోస్తా, యానాం ప్రాంతాల్లో ఉరుములు, ఈదురు గాలులతో ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. రాయలసీమలో సోమవారం సాధారణం కన్నా 2-3 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని, తర్వాత 3 రోజులు సాధారణ ఉష్ణోగ్రతలు ఉంటాయని తెలిపింది.



## గోడౌన్లలో తగినంత ధాన్యం నిల్వలు

*రేషన్ దుకాణాల ద్వారా 81 కోట్ల మంది పేదలకు 9 నెలల పాటు పంపిణీ చేసేందుకు సరిపడా ధాన్యం నిల్వలు మన గోడౌన్లలో ఉన్నాయి. లాక్‌డౌన్‌ను ఈ నెలాఖరు వరకు పెంచినా పేదలకు సమయానికి రేషన్ సరఫరా చేస్తాం. ఈ రబీలో ధాన్యం ఉత్పత్తి కూడా భారీగా ఉంది. గోడౌన్లలో రెండేళ్ల స్టాకును నింపగలం.*

**- రామ్‌విలాస్ పాసవాన్, కేంద్ర మంత్రి**

## నిత్యావసరాల రవాణాను పోలీసులు అడ్డుకోవద్దు : కేంద్రం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: మూడువారాల లాక్‌డౌన్ సందర్భంగా నిత్యావసరాలు, ఇతరత్రా వస్తువులు, సరుకుల రవాణాకు ఇచ్చిన మినహాయింపుల అమలుకు కొన్ని రాష్ట్రాలు మోకాలడ్డాయని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఒక రాష్ట్రం నిత్యావసరాల రవా ణా కోసం వాహనాలకు పాస్‌లు కేటాయించి అనుమతులిస్తే.. మరో రాష్ట్రం వాటిని తమ పరిధిలోకి అనుమతించకుండా వ్యవహరించిన ఘట్టాలు చోటుచేసుకున్నాయని, నిత్యావసరాలను రవాణా చేసే ట్రక్కులను పోలీసులు అడ్డుకోవడమం టే.. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుందని స్పష్టం చేసింది. ఆ విధంగా చేస్తే ఆహార కొరత ఏర్పడే అవకాశాలు ఉంటాయని హెచ్చరించింది. ఈమేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాం తాల చీఫ్ సెక్రెటరీలకు కేంద్ర హోంశాఖ కార్యదర్శి అజయ్ భల్లా సూచనలు జారీచేశారు.

## 'హైడ్రాక్సీ'పై తలో మాట!!



- దానిపైనే ఆశలు పెట్టుకున్న ట్రంప్
- విభేదిస్తున్న పరిశోధకులు

వాషింగ్టన్, ఏప్రిల్ 12: మలేరియా నిరోధక ఔషధం 'హైడ్రాక్సీ క్లోరోక్విన్', యాంటీ బయాటిక్ 'అజిత్రోమైసిన్'.. కరోనాను ఎదుర్కోవడానికి ఇవి రెండే చాలు అనే విధంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల వ్యాఖ్యలు చేశారు. ఈక్రమంలోనే 'క్లోరోక్విన్ దిగుమతి చేయకుంటే ప్రతిచర్యలు ఉంటాయి' అంటూ భారత్‌ను ఆయన హెచ్చరించడాన్ని ప్రపంచమంతా చూసింది!! కరోనా ఇన్ఫెక్షన్లకు ఆ రెండు ఔషధాలే విరుగుడు అనేలా ట్రంప్ గొంతు చించుకున్నప్పటికీ.. ఆయన వాదనతో అమెరికాలోని ప్రముఖ పరిశోధనా సం స్థలే ఏకీభవించడం లేదు. సాక్షాత్తూ ట్రంప్ సలహాదారుడు ఆంథోనీ ఫాసి.. కరోనా ఇన్ఫెక్షన్ల కట్టడికి ఏదైనా ఔషధం పనిచేస్తుందా? లేదా? అనేది క్లినికల్ ట్రయల్స్ తర్వాతే చెప్పగలమని కుండబద్దలు కొట్టారు. హెన్రీ ఫోర్డ్ హెల్త్ సిస్టమ్ వంటి పరిశోధనా సంస్థల దగ్గరి నుంచి న్యూయార్క్ వర్సిటీ వంటి ప్రఖ్యాత విశ్వవిద్యాలయాల దాకా అన్నీ ఒకేమాట చెబుతున్నాయి. 'కొన్ని వారాల ప్రయోగ పరీక్షల తర్వాతే హైడ్రాక్సీ క్లోరోక్విన్ కరోనాను నియంత్రిస్తుందా? లేదా? అనేది చెప్పగలం' అని అవి స్పష్టంచేస్తున్నాయి. ఇవన్నీ చెవులారా వింటున్నా.. తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్లు అనేలా ట్రంప్ వాదిస్తున్నారు. ఫ్రాన్స్‌లో జరిగిన ఓ క్లినికల్ ట్రయల్‌ను ప్రస్తావిస్తూ హైడ్రాక్సీ క్లోరోక్విన్‌ను గేమ్ చేంజర్‌గా ఆయన అభివర్ణిస్తున్నారు. త్వరగా ట్రయల్స్ జరగకుండా కొంతమంది కుట్రపన్నుతున్నారంటూ ఆయన ఏకంగా పరిశోధన సంస్థలపైనా విమర్శలు గుప్పిస్తున్నారు. దీన్ని పరిశోధనా సంస్థలు ఎప్పటికప్పుడు ఖండిస్తూ వస్తున్నాయి. ఏదిఏమైనప్పటికీ కరోనా చికిత్సకు కచ్చితమైన ఔషధం లేని ప్రస్తుత పరిస్థితుల్లో మిగతా దేశాల్లాగే అమెరికా కూడా హైడ్రాక్సీ క్లోరోక్విన్‌నే నమ్ముకుందని చెప్పవచ్చు. అయితే ప్రజల ప్రాణాలను బలిగొంటున్న మహమ్మారిని నిలువరించే ఔషధాలపై అమెరికా లాంటి అభివృద్ధి చెందిన దేశపు ప్రభుత్వం, పరిశోధకుల మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడం గమనార్హం.

## 165 మంది అమెరికన్లు స్వదేశానికి తరలింపు

- ఢిల్లీ వరకు 2 ప్రత్యేక విమానాలు



శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చెరుకున్న అమెరికా దేశస్థులు

శంషాబాద్‌రూరల్, ఏప్రిల్ 12 : తెలంగాణలో చిక్కుకున్న 165 మంది అమెరిన్లను ఆదివారం స్వదేశానికి పంపారు. రెండు ప్రత్యేక రిలీఫ్ విమానాలలో ఢిల్లీ వరకు పంపగా, అక్కడ నుంచి అమెరికన్ విమానంలో వారు వెళ్లిపోయారు. రంగారెడ్డి జిల్లా శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి మొదట ఏఐ 1615 ఎయిరిండియా విమానంలో ఒక శిశువుతో సహా 82 మంది మధ్యాహ్నం 3.15 గంటలకు బయలుదేరి ఢిల్లీ వెళ్లారు. ఆ తరువాత ఏఐ1617 విమానంలో 83 మంది వెళ్లారు. ఢిల్లీ నుంచి అమెరికన్ ప్రత్యేక విమానంలో మొత్తం 165 మంది వెళ్లినట్లు ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపారు. వారికి ఇక్కడ కొవిడ్-19 థర్మల్ స్ర్కీనింగ్ టెస్టులు నిర్వహించి పంపినట్లు చెప్పారు. ప్యాసింజర్ టెర్మినల్ భవనాన్ని పూర్తిగా శానిటైజేషన్ చేసిన తరువాతే అందులో నుంచి వెళ్లడానికి అనుమతిచ్చినట్లు తెలిపారు. అమెరికా కాన్సలేట్, తెలంగాణ ప్రభుత్వ సమన్వయంతో పలు విమానాలు రాకపోకలు సాగిస్తున్నాయని చెప్పారు. లాక్‌డౌన్ ప్రకటించినప్పటి నుంచి విదేశీయులను ఏడుసార్లు వారి స్వదేశాలకు పంపినట్లు తెలిపారు. అయితే కార్గో సేవలు మాత్రం నిరంతరం కొనసాగుతున్నట్లు చెప్పారు.

## చైనాలో ఒక్కరోజే 99 కేసులు

బీజింగ్, ఏప్రిల్ 12: కరోనా తీవ్రత తగ్గిపోయిందని ఊపిరి పీల్చుకుంటున్న చైనాలో మళ్లీ వైరస్ కలకలం! శనివారం ఒక్కరోజే అక్కడ 99 పాజిటివ్ కేసులు నమోదు కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. అందులో 97 మంది విదేశాల నుంచి వచ్చినవారేనని చైనా నేషనల్ హెల్త్ కమిషన్ ప్రకటించింది. చైనాలో ఇప్పటివరకూ ఇలా విదేశాల నుంచి వచ్చిన 1280 మందికి వైరస్ పాజిటివ్ వచ్చింది. వీరంతా ప్రపంచంలోని వివిధ దేశాల్లో నివాసం ఉంటున్నవారు. చైనాలో వైరస్ తీవ్రత తగ్గి విదేశాల్లో పెరుగుతుండడంతో ప్రభుత్వం వారిని చైనాకు తరలించింది. అలా తరలించిన వేలాదిమందిలో 1280 మందికి కొవిడ్-19 పాజిటివ్ వచ్చింది. వారిలో 481 మందికి నయంకాగా.. 799 మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. 36 మంది పరిస్థితి విషమంగా ఉంది. వైరస్ సోకినా ఎలాంటి లక్షణాలూ లేనివారివల్ల పెను ప్రమాదం ఉంది కాబట్టి ప్రజలందరూ జాగ్రత్తగా ఉండాలని.. మరికొన్నాళ్లపాటు సామాజిక దూరం పాటించాలని, ఎక్కువ మంది ఒకచోట కలవకూడదని అధికారులు హెచ్చరిస్తున్నారు.



## సముద్రపు నాచుతో కరోనా కట్టడి

- 'రిలయన్స్ రిసెర్చ్' శాస్త్రవేత్తల అధ్యయనం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12 : సముద్రాల్లో ఉండే ఓ రకమైన ఎరుపు నాచుకు కరోనా ఇన్ఫెక్షన్లను నిరోధించే శక్తి ఉందని ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ రిసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ శాస్త్రవేత్తలు గుర్తించారు. పోర్ఫిరీడియం సల్ఫేటెడ్ రకపు ఎరుపు నాచు నుంచి ఉత్పత్తి అయ్యే పాలీ శాకరైడ్‌లు శ్వాసకోశ సమస్యలకు కారణమయ్యే కరోనా కుటుంబానికి చెందిన వైరస్‌ల పాలిట బలమైన యాంటీ వైరల్ ఏజెంట్లుగా పనిచేస్తాయని గుర్తించారు. వీటితో యాంటీ వైరల్ ఔషధాలు తయారీతో పాటు శానిటరీ ఉపకరణాలపై వైరస్ దుర్భేద్యమైన కోటింగ్ వేయవచ్చని వెల్లడించవచ్చని ఓ అధ్యయన పత్రాన్ని విడుదల చేశారు. మరోవైపు రిలయన్స్ లైఫ్ సైన్సెస్ కూడా కరోనా నిర్ధారణ పరీక్షల కిట్ల అభివృద్ధిపై దృష్టిసారించినట్లు సమాచారం. తొలిదశగావాటితో గ్రూపు ఉద్యోగులకు పరీక్షలు నిర్వహించి, ఆ తర్వాత మార్కెట్‌లోకి విడుదల చేస్తారని తెలుస్తోంది.

## నవ్య | చిత్రజ్యోతి

## అనుమతులు లభిస్తే ఎన్95 మాస్కులూ చేస్తాం!

**- లావణ్యా త్రిపాఠీ**



ఎటువంటి లాభాపేక్ష లేకుండా తన స్నేహితురాలైన డిజైనర్ అనితారెడ్డితో కలిసి ప్రజలకు అవసరమైన మాస్కులు తయారు చేయిస్తున్నట్టు కథానాయిక లావణ్యా త్రిపాఠీ చెప్పారు. తమకు అవసరమైన అనుమతులు లభిస్తే వైద్య సిబ్బందికి అవసరమైన 'ఎన్95' మాస్కులు తయారు చేయించడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆమె తెలిపారు. లావణ్యా త్రిపాఠీ మాట్లాడుతూ "చాలామంది సీనియర్ డాక్టర్లను సంప్రదించిన తర్వాత కాటన్‌తో మాస్కులు తయారు చేశాం. మొదట రోజుకి 50 మాస్కులు రెడీ చేశాం. డిమాండ్‌ని బట్టి ప్రొడక్షన్ పెంచాం. ఎంతో సేవ చేస్తున్న వైద్య సిబ్బందికీ మాస్కులు ఇవ్వాలనుంది. అనుమతులు వస్తే ఆ పనీ చేస్తాం. సంక్షోభ సమయంలో వాళ్లకు మన చేతనైనంత మద్దతు ఇవ్వడం ఎంతైనా అవసరం. మాస్కులు తయారు చేయడం వెనుక మా ముఖ్య ఉద్దేశం, మాస్కులు ఆవశ్యకతపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే. కాటన్ మాస్కులు అమ్మడం ద్వారా వచ్చిన డబ్బును తయారు చేస్తున్న వాళ్లకే ఇస్తున్నాం" అన్నారు.

## 30 మందికి ఆశ్రయం... 40 వేల మందికి అన్నదానం...



దేశమంతటా లాక్‌డౌన్ కొనసాగుతున్న నేపథ్యంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేదవారి కోసం నేను సైతం అంటూ సహకరిస్తున్నారు ప్రకాశ్‌రాజ్. ఇప్పటికే పలు ప్రాంతాలకు చెందిన రోజువారీ కూలీలను తన ఫామ్ హౌస్‌లో ఉంచి ఆదుకుంటున్నారు. లాక్‌డౌన్ పొడిగించడంతో మరో 30 మంది పేద కుటుంబాలకు చేయూతనివ్వడానికి సిద్ధమయ్యారు ప్రకాశ్‌రాజ్. ఈ సాయాన్ని కొనసాగిస్తున్నామంటూ ఆయన ట్విట్టర్ వేదికగా తెలిపారు. మరో నటుడు సోనూసూద్ జుహులోని తన హోటల్‌ను ఆరోగ్య కార్మికులకు కేటాయించిన సంగతి తెలిసిందే! మరణించిన తన తండ్రి పేరిట 'శక్తి అన్నదానం' అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ముంబైలో పట్టెడు అన్నం కోసం అలమటిస్తున్న 40వేల మందికి అన్నదానం చేస్తున్నారు. "నిరాశ్రయులైన చాలామందికి భోజనం లభించడంలేదు. వారంతా ఆకలి కడుపుతోనే రోజు గడిపేస్తున్నారు. సాధ్యమైనంత మందికి అండగా ఉండాలన్నదే నా లక్ష్యం' అని సోనూసూద్ తెలిపారు.



## బతకడానికి ఓపిక పట్టలేవా?



కరోనాపై జరిగే పోరాటంలో భాగంగా సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల భారతదేశంలోని అగ్ర నటులు 'ఫ్యామిలీ' అనే షార్ట్‌ఫిల్మ్‌లో కనిపించి సందడి చేశారు. వీరంతా తమ ఇంట్లోనే ఉండి ఈ వీడియో రూపొందించడం విశేషం. ఇప్పుడు బుల్లితెర నటుల వంతు వచ్చింది. ఇటీవల రవికిరణ్ దర్శకత్వంలో 'స్టే హోమ్' లఘుచిత్రం రూపొందింది. ఇందులో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, పరుచూరి గోపాలకృష్ణలతో పాటు 34మంది దక్షిణాది నటీనటులు నటించారు. 29 మంది ఇళ్లలో ఫోన్ కెమెరాలతో 5 భాషల్లో దీన్ని చిత్రీకరించారు. ఇందులో 'పుట్టడానికి 9 నెలలు ఓపిక పట్టావు.. బతకడానికి కొన్ని రోజులు ఓపిక పట్టలేవా?' అని సందేశమిస్తూ ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం చెప్పిన డైలాగ్ ఆకట్టుకుంటుంది. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## వైద్యులపై దాడులా?



"నిరాధారమైన ఆరోపణలతో పొరుగున ఉన్న వైద్యులపై 'చదువుకున్న' వ్యక్తులు దాడి చేశారన్న వార్తలు చదివి కోపం, విసుగు వచ్చాయి. ఎంత మాత్రం జ్ఞానం లేని అటువంటి వ్యక్తులు వరస్ట్ క్రిమినల్స్" అని హిందీ హీరో అజయ్ దేవగణ్ ట్వీట్ చేశారు. వైద్యులపై దాడులను ఆయన ఖండించారు. ఇంతకు ముందు హిందీ చలనచిత్ర ప్రముఖులు రిషి కపూర్, జావేద్ అక్తర్, హేమమాలిని, పరేశ్ రావల్ సైతం వైద్యులపై దాడులను ఖండించారు.

### మా అబ్బాయికి టీషర్టు కుడుతున్నా! : కాజోల్

లాక్‌డౌన్ సమయంలో ఇంటికి పరిమితమైన అజయ్ దేవగణ్ భార్య కాజోల్ ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో మాట్లాడుతూ "మా పిల్లలకు దుస్తులు కుడుతూ నన్ను నేను బిజీగా ఉంచుకుంటున్నా. ప్రస్తుతం మా అబ్బాయి యుగ్‌కి టీషర్టు కుడుతున్నా. మా అమ్మాయికి ఒక డ్రస్ కూడా కుట్టాను" అన్నారు.



## ప్రతిరోజూ ఆదివారమే!

**- రవితేజ**

"నిర్బంధంలో ఉన్నప్పుడు ప్రతిరోజూ ఓ ఆదివారమే" అని రవితేజ అన్నారు. లాక్‌డౌన్ నేపథ్యంలో ఆయన ఇంటిలోనే స్వీయ నిర్బంధంలో ఉంటున్నారు. ఇటీవల ఇంటిలోని జిమ్‌లో వ్యాయామం చేస్తున్నప్పటి ఫొటో పోస్ట్ చేశారు. "ఇంటిలో సురక్షితంగా, ఆరోగ్యంగా ఉండండి" అని పేర్కొన్నారు. తాజాగా ఆదివారం పిల్లలతో కలిసి దిగిన ఫొటోలు పోస్ట్ చేశారు.

## బంధువులకు కరోనా పాజిటివ్

**- వరుణ్ ధావన్**



అమెరికాలో ఉంటున్న తన బంధువులకు కరోనా సోకిందని బాలీవుడ్ హీరో వరుణ్ ధావన్ తెలిపారు. ఆదివారం ఆయన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో ముచ్చటించారు. "కరోనా ప్రభావం రోజురోజుకి పెరుగుతోంది. మా కుటుంబానికి అత్యంత ఆత్మీయులైన ఓ కుటుంబం అమెరికాలో ఉంటోంది. వారికి కరోనా పాజిటివ్ అని వైద్యులు నిర్ధారించారు. కరోనా మహమ్మారిని తక్కువ అంచనా వేయొద్దు. ఇప్పుడున్న పరిస్థితుల్లో చిన్న విషయాన్ని కూడా మనం కఠినంగా తీసుకోవాలి. ఇంట్లోనే ఉండి.. తగిన జాగ్రత్తలు తీసుకోండి. కరోనా కట్టడిలో భాగంగా భౌతిక దూరం పాటించండి" అని వరుణ్ తెలిపారు.

## కరోనా తర్వాత... చైనాలో 'సూపర్ 30'




కరోనా, లాక్‌డౌన్ ఎఫెక్ట్ తర్వాత చైనాలో విడుదల కానున్న తొలి హిందీ చిత్రంగా 'సూపర్ 30' రికార్డులకు ఎక్కనుంది. హృతిక్ రోషన్ నటించిన తొలి బయోపిక్ ఇది. గణిత శాస్త్రజ్ఞుడు ఆనంద్‌కుమార్ జీవితం ఆధారంగా రూపొందింది. రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మించింది. గతేడాది మన దేశంతో పాటు మరికొన్ని దేశాల్లో సినిమా విడుదలైంది. ఇప్పుడు చైనాలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఆల్రెడీ చైనాలో సెన్సార్ కోసం అప్లై చేశారు. "చైనాలో సాధారణ పరిస్థితులు నెలకొని, చిత్ర పరిశ్రమ పనులు ప్రారంభమైనప్పుడు తొలుత 'సూపర్ 30' సెన్సార్ పూర్తవుతుంది. ఆ తర్వాత దేశవ్యాప్తంగా విడుదల చేస్తాం" అని రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సీఈవో శిబాశిష్ సర్కార్ అన్నారు.



కోళ్ల ఫారం వద్ద రద్దీ

## కొనేందుకు వచ్చి కొల్లగొట్టారు!

**అసలే** లాక్‌డౌన్... ఆపై ఆదివారం.. అధికారులేమో మాంసం విక్రయాలు నిషేధించారు. ఎడారిలో వయాసిస్సులా ఓ ఫారంలో కోళ్లు అమ్ముతున్నారనే విషయం ఆ నోటా ఈ నోటా పాకింది. ఇంకేముంది భౌతిక దూరం, మాస్కులు, లాక్‌డౌన్ నిబంధనలు అన్నీ మర్చిపోయారు. కొందరు ఫారంలోకి చొరబడి కోళ్లను ఎత్తుకుపోయారు. వివరాలు.. కర్నూలు జిల్లావ్యాప్తంగా ఆదివారం మాంసం విక్రయాలను అధికారులు నిషేధించారు. ఈ నేపథ్యంలో పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఫారంలో కోళ్లను విక్రయిస్తున్నట్లు తెలుసుకుని జనం భారీగా తరలివచ్చారు. ఈ క్రమంలో కొందరు లోపలికి చొరబడి దొరికిన కోళ్లను దొరికినట్లు పట్టుకుని పారిపోయారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ అధికారులు కోళ్లఫారం యజమానికి రూ.20 వేలు జరిమానా విధించారు. **–డోన్**

## సేవియర్ ఆఫ్ లైవ్స్.. థాంక్యూ నిమ్మగడ్డ

అమరావతి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా ఇటీవలి వరకు బాధ్యతలు నిర్వహించిన నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌కు ప్రజల నుంచి అనూహ్య మద్దతు లభిస్తోంది. కరోనా వ్యాప్తిని నియంత్రించేందుకు స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేసి ఆయన వేలాది ప్రాణాలను కాపాడారంటూ పలువురు పేర్కొంటున్నారు. థ్యాంక్ యూ రమేష్‌కుమార్ సర్ అంటూ ఆదివారం సాయంత్రం ఐదుగంటలకు ప్లకార్డులు ప్రదర్శించారు. సోషల్‌మీడియాలో ఈ సందేశం, ప్లకార్డుల ప్రదర్శన విస్తృతంగా కనిపించింది. స్థానిక ఎన్నికలను వాయిదా వేయకపోయుంటే ఈపాటికి రాష్ట్రంలో వేలమంది ఇబ్బందికర పరిస్థితుల్లో ఉండేవారని, రాష్ట్రాన్ని ఆపద నుంచి కాపాడిన వ్యక్తి రమేష్‌కుమార్ అని ప్రశంసించారు.




## కుక్కలు.. గుంటనక్కలు!

- కరోనా వేళ ట్వీట్ల వార్
- విజయసాయి వర్సెస్ నాగబాబు

అమరావతి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కరోనా వైరస్ విజృంభిస్తున్న వేళ.. రాష్ట్రంలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. ట్విటర్ వేదికగా వైసీపీ నేత విజయసాయిరెడ్డి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ సోదరుడు నాగబాబుకూ మధ్య మాటల యుద్ధం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఎప్పుడో జనవరి మూడో వారంలో మొదలైన ఈ ట్వీట్లు.. కరోనా వైరస్ భయంలో ఉన్న రాష్ట్ర ప్రజలకు తాజాగా రాజకీయ సందడిని చేస్తున్నాయి.

### గుండుసున్నా దేనితో కలిసినా..

గుండు సున్నా దేనితో కలసినా ఫలితం జీరోనే.. సున్నాను తలపైన ఎత్తుకున్నా, చంకలో పెట్టుకున్నా జరిగేదదే. యాక్టర్ నిమిత్త మాత్రుడు. నడిపించేది, వెనుక నుంచి నెట్టేది, డైరెక్టు చేసేది యజమాని స్థానంలో ఉన్న 40 ఇయర్స్ ఇండస్ట్రీనే. **(2020 జనవరి 17)**

### ఎక్కడో హైదరాబాద్‌లో కూర్చుని..

కరోనా ఆపత్కాలంలో రాజకీయాలు చేయకుండా జనసేన స్వీయ నియంత్రణ పాటిస్తోందట. రాజకీయాలు చేయడానికి నీకు గ్రౌండే లేదు కదా పవన్! ఎక్కడో హైదరాబాద్‌లో కూర్చొని 'నేను లేస్తే మనిషిని కాదు' అని చిటికెలేస్తున్నట్లుగా ఉంది నీ వాలకం. ప్రజా తీర్పును అప్పుడే మర్చిపోతే ఎలా? (ఆదివారం)

**- విజయసాయి ట్వీట్లు**

### భయానక పరిస్థితిలో కుటిల రాజకీయం

కోవిడ్ -19 వైరస్‌తో దేశం బాధపడుతోంది. ఇలాంటి టైంలో ప్రజల కోసం తన డబ్బుని కంట్రిబ్యూట్ చేసిన పవన్ కల్యాణ్‌ని.. విదౌట్ ఎనీ ప్రవకేషన్ .. వెటకారంగా విమర్శలు చేసిన మీ వైసీపీ లీడర్స్ విమర్శలను కౌంటర్ చేయాల్సి వచ్చింది. వైసీపీ లీడర్స్ ఒక రకమైన ఫాసిస్టు ధోరణిలో రూల్ చేస్తున్నారు. ఇలాంటి భయంకరమైన పరిస్థితుల్లో కూడా కుటిల రాజకీయం చేయడం మానడం లేదు. ప్రజలు మీకు బుద్ధి చెప్పే రోజు వస్తుంది. విష్ అవర్ కంట్రీ విల్ రికవర్ ఫ్రమ్ దిస్ హార్డ్ టైమ్.

**- నాగబాబు కౌంటర్ ట్వీట్**

### రోషం పొడుచుకొచ్చింది: విజయసాయి

పావలా బ్యాచికి రోషం పొడుచుకొచ్చింది. సిన్మాలు, టీవీ షోలు చేసుకుంటూ పార్టీని గాలికొదిలేసినోళ్లకు రాజకీయాలెందుకు? 2014లోనే మేం పొత్తులు పెట్టుకోలేదు. పొత్తులుండవని జగన్‌గారు మా విధానాన్ని స్పష్టంగా ప్రకటించారు. చిరంజీవి గారి తమ్ముళ్లు కాకపోతే కుక్కలు కూడా మొరగవు.

### నీలాంటి గుంటనక్కలు..: నాగబాబు

నువ్వు చెప్పింది కరెక్టే. ఈ ఎదవ రాజకీయాలు చేయడానికి నీలాంటి గుంటనక్కలున్న సంగతి మాకు తెలుసు విజయసాయిరెడ్డి. మన ఇద్దరి కామన్ స్నేహితుడి ద్వారా నా ఇంటికి వచ్చి పవన్‌తో దోస్తీకి రెడీ అన్న మీ గుంటనక్క రాజకీయాలు నాకు గుర్తున్నాయి. నీలాంటి గొట్టంగాళ్లు నాతో ట్వీట్ చేసే బదులు ఫ్యూచర్‌లో జైల్లో ఎలా టైం పాస్ చెయ్యాలని ఒక డే టుడే షెడ్యూల్ వేసుకో. టైం కలిసి వస్తుంది.

## కువైత్‌లో ప్రవాసాంధ్రులు విలవిల

- మాతృభూమికి తిరిగి రావడానికి అగచాట్లు
- ప్రధాని జోక్యంతో పరిష్కారం దిశగా అడుగులు
- కువైత్‌కు చేరుకున్న భారత వైమానిక దళం

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

కరోనా కారణంగా విధించిన లాక్‌డౌన్‌తో కువైత్‌లో ప్రవాసాంధ్రులు విలవిల్లాడుతున్నారు. వైరస్ తీవ్రతతో వీలైనంత త్వరగా మాతృభూమికి తిరిగి రావడానికి అవస్థలు పడుతున్నారు. కరోనా వ్యాప్తి నివారణలో భాగంగా భారత్, కువైత్ మధ్య కొన్ని వారాలుగా నెలకొన్న వివాదం ప్రధాని నరేంద్ర మోదీ జోక్యంతో కొలిక్కి వస్తోంది. కువైత్ ప్రభుత్వ అనుమతి మేరకు స్వదేశానికి వెళ్లాలనుకుంటున్నవారి ఆరోగ్య పరిస్థితిని సమీక్షించడానికి భారత వైమానిక దళానికి చెందిన వైద్యబృందం ప్రత్యేక విమానంలో శనివారం ఇక్కడకు చేరుకుంది. కువైత్‌లో ఇప్పటి వరకు నిర్ధారణ అయిన కరోనా కేసుల్లో అత్యధికులు భారతీయులు ఉండడంతో వారు నివసిస్తున్న ప్రాంతాలను అక్క డి సైన్యం అదుపులోకి తీసుకుని దిగ్బంధం చేసింది. ఇ క్కడ ఉపాధి రంగం కూడా కుదేలవడంతో వీరంతా సొంత ఊళ్లకు వెళ్లాలని ఆరాటపడుతున్నారు. కువైత్‌లో ఉంటున్న విదేశీయుల్లో 60% భారతీయులు కాగా వారిలో 80% మన రాష్ట్రానికి చెందినవారే. ఇటు విశా ఖ జిల్లా రామాపురానికి చెందిన దామరసింగు శివకుమార్, కృష్ణాజిల్లా కైకలూరుకు చెందిన బాలెలక్ష్మి నుం చి అటు చిత్తూరు జిల్లాకు చెందిన అనిమల రాజేశ్వరి వరకు వందలాది మంది ప్రవాసాంధ్రులు వీలైనంత త్వరగా తిరిగి వెళ్లడానికి ఉవ్విళ్లూరుతున్నారు. వీరిలో చాలామంది వద్ద అసలు పాస్‌పోర్టులు లేకపోవడం కూడా సమస్యగా మారింది. అయితే కరోనా రోగుల్లో సింహభాగం విదేశీయులు, అందునా అత్యధికులు మ నవాళ్లే ఉండటంతో, వీరందరు ఎలాంటి అపరాధ రుసు ము లేకుండా స్వదేశాలకు తిరిగి వెళ్లడానికి వీలుగా కువైత్ ప్రభుత్వం క్షమాభిక్ష ప్రకటించింది. ఈ మేరకు భారత రక్షణ దళాలకు చెందిన వైద్యబృందం కువైత్ చేరుకుంది. ఇక్కడినుంచి తీసుకెళ్లేవారిని కువైత్‌లోనే క్వారంటైన్‌లో ఉంచుతారా, స్వదేశానికి వెళ్లిన తర్వాత పెడతారా అనే అంశంపై ఇంకా స్పష్టత లేదు.

### పాపం రామకృష్ణ

కువైత్‌లో మహ్బూలా ప్రాంతంలో రాష్ట్రానికి చెందిన గుండా చిన్న రామకృష్ణ (29) గుండెపోటుతో రోడ్డుపైనే మరణించినా.. కరోనా భయంతో ఎవరూ మృతదేహం వద్దకు వెళ్లే సాహసం చేయలేదు. ఆ ప్రాంతంలో ఎక్కువగానే ఉంటున్న తెలుగువారు కూడా రామకృష్ణను పట్టించుకోదు. పోలీసులు మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. అతడు గుండెపోటుతో మరణించాడని వైద్యులు తేల్చారు.

## అమెరికా చరిత్రలోనే భారీ ఉపద్రవం



### కరోనాతో వైద్య బృందం యుద్ధమే చేస్తోంది

- కంటికి కనిపించని శత్రువుతో పోరాటం ఇది
- నర్సుల సేవలు వెలకట్టలేనివి
- 'ఆంధ్రజ్యోతి'తో ప్రవాసాంధ్ర వైద్యుడు మధు కొర్రపాటి

(న్యూయార్క్ నుంచి కిలారు అశ్వనీ కృష్ణ)

*కరోనా వైరస్ అమెరికా చరిత్రలోనే అతిపెద్ద ఉపద్రవమని ప్రవాసాంధ్ర వైద్యుడు మధు కొర్రపాటి అన్నారు. న్యూయార్క్‌లో తెలుగువారు ఎక్కువగా నివసిస్తున్న లాంగ్ ఐలండ్ లోని సెయింట్ జోసఫ్ ఆస్పత్రిలో ఆయన రెండు దశాబ్దాల నుంచి నెఫ్రాలజిస్ట్‌గా సేవలందిస్తున్నారు. గుంటూరు జిల్లాకు చెందిన మధు... పలు సేవ, సామాజిక కార్యక్రమాల్లోనూ చురుగ్గా పాల్గొంటున్నారు. అమెరికాలో ప్రముఖ తెలుగు సంస్థ నాట్స్ బోర్డ్ చైర్మన్‌గా పనిచేసి, ప్రస్తుతం డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ప్రస్తుతం ఆయన పనిచేస్తున్న ఆస్పత్రిలో అందిస్తున్న కరోనా వైద్యసేవల గురించి ఆయన 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే....*

#### సర్వశక్తులూ ఒడ్డుతున్నాం

"గత మూడు వారాలుగా నా జీవితంలోనే అత్యంత బిజీగా ఆస్పత్రిలో గడుపుతున్నాను. కంటికి కనిపించని శత్రువుతో వైద్య సిబ్బంది చేస్తున్న పోరాటం ఇది. ఈ మహమ్మారిని నుంచి మనల్ని మనం రక్షించుకోవాలో తెలియని పరిస్థితి. అయితే ఆస్పత్రి నుంచి మాకు రక్షణ కవచాలు ముందుగానే అందడం ఒక రకంగా అదృష్టమనే చెప్పాలి. ఈ పోరాటంలో అత్యవసర సైనికుడిగా నేను చేయగలిగినంత చేస్తున్నాను. కానీ నాకు, నా సహచరులకు కరోనా నుంచి పెనుప్రమాదం పొంచి ఉందని తెలుసు. అత్యంత ప్రమాదకరమైన పరిస్థితుల్లో కూడా మేం పోరాటం కొనసాగించక తప్పదు. అది మా బాధ్యత కూడా. దాన్ని సమర్థంగా నిర్వహించేందుకు డాక్టర్లు, నర్సులు అందరూ సర్వశక్తులు ఒడ్డుతున్నారు. రోగుల ప్రాణాలు కాపాడేందుకు శక్తికి మించి కష్టపడుతున్నారు.

#### నర్సులకు పాదాభివందనం చేస్తా

నా బాధ, ఆవేదనంతా డయాలసిస్ చేస్తున్న నర్సుల గురించే. ఆ మహమ్మారి సోకిన ఒక్కో వ్యక్తి వద్ద కనీసం 3గంటల పాటు వీరు బెడ్ పక్కనే ఉండాల్సిన పరిస్థితి. దీన్నిబట్టి వారు ఎంత ప్రమాదకరమైన స్థితిలో ఉన్నారో అర్థమవుతుంది. రోజంతా పనిచేస్తున్న నర్సులు కూడా ఉన్నారు. షిఫ్ట్ సమయం కంటే రెండు రెట్లు ఎక్కువగా నర్సులు పనిచేస్తున్నారు. ఈ మహమ్మారి నుంచి బయటపడిన తర్వాత నర్సుల పాదాలు తాకి శిరసాభివందనం చేస్తాను. వారు చేస్తున్న సేవ, త్యాగం అలాంటివి.

#### ఇప్పుడు వాళ్లే ప్రత్యక్ష దైవాలు

కరోనాపై పోరాడుతున్న ఆరోగ్య సంరక్షణ కార్యకర్తలు, వైద్యులు, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, ఇంకా అత్యవసర సేవలు అందించే ప్రతి ఒక్కరూ తమ ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాడుతున్నారు. నాకు వాళ్లే ఇప్పుడు ప్రత్యక్ష దైవాలుగా కనిపిస్తున్నారు. సేవాభావంతో రోజూ ఆహారాన్ని అందిస్తున్న చిన్న రెస్టారెంట్ల యాజమానులు, వలంటీర్లను కూడా ప్రత్యేకంగా అభినందించాలి. కరోనాపై పోరాటంలో తమ ప్రాణాలను త్యాగం చేసిన వారికి వార్షిక వేతనానికి నాలుగైదు రెట్లు ప్రభుత్వమైనా, మరే లాభాపేక్షలేని సంస్థయినా చెల్లించాలన్నది నా కోరిక. అందరినీ ఆ దేవుడు చల్లగా చూడాలని కోరుకుంటున్నాను. మళ్లీ మనకు పాత రోజులు తిరిగి వస్తాయని ఆశిద్దాం. అప్పుడు తోటి మనిషిని చూసి భయపడాల్సిన అవసరం ఉండదు. ఇది త్వరగా జరగాలని కోరుకుందాం."

#### మాకు చప్పట్లు కొట్టండి

ప్రస్తుత పరిస్థితుల్లో కొంతమంది వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు ఆందోళన, నిరాశకు గురవుతున్నారు. కాబట్టి ముందుగా ఈ సమయంలో మాకు చప్పట్లు కొట్టి అభినందించాలి. వెలకట్టలేని మా సేవలను కొనియాడుతూ ప్రోత్సహించడం ఈ సమయంలో ఎంతో అవసరం.

#### మనం ఏం చేయాలంటే....

"సామాజిక దూరం పాటిస్తూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించడం. మరికొన్ని రోజులు ఇంట్లోనే ఉండాలనే ప్రభుత్వ ఆదేశాలు పాటించడం. ఒకవేళ బయటకు రావాలంటే మాస్కులు, గ్లౌజులు ధరించండి. బయట నుంచి ఇంటికి వస్తే మీ చేతులను కనీసం 20సెకన్ల పాటు కడుక్కోండి. లేదా స్నానం చేయండి. ప్రాసెస్డ్ ఆహారానికి దూరంగా ఉండాలి. చక్కెర ఎక్కువగా ఉండే స్నాక్స్, కూల్‌డ్రింక్స్ పూర్తిగా మానేయండి. రోజూ వ్యాయామం, ప్రాణాయామం చేయండి. ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పెంచుకోవడమే లక్ష్యంగా శ్వాసకు సంబంధించిన వ్యాయామాలు వీలైతే పెద్దగా మంత్రంలా జపిస్తూ చేసినా మంచిదే."

## వైసీపీతో ప్రజల ప్రాణాలకు ముప్పు

- మానవ హక్కుల కమిషన్‌కు టీడీపీ లేఖ

అమరావతి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): వైసీపీ నేతల వల్ల రాష్ట్రంలో ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడే పరిస్థితి ఏర్పడిందని పేర్కొంటూ మానవ హక్కుల కమిషన్(హెచ్‌ఆర్‌సీ)కు తెలుగుదేశం పార్టీ ఫిర్యాదు చేసింది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిమిడి కళా వెంకట్రావు ఆదివారం ఈ మేరకు హెచ్‌ఆర్‌సీకి లేఖ రాశారు. వైరస్ వ్యాధి వ్యాప్తిని నిరోధించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు లాక్‌డౌన్ నిబంధనలు అమలు చేస్తున్నాయని, కానీ వైసీపీ నేతలు వాటిని ఉల్లంఘించి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, వారి వల్లే వైరస్ వ్యాప్తి అయ్యే పరిస్థితి ఏర్పడుతోందని ఆయన తన లేఖలో పేర్కొన్నారు.

## కరోనాపై జగన్‌ది నిర్లక్ష్య ధోరణి

- కాంట్రాక్టర్లకు రూ.కోట్లు... వైద్యులకు పీపీఈలివ్వరా? : టీడీపీ

అమరావతి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ వ్యాప్తిపై సీఎం జగన్‌కు ఏమాత్రమూ అవగాహన లేదని, చాలా నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారని టీడీపీ నేతలు ధ్వజమెత్తారు. చైనాలో వైరస్ మళ్లీ తిరగబెడుతుంటే, రాష్ట్రంలో కరోనాని జగన్ సీరియస్‌గా తీసుకోవడం లేదని మాజీ మంత్రి ఆలపాటి రాజా విమర్శించారు. రాష్ట్రంలో 400లకుపైగా పాజిటివ్ కేసులుంటే, కరోనా 39 మండలాలకే పరిమితమైందని ప్రధానికి చెప్పడం జగన్ నిర్లక్ష్యానికి నిదర్శమని ఆదివారం మీడియాతో అన్నారు. ప్రపంచమంతా కరోనాపై యుద్ధం చేస్తుంటే, జగన్ మాత్రం ప్రజల ప్రాణాలు గాలికొదిలేసి, ఎన్నికల కమిషనర్ విషయంలో పట్టుదలగా యుద్ధం చేస్తున్నారని టీడీఎల్పీ ఉపనేత నిమ్మల రామానాయుడు విమర్శించారు. లాక్‌డౌన్ ఉల్లంఘించిన నూతన ఎన్నికల కమిషనర్ కనగరాజు, మంత్రి సురేశ్, ఎంపీ విజయసాయిరెడ్డిలపై ఏం చర్యలు తీసుకున్నారని జగన్‌కు రాసిన లేఖలో నిలదీశారు. రాష్ట్రంలో సోడియం హైపోక్లోరైట్ ద్రావణం పిచికారిని ఆపాలని ఈ ద్రావణం కరోనా వైరస్ నియంత్రణకు పనిచేయదని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెప్పిందని, పైగా దానివల్ల దుష్ఫలితాలు వస్తాయని గోరంట్ల బుచ్చయ్యచౌదరి ట్వీట్ చేశారు. అడ్డొచ్చిన వాళ్లందరినీ తొలగిస్తూ జగన్ ఫ్యాక్షన్ నైజం ప్రదర్శిస్తే, కోర్టుల్లో చీవాట్లు తప్పవని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు. కమిషన్ల కోసం కాంట్రాక్టర్లకు వేల కోట్ల రూపాయలు చెల్లించి, రాజధాని రైతులకు కౌలు సొమ్ము ఇవ్వకపోవడం, కరోనాపై పోరులో వైద్యులకు తగిన రక్షణ పరికరాలు సమకూర్చకపోవడం దుర్మార్గమని రేపల్లె ఎమ్మెల్యే సత్యప్రసాద్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

## నెలాఖరు వరకు లాక్‌డౌన్ కొనసాగించాలి: కన్నా

రాష్ట్రంలో ప్రస్తుతం కొనసాగుతున్న లాక్‌డౌన్‌ను ఏప్రిల్ నెలాఖరు వరకు కొనసాగించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సీఎం జగన్‌కు లేఖ రాసినట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రంలో లాక్‌డౌన్‌ను ఉపసంహరించి, కోవిడ్-19 ప్రభావిత ప్రాంతాలు, రీజియన్లలో మాత్రమే అమలు చేయాలనే నిర్ణయం తగదని పేర్కొన్నారు.

## పంచాయతీ, మున్సిపాలిటీల్లో ఫ్రీజింగ్ ఎత్తేయండి

- సీఎంకు ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్ లేఖ

అమరావతి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గత 45 రోజులుగా గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో నిధులు వినియోగించకుండా ప్రభుత్వం ఫ్రీజింగ్ విధించిందని.. దీనిని వెంటనే ఎత్తేయాలని ఏపీ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షులు వైవీబీ రాజేంద్రప్రసాద్ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి లేఖ రాశారు. కరోనా పీడిస్తున్న ఈ తరుణంలో గ్రామాల్లో, పట్టణాల్లో పారిశుధ్య పనులను విస్తృతంగా చేపట్టాలని ప్రభుత్వం ఆదేశించిన విషయం గుర్తుచేశారు. కేంద్రం ఇచ్చిన నిధులతో పాటు పంచాయతీలు, మున్సిపాలిటీల సాధారణ నిధులను డ్రా చేసుకోనీయకుండా నిలిపేయడం దారుణమన్నారు.

## మనోభావాలు దెబ్బతీయడం నా ఉద్దేశం కాదు

- ముస్లింలకు నారాయణస్వామి క్షమాపణలు

పుత్తూరు, అమరావతి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ముస్లింలపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలకు ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి క్షమాపణలు చెప్పారు. ముస్లింల మనసు గాయపడి ఉంటే క్షమించాలని కోరారు. 'ముస్లింలు ప్లేట్లు, స్పూన్లు నాకుతూ కరోనాను వ్యాప్తిచేస్తున్నట్లు వీడియోల్లో చూశాను' అంటూ శనివారం ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. క్షమాపణ చెప్పాలని మత పెద్దలు డిమాండ్ చేశారు. సొంత పార్టీలోనూ ఒత్తిడి పెరిగింది. దీంతో ఆదివారం ఆయన పుత్తూరులో విలేకరులతో మాట్లాడుతూ ఆ వ్యాఖ్యల్ని ఉపసంహరించుకుంటున్నట్లు వివరణ ఇచ్చారు. భావ వ్యక్తీకరణ లోపం కారణంగానే తన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయని.. ముస్లింల మనోభావాలు దెబ్బతీయడం తన అభిమతం కాదని చెప్పారు.



తుళ్లూరులో నిరసన తెలుపుతున్న మహిళలు

## నమ్మించి మోసం చేశారు!

- లాక్‌డౌన్‌లోనూ మార్మోగిన అమరావతి నినాదం
- నిర్ణయం వెనక్కి తీసుకోకుంటే పోరు ఉధృతం
- 117వ రోజూ కొనసాగిన రాజధాని రైతుల ఆందోళనలు

గుంటూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మాట తప్పం.. మడమ తిప్పమని చెప్పి తమను నమ్మించి మోసం చేశారని అమరావతి ప్రాంత రైతులు సీఎం జగన్ తీరుపై మండిపడుతున్నారు. అమరావతి నుంచే పాలన సాగించాలంటూ ఆ ప్రాంత రైతులు, కూలీలు, మహిళలు చేస్తోన్న ఆందోళనలు ఆదివారానికి 117వ రోజుకు చేరాయి. మా నాయకుడు ఇక్కడే ఇల్లు కట్టుకున్నాడని, అమరావతి ఆగదని ఎన్నికల సమయంలో చెప్పిన పెద్దలు ఏమైపోయారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అమరావతిని ఏకైక రాజధానిగా కొనసాగించాలంటూ డిమాండ్ చేస్తూ వాడవాడలా మహిళలు, రైతులు ఆందోళనలు చేశారు.

### ఇంటింటా అమరావతి ఉద్యమం

దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ కొనసాగుతున్న సమయంలో రాజధాని 29 గ్రామాల్లో వాడవాడలా అమరావతి నినాదం మారుమోగింది. రైతులు, మహిళలు బృందాలుగా ఏర్పడి తమ ఇళ్ల వద్దే ప్రభుత్వ మూడు రాజధానుల నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ నినాదాలు చేశారు. తుళ్లూరు, పెదపరిమి, వెలగపూడి, రాయపూడి, వెంకటపాలెం, కృష్ణాయపాలెం, యర్రబాలెం, నీరుకొండ, అనంతవరం, నెక్కల్లు, మందడం, ఉద్దండరాయునిపాలెం, నేలపాడు తదితర గ్రామాల్లో రైతులు, మహిళలు జై అమరావతి, సేవ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు. మూడు రాజధానుల నిర్ణయం వెనక్కి తీసుకోకపోతే ఉద్యమం తీరు మార్చి మరింత ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు. సంవత్సరం క్రితం వేల సంఖ్యలో కార్మికుల పనుల సందడితో, పెద్ద పెద్ద నిర్మాణ పరికరాల ధ్వనులతో ఓ వెలుగు వెలిగిన అమరావతి ప్రాంతం తిరిగి ఆ వెలుగు సంతరించుకోవాలని కోరుతూ రైతులు, మహిళలు 'అమరావతి వెలుగు' కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ప్రతి ఇంటా రాత్రి 7.30 నుంచి 7.35 వరకు విద్యుత్ నిలిపివేసి కొవ్వొత్తులు వెలిగించి నిరసనలు తెలిపారు. 29 గ్రామాల మహిళలు కొవ్వొత్తులతో రోడ్లపై మానవహారాలుగా ఏర్పడి ఆందోళన వ్యక్తం చేశారు. అలానే స్థానిక ఎన్నికలు వాయిదా వేసి కరోనా భారీ నుంచి రాష్ట్రాన్ని కాపాడారంటూ నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలుపుతూ ప్లకార్డులు ప్రదర్శించారు.

## బీజేపీలో చేరే ప్రసక్తే లేదు: జేసీ

తాడిపత్రి, ఏప్రిల్ 12: తాను బీజేపీలో చేరే ప్రసక్తే లేదని టీడీపీ మాజీ ఎంపీ జేసీ దివాకర్‌రెడ్డి తేల్చిచెప్పారు. ఆదివారమిక్కడ తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ హయాం నుంచి తమ కుటుంబం బీజేపీలో చేరాలంటూ అధిష్టానం పెద్దల నుంచి ఆహ్వానం ఉందన్నారు. బీజేపీ కార్యాధ్యక్షుడు జేపీ నడ్డా నుంచి కిందిస్థాయి కార్యకర్త వరకు తనను బీజేపీలోకి రావాలని కోరుతున్నారని.. గతంలో నడ్డాను కలిసినప్పుడు కూడా ఇదే విషయం చెప్పారని తెలిపారు. ఆహ్వానాన్ని ఎన్నోసార్లు సున్నితంగా తిరస్కరించానన్నారు. ఆంధ్రాలో కరోనా కేసులు తక్కువ ఉన్నాయని చంకలు గుద్దుకోవాల్సిన అవసరం లేదని చెప్పారు. కరోనా భయం అందరికి ఉందన్నారు. తాడిపత్రి ఎమ్మెల్యే పాలన బాగా ఉందని.. ఆయన ఎంతో కృషి చేస్తున్నాడంటూ ఎద్దేవా చేశారు.




# వివిధ



## మా ఇంట్లో అతని ఛాయాచిత్రముంటుంది



బలి అర్పణకు
ఇచ్చేది మేకలనేగానీ బలమైన సింహాలను కాదనీ
బతికినంతకాలం సింహాల్లానే బతకాలన్న
బాబా సాహేబ్ మా కళ్ళకి దేవుడులా కనిపిస్తాడు

దాక్షిణ్యానికి దేశీయ తీగలు ఎంతకూ సాగనిచోట
అలమటకు అలసటకూ సాంత్వన కలిగించినవాడు
అలమటిస్తే ఆకలికి రోటీనిచ్చే విద్యనిచ్చినవాడు
కడపటి మనుషులకూ - కడివెడు మంచినీళ్ళకూ
అంటేమిటన్నవాడెవడైనా దైవంలా కనబడతాడు

ఏ దేవుడి కార్నివాళ్ళూ కాళ్ళుపెట్టలేని మా వీధుల్లో
ఏ దేవాదాయమూ తొంగిచూడని ఇరుకు సందుల్లో
నీలిరంగు విగ్రహాలు ఈఫిల్ స్తూపాలౌతాయి
ఏ కూడికలూ జరగని మా విన్నపాల గదిలో
'బోధించు-సమీకరించు-పోరాడ'మనే నినాదాలతో
నవయానా ముషాయిరాలు గొంతుకలుపుతాయి

ఏ ఆత్మజ్ఞాన గ్రంథాలూ దొరకని మా ఇంట్లో
రాజ్యాంగ ఉద్గ్రంథం జ్ఞాననేత్రం తెరుచుకుంటుంది
చెడువాసన పోవాలంటే కులం పెంట పోవాలనే
వాక్యం పదునెక్కుతుంటుంది

సామాజిక ఎడబాటు ఎంత ఘోరమో
రోగిష్టి సమాజానికి చెప్పేదెవడు!
ఒకడు సత్యంతో ప్రయోగాలు చేశానన్నప్పుడు
ఈ అభినవ బోధిసత్వుడు సత్యమే మాట్లాడుతూ వచ్చానన్నాడు
సత్యమే కనబడని సత్యాగ్రహాన్ని నమ్మను పొమ్మన్నాడు
తనది సత్యకామజాబాలి మార్గమన్నాడు

మా ఇంట్లో అతని ఛాయాచిత్రముంటుంది
మా హృదయాల్లో ఆత్మల్లో ఆయనుంటాడు
గోడ ఫ్రేములమీద పొదిగిన ఉల్లేఖనాలై కనబడతాడు
మా పుస్తకాల అలమారల్లో
మస్తకాల పొరల్లో కొలువుదీరి ఉంటాడు

■ తుల్లిమల్లి విల్సన్ సుధాకర్
95380 53030
(రేపు అంబేద్కర్ జయంతి)

**కళ పత్రిక - కవితల పోటీ**

కళ పత్రిక తెలంగాణ సీఎం కేసీఆర్ పిలుపు ప్రేరణతో కరోనాపై నిర్వహిస్తున్న కవితల పోటీకి కరోనాపై ప్రజల్లో అవగాహన తెచ్చే కవితలను కవులు 9848992826కు వాట్సాప్‌కానీ, kalapatrika@gmail.comకు ఈమెయిల్‌గానీ ఏప్రిల్ 30లోగా పంపగలరు.

మహమ్మద్ రఫీ

**తెలంగాణ సామాజిక రచయితల సంఘం - కవితల పోటీ**

'కోరలు చాచిన కరోనాను అంతం చేద్దాం' అంశంపై కవితలను 20లైన్లకు మించకుండా 9848811424కు వాట్సాప్‌కానీ, rajeshamravula@gmail.comకు ఈమెయిల్ గానీ ఏప్రిల్ 19లోగా పంపాలి.

కామిడి సతీష్ రెడ్డి

# రగిలిన హృదయాలకు 'రాహత్'

ఆయనో గజల్ ఝురి. తన షాయిరీతో జలపాతాలను నిలువరిస్తాడు. సూర్యుడితో సంభాషిస్తాడు. కన్నుగీటి జాబిలిని ఆకాశం నుంచి డాబా మీదికి దింపుతాడు. ప్రియురాలి కౌగిలిలో ఉక్కిరిబిక్కిరి అవుతున్న గజల్‌కు బంధనాలు తెంచేసి స్వేచ్ఛనిస్తాడు. షాయిరీ రసజ్ఞులను కాల్పనిక ప్రపంచం నుంచి వాస్తవంలోకి తీసుకొస్తాడు. జీవితంలోని చేదు నిజాలకు పర్దా తొలగిస్తాడు. దైవం, మతం, మత కలహాలు, మానవత్వం, రాజకీయాలు, దేశభక్తి, కపటత్వం, చట్టం, న్యాయం, వివక్ష, ముస్లింలు, ఉగ్రవాదం... ఇలా అన్నింటి పైనా గజళ్లు రాసి ఉర్దూ షాయిరీలో తనకంటూ భారత్‌లోనే కాకుండా విదేశాలలో సైతం విశిష్ట స్థానం సంపాదించుకున్నాడు. ఆయనే ప్రముఖ ఉర్దూ షాయర్ రాహత్ ఇందోరీ. గత 50ఏళ్లుగా అసంఖ్యాకమైన ముషాయిరాలలో తన కవితను వినిపించిన రాహత్... గజల్‌కు కొత్త వన్నెలద్దాడు. ఆయన ముషాయిరా వేదికపై ఉంటే అర్ధరాత్రి కాదు... తెల్లవారుజాముదాకా కూడా నిద్ర కాచేందుకు సిద్ధపడే ఆహూతులు కోకొల్లలు. ముస్లిం అస్తిత్వవాదానికి పెద్దపీట వేసిన రాహత్‌కు మతాలకతీతంగా అసాధారణమైన ఆదరణ ఉంది. ఉర్దూలో 'రాహత్' అంటే ఊరట అని అర్థం. పేరుకు తగ్గట్లుగానే అనేక సమస్యలతో సతమతమయ్యేవారికి ఆయన షాయిరీ సాంత్వన కలిగిస్తుంది.

మధ్యప్రదేశ్‌లోని ఇందోర్‌లో 70ఏళ్ల క్రితం పుట్టిన రాహత్ అసలు పేరు రాహత్ కురేషీ. ఆయన గొప్ప కవే కాదు అద్భుతమైన పెయింటర్, బాలీవుడ్‌లో ప్రముఖ గీత రచయిత కూడా. గజల్, నజ్మ్, రుబాయీలు రాయడం ఒక ఎత్తయితే ముషాయిరాలలో వాటిని ఆహూతుల మనసుకు హత్తుకునేలా శక్తిమంతంగా చెప్పగలగడం చాలా ముఖ్యం. ఈ కళలో ఆయన పండిపోయారు. ఇందోర్ యూనివర్సిటీలో రాహత్ 30 ఏళ్లపాటు విద్యార్థులకు ఉర్దూ సాహిత్యాన్ని, షాయిరీని బోధించారు. గజల్‌ను, నజ్మ్‌ను ఎలా చదవాలి? ఎలా అధ్యయనం చేయాలి? ఎలా బోధించాలి? వాటిలోని ప్రతీకాత్మక భావనలను, గాఢతను, నిగూఢతను ఎలా అర్థం చేసుకోవాలి? ఇలాంటి విషయాలన్నీ ఆయనకు కరతలామలకం. అందుకే ఆయన ముషాయిరా వేదికలపై అంతే ఉత్సాహంగా గజల్ వినిపించి ఆహూతులను మంత్రముగ్ధుల్ని చేస్తారు. దశాబ్దాల తరబడి షాయిరీ రాస్తున్నా ప్రాసంగికతను కోల్పోని అరుదైన షాయర్ ఆయన. ఎందుకంటే ఏళ్ల క్రితం రాసిన గజళ్లు కూడా ప్రస్తుత వాతావరణానికి అద్దం పడతాయి. రాహత్ తన కవితా ప్రస్థానంలో ప్రభుత్వాలు, రాజకీయ నాయకులు, కోర్టులు, మీడియా ఎవర్నీ ఖాతరీ చేయలేదు. మన దేశంలో ఎన్నికలు వచ్చినప్పుడు పరిస్థితి ఎలా ఉంటుందో ఈ షేర్‌లో చెప్పారు:

"సరహదోం పర్ బహుత్ తనావ్ హై క్యా?
కుఛ్ పతా తో కరో, చునావ్ హై క్యా?"
(సరిహద్దుల్లో తీవ్ర ఉద్రిక్తతలున్నాయా?
అడిగి చూడు, ఎన్నికలు జరగబోతున్నాయా?)

"ఫైస్లా జో కుఛ్ భీ హో మంజూర్ హోనా చాహియే
జంగ్ హో యా ఇష్క్ హో భర్పూర్ హోనా చాహియే!"
(నిర్ణయం ఏదైనా మనమంతా సమ్మతించాల్సిందే!
రణమైనా, ప్రణయమైనా మనసారా చేయాల్సిందే!!)

భారత్, పాకిస్థాన్ మధ్య వివాదాల్లో అమెరికా పదేపదే వేలుపెట్టడాన్ని కవి తప్పుబడతాడు. భారత్, పాక్, అమెరికాలకు హిందూ, ముస్లిం, క్రైస్తవ మతపెద్దలను ప్రతీకలుగా పేర్కొంటూ ఇలా చెప్పాడు:

"ఖౌఫ్ బిఖరా హై దోనోం సంతోం మే
తీసరీ సంత్ కా దబావ్ హై క్యా?"
(ఇరువురు మతపెద్దల్లో భయాలున్నాయి.
మూడో మతపెద్ద ఒత్తిళ్లున్నాయా?)

భిన్న మతస్థులు, కులస్థులు పలు అనుమానాలు, అపోహలతో కలిసి జీవించే భారత్ ప్రత్యేకత ఏంటో వివరిస్తాడు రాహత్:

"హమ్ అప్నీ జాన్ కే దుష్మన్ కో అప్నీ జాన్ కహ్తే హైc
మొహబ్బత్ కీ ఇసీ మిట్టీ కో హిందుస్థాన్ కహతే హైc"
(ఆగర్భ శత్రువును మనం ప్రాణంగా భావిస్తాం!
ప్రేమను పంచే ఈ భూమిని భారత్‌గా భావిస్తాం)

న్యూయార్క్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్‌ను ఉగ్రవాదులు పేల్చేసిన తర్వాత ఉర్దూ ముషాయిరాల ఇతివృత్తాలే మారిపోయాయి. బాబరీ మసీదు కూల్చివేత, గుజరాత్ మత కలహాలు, దేశంలో అనేక చోట్ల బాంబు పేలుళ్ల అనంతరం విధ్వంసకారులను ఎండగట్టడం, దేశ ఐక్యత, సమగ్రత కోసం పాటుపడడం, దేశభక్తిని చాటుకోవడం షాయర్లకు అనివార్యతలుగా మారాయి. భారత సమాజంలో మతపరంగా చీలికలు షాయర్లపై తీవ్ర ప్రభావమే చూపించాయి. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సంఘ్‌పరివార్ ఎజెండా అమలు, మైనారిటీలపై మూకదాడులు పెరగడం, బలవంత మతమార్పిడులు, సహిష్ణుత ప్రశ్నార్థకమై ఊపిరాడని వాతావరణం నెలకొంది. ఈ పరిస్థితుల్లో ముస్లిం షాయర్ల గొంతు క్రమంగా బలహీనమవుతూ వచ్చింది. ఇలాంటి సమయంలో చెక్కుచెదరని ఆత్మవిశ్వాసంతో, సత్యసంధతతో ముస్లిం అస్తిత్వవాదంపై షాయిరీ చెపుతున్న కొద్దిమంది కవులలో రాహత్ ఒకరు. పౌరసత్వ సవరణ చట్టానికి, ఎన్నార్సీ, ఎన్పీఆర్‌కు నిరసనగా ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన ముషాయిరాలో ఆయన చెప్పిన షాయిరీ ఎంతో మందిని మంత్రముగ్ధుల్ని చేసింది. గత ఆరేళ్లలో ప్రధాని మోదీని రాహత్ ఇందోరీ విమర్శించినట్లుగా బహుశా ఏ కవీ, కళాకారుడూ వ్యాఖ్యలు చేసి ఉండరు. సీఏఏ గురించి ప్రస్తావిస్తూ ఈ షేర్‌లు చెప్పారు:

"అప్నీ పహెచాన్ మిటానే కో కహా జాతా హై
బస్తియాc ఛోడ్ కే జానే కో కహా జాతా హై"
(మన అస్తిత్వాన్నే తుడిచిపెడతామంటారు
బస్తీలు వదిలి ఎక్కడికో పొమ్మంటారు)



> **"మై అప్నీ లాష్ లియే ఫిర్ రహా హూc కాంధే పర్
> యహాc జమీన్ కీ కీమత్ బహుత్ జ్యాదా హై"**
> **(నేను నా శవాన్ని భుజాలకెత్తుకుని తిరుగుతున్నా
> ఇక్కడ భూమి రేటు చాలాచాలా ఎక్కువ)**

హమీ బునియాద్ కా పత్థర్ హైc లేకిన్
హమే ఘర్ సే నికాలా జా రహా హై
(మేమే ఇంటికి పునాదిరాళ్లం, కానీ
మమ్మల్ని బయటకు వెళ్లగొడుతున్నారు)

పొంచి ఉన్న శత్రువులపై ఎలా పోరాడాలో చెబుతున్నాడిలా:

"మై జాన్తా హూc కి దుష్మన్ భీ కమ్ నహీc హైc
లేకిన్ హమారీ తరహ్ హథేలీ పే జాన్ థోడీ హై"
(నాకు తెలుసు- శత్రువులు తక్కువేమీ లేరు.
కానీ, మాలా తెగువ చేసేవాళ్ళెవరూ లేరు)

ఈ దేశం అన్ని కులాలూ, మతాల వారిదీ అని అంటాడాయన:

"సభీ కా ఖూన్ హై షామిల్ యహాc కీ మిట్టీ మే
కిసీ కే బాప్ కా హిందుస్థాన్ థోడీ హై"
(ఈ నేలలో మనందరి రక్తం ఇంకింది.
భారత్ ఎవడబ్బ దేశం కాదు!)

భారత్-పాక్ సంబంధాలు బలపడాలనీ, శాంతి విరబూయాలనీ రాహత్ కోరుకుంటాడు. అయితే కాలానుగుణంగా మనం ఎలా మారాలో చెపుతున్నాడు:

"జో తౌర్ హై దునియా కా, ఉసీ తౌర్ సే బోలో
బెహరోం కా ఇలాకా హై, జరా జోర్ సే బోలో
దిల్లీ మే హమ్ హీ బోలా కరే అమన్ కీ బోలీ
యారో, కభీ తుమ్ లోగ్ భీ లాహోర్ సే బోలో"
(లోకం తీరులోనే మనమూ మాట్లాడాలి
ఇది చెవిటి మా'లోకం', ఇంకా గట్టిగా చెప్పాలి
శాంతిపై దిల్లీలో మనమే మాట్లాడుతున్నాం
మిత్రులారా, మీరైనా లాహోర్‌తో మాట్లాడండి)

కవి తన సత్యసంధత, రుజువర్తన గురించి ఎంత ఆత్మవిశ్వాసంతో చెప్పుకుంటున్నాడో చూడండి.

"మేరా జమీర్, మేరా ఎతెబార్ బోల్తా హై!
మేరీ జుబాన్ సే పర్వర్‌దిగార్ బోల్తా హై!!"
(మనస్సాక్షిగా, విశ్వాసంతో చెపుతున్నా
నాచేత ప్రతీ మాటా ఆ దేవుడే పలికిస్తాడు!!)

ప్రతికూల పరిస్థితుల్లో ధైర్యంగా ఎలా ఏటికి ఎదురీదాలో కవి చెపుతున్నాడీ షేర్‌లో:

"తూఫానోం సే ఆంఖ్ మిలావో, సైలాబోం పర్ వార్ కరో
మల్లాహోం కా చక్కర్ ఛోడో, తైర్ కే దరియా పార్ కరో"
(తూఫాన్లను నేరుగా ఢీకొట్టు, ఉప్పెనలపై విరుచుకుపడు
నావికులపై ఆశలొద్దు, నదిని ఈది ఆవలి ఒడ్డుకి చేరు)

మత కలహాల కేసుల్లో విచారణ ఎలా హాస్యాస్పదంగా సాగుతుందో వ్యంగ్యంగా చెపుతాడు.

"అబ్ కహాc ఢూండ్నే జావోగే హమారే కాతిల్?
ఆప్ తో కత్ల్ కా ఇల్జామ్ హమీ పర్ రఖ్ దో!"
(మా హంతకుల కోసం ఎక్కడెక్కడని వెతుకుతారు?
ఆ హత్యా ఆరోపణ కూడా మామీదే తోసేయండి!")

రాహత్ షాయిరీకి ఎల్లలు లేవు. భావ ప్రకటనకు విధి, నిషేధాలు లేవు. తన జీవితకాలంలో లెక్కలేనన్ని దేశాల్లో పర్యటించి కవిత చెప్పినా భరతమాత బిడ్డగా ఈ దేశంతో ఆయనకు ఉద్వేగపూరిత అనుబంధం ఉంది. తాను అచ్చమైన భారతీయుడినని చెప్పుకుంటాడు.

"హమే పహ్‌చాన్‌తే హో? హమ్ కో హిందుస్థాన్ కహ్తే హైc
మగర్ కుఛ్ లోగ్ జానే క్యోం హమే మెహమాన్ కహ్తే హైc"
(నన్ను గుర్తు పట్టావా? నన్ను భారత్ అంటారు
కానీ, కొందరేమో అతిథి అని ఎందుకంటారో తెలీదు)

> **ముస్లిం అస్తిత్వవాదానికి పెద్ద పీట వేసిన రాహత్‌కు మతాలకతీతంగా అసాధారణమైన ఆదరణ ఉంది. ఉర్దూలో 'రాహత్' అంటే ఊరట అని అర్థం. పేరుకు తగ్గట్లుగానే అనేక సమస్యలతో సతమతమయ్యేవారికి ఆయన షాయిరీ సాంత్వన కలిగిస్తుంది.**

గత ఆరేళ్లుగా ప్రధాని మోదీ, సంఘ్ పరివార్‌పై రాహత్ లెక్కలేనన్ని విమర్శనాస్త్రాలు సంధించారు. తరచుగా విదేశాలకు వెళ్ళే మోదీపై ఒక షేర్ ఇది.

"ఐసీ సర్దీ హై కే సూరజ్ భీ దుహాయీ మాంగే
జో హో పర్‌దేశ్ మే వహ్ కిసే రజాయీ మాంగే"
(చలికి సూర్యుడు కూడా గజగజ వణుకుతున్నాడు
విదేశంలో ఆయన ఎవర్ని అడుగుతారు దుప్పటి?)

మత కలహాలు, యుద్ధం వల్ల వినాశనాన్ని చెబుతాడు కవి ఇలా:

"మై అప్నీ లాష్ లియే ఫిర్ రహా హూc కాంధే పర్
యహాc జమీన్ కీ కీమత్ బహుత్ జ్యాదా హై"
(నేను నా శవాన్ని భుజాలకెత్తుకుని తిరుగుతున్నా
ఇక్కడ భూమి రేటు చాలాచాలా ఎక్కువ)

నెత్తుటి రాజకీయాలు, కోర్టులు, న్యాయం, ధర్మం అన్నింటినీ ఎలా ఏకపక్షంగా మార్చేశారో అంటూ ఆక్రోశిస్తున్నాడు షాయర్.

"తుమ్హే సియాసత్ నే హక్ దియా హై
హరీ జమీనోంకో లాల్ కర్ దో
అప్పీల్ భీ తుమ్, దలీల్ భీ తుమ్
గవాహ్ భీ తుమ్, వకీల్ భీ తుమ్
జిసే భీ చాహో హరామ్ కహ్ దో,
జిసే భీ చాహో హలాల్ కర్ దో."
(నీకు రాజకీయం అధికారమిచ్చింది
పచ్చటి పుడమిని ఎర్రగా మార్చేయ్!
అప్పీలూ నీదే, వాదనా నీదే
సాక్షీ నువ్వే, వకీలూ నువ్వే
ఏది అనుకుంటే దాన్ని చట్టవిరుద్ధం చేయ్!
ఏది కోరుకుంటే దాన్ని చట్టబద్ధం చేయ్!!)

సంఘ్ పరివార్ శక్తులు విజృంభించడంతో ముస్లింల పరిస్థితి ఎలా మారిందో ఈ షేర్‌లో వర్ణిస్తాడు రాహత్.

"కోయీ క్యా సోచ్‌తా రహతా హై మేరే బారే మే?
ఏ ఖయాల్ ఆతే హీ హమ్‌సాయే సే డర్ లగ్‌తా హై
ఏక్ నయే ఖౌఫ్ కా జంగల్ హై మేరే చారోం తరఫ్
అబ్ ముఝే షేర్ నహీc, గాయ్ సే డర్ లగ్‌తా హై"
(నా గురించి ఎవరైనా ఏమనుకుంటారో... ఏంటో...
ఈ ఆలోచనవస్తే పొరుగువాడిని చూసి భయమేస్తోంది
నా చుట్టుతా భయోత్పాతమైన కొత్త అడవి ఉంది...
నాకిప్పుడు పులి కాదు, గోవుని చూస్తే భయమేస్తోంది.)

ప్రధాని మోదీ 'మన్ కీ బాత్'ని ఇందోరీ ఎలా వెటకరిస్తున్నారో చూడండి.

"బాత్ మన్ కీ కహోc, యా వతన్ కీ కహోc
ఝూట్ బోలేతో ఆవాజ్ భారీ రఖోc"
(మనసులోని మాట చెప్పినా, దేశం ముచ్చట చెప్పినా
అబద్ధం చెబితే బల్లగుద్ది మరీ గట్టిగా చెప్పాలి)

రాహత్ ఇందోరీకి దేశ, విదేశాలలో లెక్కలేనన్ని అవార్డులొచ్చాయి. కానీ, కేంద్రం నుంచి విశిష్ట పురస్కారం ఏదీ రాలేదు. దీనిపై ఆయనకు ఏదైనా బాధ ఉందా? ఇలాంటి అనుమానాలను పటాపంచలుచేస్తూ ఒక షేర్ చెప్పారిలా:

"అప్నా మాలిక్, అప్నా ఖాలిక్ అఫ్జల్ హై!
ఆతీ జాతీ సర్కారోం సే క్యా లేనా?"
(నా దైవం, సృష్టికర్త అంతా అల్లాయే
వచ్చే పోయే సర్కార్ల నుంచి నేనేం తీసుకుంటా?)

తన మరణానంతరం ఈ ప్రపంచం తనను ఎలా గుర్తుంచుకోవాలో ఈ 70ఏళ్ల షాయర్ ఇలా చెప్పుకున్నాడు.

"మై జబ్ మర్ జావూc తో
మేరీ అలగ్ పహెచాన్ లిఖ్ దేనా
లహూ సే మేరీ పేషానీ పే హిందుస్థాన్ లిఖ్ దేనా"
(నేను పోయాక నాకో ప్రత్యేక గుర్తింపునివ్వండి
నెత్తుటితో నా నుదుటన భారత్ అని లిఖించండి)

■ మెహక్ హైదరాబాదీ
70361 75175

# ఆనాటి కన్నడ - తెలుగు సాహిత్య వారధి

కన్నడ, తెలుగు అనువాదరంగంలో పరిచితమైన పేరు శర్వాణి. అర్ధశతాబ్దం కిందట రెండు మూడు తరాల పాఠకులకి కన్నడసాహిత్యంతో ప్రాథమిక పరిచయమైనా కలగడానికి ఆమె చేసిన అనువాద నవలలు, కథలు సాయపడ్డాయి. శర్వాణి అసలుపేరు మణిగానహళ్ళి (నీలారంభం) శారద. ఏ తరగతి గదిలోనూ చదువుకోని కన్నడిగురాలైన శారద రెండుభాషల్లో ప్రవీణురాలైన శర్వాణిగా మారడానికి చేసిన ప్రయాణం ఆసక్తికరం. శర్వాణి గురించి ఆమె కుమార్తె కల్యాణి నీలారంభం తన అనుభవాలను విశాఖపట్నంలోని 'పుస్తకాల పురుగులు' గ్రూప్‌తో పంచుకున్నారు. 'మాధవి' వంటి కన్నడ అనువాద నవలల ద్వారా కల్యాణి నీలారంభం సుపరిచితులే.

**మీ అమ్మగారు శర్వాణి జీవిత నేపథ్యం చెప్పండి?**

శారద నుండి శర్వాణి గమనం, పుస్తకాల ద్వారానే సాధ్యమయిందనుకుంటా. మహానంది దగ్గరలోని నందవరం అనే చిన్నవూళ్ళో కాశీనుండి వచ్చిన కొందరు, బ్రాహ్మణ కుటుంబాలుగా స్థిరపడ్డారు. వారే నందవరీకులనే ఉపశాఖీయులయ్యారు. వీరు ఏ రాష్ట్రంలో ఉన్నా ఇంట్లో తెలుగే మాట్లాడేవారు. కోలార్లో ప్రైమరీ స్కూల్ టీచర్ మా తాతగారు. ఆరుగురు ఆడపిల్లలు ఒక్క మగపిల్లవాడు. కోలార్‌లో ఓ మట్టిగోడల ఇల్లు తప్ప మరేం ఆస్తిలేని మా తాతగారు పిల్లల్ని ప్రేమగా పెంచుకున్నారు. చిత్తూరునుండి వచ్చి బెంగళూర్లో బ్యాంకు ఉద్యోగం చేస్తున్న నీలారంభం రామయ్యకు, మణిగానహళ్ళి శారదకు పెళ్ళయింది. అమ్మ బెంగళూర్లో కన్నడ సాహిత్యం విరివిగా చదివేది. అమ్మకి తెలుగు అలవాటు చేసే ప్రయత్నంలో నాన్న ఆంధ్రప్రభ, ఆంధ్రపత్రిక తెప్పించేవారు. 1956లో నాన్నకు రాజమండ్రి బదిలీ అయి తెలుగు రాష్ట్రానికి వచ్చాక తెలుగు పుస్తకాలు, ఏది దొరికితే అది చదివేది. క్రమంగా మంచి పుస్తకాలు ఎంచుకోవడం వచ్చింది. ఓ సంవత్సరం నాన్నకు బోనస్‌గా 500రూపాయలు వచ్చాయి. ఆ డబ్బులతో బంగారు మంగళసూత్రం గొలుసా, రేడియోనా అని ఆప్షన్ అమ్మకిస్తే రేడియోకి ఓటు వేశారు. మా వొంటి మీద చిన్నమెత్తు బంగారం ఉండేది కాదు గాని రెండు బీరువాల నిండా పుస్తకాలు ఉండేవి. దాని మూలంగానే పుస్తకాలు చదవడం సహజమైన అలవాటుగా ఉండేది.

**మీ ఇద్దరి అనువాద ప్రస్థానం ఎలా మొదలైంది?**

విజయవాడలో ఉండగానే, మా రెండోతమ్ముడు మెనింజైటిస్‌తో చనిపోయాడు. ఆ దుఃఖంలోంచి బయటపడడానికి అమ్మ ఏదైనా వ్యాపకాన్ని వెతుక్కునే ప్రయత్నంలో అనువాదాలు మొదలుపెట్టింది. ఆంధ్రపత్రికకు త్రివేణి కథ 'ఆకర్షణ' ఆమె అనుమతి తీసుకుని పంపాము. అది పత్రికలో రావడంతో ఉత్సాహం వచ్చి అప్పుడు పత్రిక ఎడిటర్ శివలెంక రాధాకృష్ణకి అనువాద నవల వేసుకుంటారా అని లెటర్ రాశాము. ఆయన పరిశీలనకు పంపండి అనగానే 'వెండి మబ్బు' నవల చేసి పంపాము. అప్పటినుండి అమ్మ అనువదించిన అన్నినవలలూ సీరియల్స్‌గా ఆంధ్రపత్రికలో వచ్చినవే. 1960లో నాన్నకి బదిలీ అయి అనకాపల్లి వచ్చాము. అక్కడ శారదా గ్రంథాలయం, దాని మేడమీద రెగ్యులర్‌గా నడిచే సాహితీ సమావేశాలు మా పరిధిని పెంచుకోవడానికి దోహదం చేశాయి. మునిమాణిక్యం నుండి రావిశాస్త్రి, రంగనాయకమ్మ--ఎంతమందిని విన్నామో! రావిశాస్త్రి, మహీధర రామ్మోహనరావు, వారి కుటుంబాలతో సహా జీవితకాలం స్నేహితులు అయ్యారు. 1967లో గుడివాడలో జరిగిన తెలుగు రచయిత్రుల మహాసభకు హాజరైనవారిలో అమ్మకూడా ఉన్నారు. తెన్నేటి హేమలత, బీనాదేవి, నిడదవోలు మాలతి వంటి రచయిత్రులను ఒకేచోట చూడడం బాగానచ్చి చాలాసార్లు తల్చుకునేవారు. అప్పుడే కె. రామలక్ష్మి అందరి వివరాలు తీసుకుని రచయిత్రుల 'who is who'ని 'ఆంధ్ర రచయిత్రులు' పేరిట తీసుకొచ్చారు. అందులో అమ్మ గురించి సమాచారం ఉంది.



శర్వాణి

కల్యాణి నీలారంభం
95509 81050

అమ్మ అనువాదం చేసేటప్పుడు మూలరచనలో మార్పులు చేయకుండా తెలుగుదనం తెచ్చే ప్రయత్నం చేసేవారు. సరైనపదంకోసం విశ్వప్రయత్నం చేసేవారు. ఒక్కోమారు గంటల తరబడి చర్చించుకునేవాళ్ళం. ఎన్ని ఊళ్ళు మారినా, కుటుంబంలో ఎన్ని విషాదాల్ని ఎదిరించాల్సి వచ్చినా అమ్మకి మందు అనువాదాలు, కథలు రాయడం. ఆంధ్రపత్రికలోనే కాక యువ, జ్యోతి ప్రత్యేకసంచికలలో అమ్మ కథలు ఉండేవి. విపుల మాసపత్రిక పెట్టిననాటి నుంచి అమ్మ చనిపోయేముందు దాకా తన అనువాదాలు ప్రతినెలా కనీసం ఒక్కటైనా ప్రచురించేవారు.

**మీ కుటుంబంలో చాలామంది అనువాదకులున్నారు?**

అమ్మ అక్కచెల్లెళ్ళందరూ ముందు చదువరులు. ఒక చెల్లెలు సుందరీమూర్తి హిందీలో విశారద, ప్రవీణ పరీక్షలు పాసయింది. మాకు చిన్నప్పుడు హిందీ పాటలు, సాహిత్యంతో పరిచయం ఆమె మూలంగానే. తను హిందీనుండి కన్నడంలోకి అనువాదాలు చేస్తుంది. ఇంకో చెల్లెలు సులోచనామూర్తి కవిత్వం రాస్తుంది. తెలుగు నుండి కన్నడంలోకి అనువాదాలు చేస్తుంది. నేను అయిదునవలలు, కొన్ని కథలు అనువాదం చేసాను. మా తమ్ముడి భార్య ఉమాదేవి నీలారంభం కన్నడనుంచి తెలుగులోకి అయిదు నవలలు అనువాదం చేసారు. మంచి తెలుగుపుస్తకాలు కనపడితే అందరం షేర్ చేసుకునేవాళ్ళం. ఇవాళ్టికీ మంచి తెలుగుకథలు కనబడితే వారికి పంపుతాను. లత 'ఆలేఖ్య', రంగనాయకమ్మ 'కృష్ణవేణి' మా పిన్ని మొదటి అనువాదాలు. జనార్దన మహర్షి 'గుడి', మృణాళిని 'కోమలి గాంధారం' వంటివి ఈ మధ్యకాలంలో చేశారు. నలభై ఇద్దరు రచయితలవి చిన్నకథలు అనువాదం చేసారంటే చేశారంటే నమ్ముతారా? పి.ఎస్. నారాయణ, ఓల్గా, బాలగంగాధర తిలక్, వివినమూర్తి, పాలగుమ్మి సీత, ఎల్.ఆర్.స్వామి, ఎవి.రెడ్డిశాస్త్రి ఇందులో ఉన్నారు.

**శర్వాణి రచనలు, పబ్లికేషన్స్ వివరాలు?**

అమ్మ అనువదించిన త్రివేణి నవలలు చాలా మటుకు ఆంధ్రపత్రికలో సీరియల్స్‌గా వచ్చాయి. తర్వాత శేషాచలం అండ్ కంపెనీవారు పుస్తకాలుగా తీసుకొచ్చారు. ఎమెస్కోవారు ఇంటింటా గ్రంథాలయం స్కీములో ఈ నవలలను తేవడంతో ఎక్కువమంది చదివే అవకాశం వచ్చింది. కన్నడ రచయితలు-త్రివేణి, శివరామకారంత, నిరంజన నవలలు పదకొండింటిని అమ్మ తెలుగులోకి అనువదించింది. కన్నడనుంచి తెలుగులోకి ద్వివేదుల విశాలాక్షి, మల్లాది, యర్రంశెట్టి, పవని నిర్మల ప్రభావతి, పరిమళా సోమేశ్వర్ మొదలైనవారి కథలు వందపైనే అనువాదం చేసారు. విపులలో అనువాద కథలు చాలా వచ్చాయి. అలానే తెలుగు నుంచి కన్నడలోకి అయిదు రచనలు, దాదాపు వంద కథల వరకూ అనువాదం చేసారు. ఈ మధ్యకాలంలో పాత రచనలు చాలామందివి రీ ప్రింట్ చేస్తున్నారు. 1985లో ఎమెస్కో వారిని రీ ప్రింట్ చేసే ఉద్దేశ్యం ఉందా అని అడిగితే లేదన్నారు. ఇపుడు సానుకూలంగా స్పందిస్తారేమో చూడాలి. ఫేస్బుక్‌లో చాలామంది నన్ను శర్వాణి కూతురిగా గుర్తిస్తారు, పుస్తకాలు అన్నీ గుర్తుపెట్టుకొని అడుగుతారు. ఎక్కడ దొరుకుతాయి అనడుగుతారు. కాని పత్రికలు, పబ్లిషర్స్ మాత్రం అనువాద రచనలకు మార్కెట్ లేదంటారు. నేను బి.యు. గీత 'మిథ్య' అనే నవలను అనువదించాను. కుటుంబంలో సంబంధాలు ఎలా వ్యాపార సంబంధాలుగా మారుతున్నాయన్న కథావస్తువుతో. ఇది woman centric కాదు, పురుష ప్రధానమయింది. ఆ కారణంగా దానిని ప్రచురణలోకి తేలేకపోయాను. మరికొన్నాళ్లకి మా ఈ అనువాద సాహిత్యం అంతా మరుగున పడిపోయే అవకాశం ఉంది. దాదాపు 20నవలలు, కొన్ని వందల కథలు విడివిడిగా ఉండిపోయాయి. అన్నిటినీ ఒక చోటకి చేర్చిపెట్టాము కానీ వాటి సమగ్ర సంకలనాలు తేవడమన్నది ఒంటిచేత్తో జరిగే పని కాదు.

(ఇంటర్వ్యూ: 'పుస్తకాల పురుగులు' గ్రూప్, విశాఖపట్నం)

# నిర్మానుష్యం



పొగలేని
ఫ్యాక్టరీ గొట్టాల్లోని గుంప్రని శూన్యానికి
కృతజ్ఞతలు చెబుతూ
పక్షుల గుంపులు తెల్లగా
కర్మాగారాల మీదినుండి కదులుతున్నాయి.
వ్యర్థ రసాయనాలు కలవని ప్రవాహంలో
చేప పిల్లలు
పట్టరాని ఆరోగ్యంతో ఎగిరి గంతులేస్తున్నాయి.
వేటు పడని చెట్లనుండి
రోజంతా
వేల ఆకుల నీడలు గలగల మంటున్నాయి.
ఒక్కటి కూడా చనిపోకుండా
వందల చీమలు
నడిరోడ్లను నిర్భయంగా దాటి
అవతలికి చేరుకుంటున్నాయి.
నిలిచిపోయిన వాహనాల టైర్ల మధ్యలో
సాలె పురుగులు
సామ్రాజ్యాల్ని నిర్మించుకుంటున్నాయి.
రాళ్ళ దెబ్బలు తినని వీధి కుక్కలు
వేసవి చెట్ల నీడలో
మధ్యాహ్నపు నిద్రననుభవిస్తున్నాయి.
పంటపొలాల మధ్య రోడ్లపై
పడగవిప్పి పాములు
ప్రతిరోజూ నాట్యమాడుతున్నాయి.
ఇప్పుడిప్పుడే
ఆకాశంలో కనిపిస్తోన్న
ఆకుపచ్చ రంగుని చూసి
చిగురించిన ఆశతో
కోతులు ఊళ్లను వదిలి
అడవులవైపు కదులుతున్నాయి.
బొరియల్లోంచి బయటికొచ్చిన
లక్షల పీతలు
అలల ఆఖరి బొట్లతో కలిసి
నిరంతరాయంగా ఆడుకుంటున్నాయి.
పూర్తిగా అందుతున్న
ప్రాణవాయువుని పీల్చుకొని
గొంగళి పురుగులు
ఆహ్లాదంగా కదులుతున్నాయి.
పరుచుకున్న
నిశ్శబ్దపు రంగుని కూడా అతికించుకుని
సీతాకోక చిలుకలు
నిర్మానుష్య వీధుల్లో ఎగురుతున్నాయి
రాబోయే వానాకాలాన్ని
ఓజోన్ పొర
శుభ్రంగా తుడుస్తోంది.
పూలకు నక్షత్రాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.
రాత్రికి మిణుగురుల పాట
శ్రావ్యంగా వినిపిస్తోంది.

***

పరిణామక్రమంలో
చిన్న పొరపాటు జరిగింది.
'మనం మధ్యలో వచ్చాం'
అన్న విషయాన్ని
మానవజాతి మొదట్లోనే మర్చిపోయింది.

■ భగవంతం

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
సోమవారం ● 13 ఏప్రిల్ 2020
navya@andhrajyothy.com

న్యూస్‌మేకర్


భర్తతో...

కరోనా
పేరు చెప్పగానే దేశంలో
తొలుత ఉలిక్కిపడిన ప్రాంతం...
రాజస్థాన్‌లోని భిల్వారా పట్టణం. దేశంలో మొదట ప్రకటించిన 'హాట్‌స్పాట్'లలో ఇదీ ఒకటి. కానీ ఇప్పుడు... అక్కడ పరిస్థితి పూర్తి భిన్నం. పక్కాగా కట్టడిని పాటించి, కొవిడ్-19 వైరస్‌ను పారద్రోలిన తొలి ప్రాంతంగా ఘనతకెక్కింది. అందుకు కారణం... యువ ఐఏఎస్ అధికారిణి **టీనా దాబి** బృందం... ఆమె అనుసరించిన కట్టుదిట్టమైన నియంత్రణ విధానం. ప్రస్తుతం దేశానికే ఆదర్శప్రాయమైన ఆ 'మోడల్'... దాని వెనక ఆమె కృషి... నిరుపమానం.

# ఆ విజయం వెనుక ఆమె

టీనా దాబి... ఈ పేరే ఒక సంచలనం. నాలుగేళ్ల కిందట సివిల్ సర్వీసెస్‌లో మొదటి ర్యాంకు తెచ్చుకుని యావత్ దేశాన్నీ ఆకర్షించారు. అంతేకాదు... ప్రథమ ర్యాంకు సాధించిన మొదటి దళిత మహిళగా కూడా ఆమె చరిత్ర సృష్టించారు. కానీ ఆ విజయం టీనాకు కొన్ని చేదు అనుభవాలను మిగిల్చింది. ర్యాంకు విషయంలో ఆమె దళిత నేపథ్యాన్ని పేర్కొంటూ... ప్రతిభను తక్కువ చేస్తూ ఆన్‌లైన్‌లో కొందరు అవమానకరంగా మాట్లాడారు. ఇవి ఆమెను మానసికంగా కుంగదీశాయి. 'బహుశా నా ఈ సక్సెస్ తలచుకుని అత్యంత బాధపడిన ఐఏఎస్ టాపర్‌ని నేనేనేమో' అంటూ ఒక సందర్భంలో ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రెండేళ్ల ఐఏఎస్ శిక్షణలో సైతం తొలి స్థానం దక్కించుకుని... తనను విమర్శించినవారికి తగిన బుద్ధి చెప్పారు.

## అమ్మే రోల్‌మోడల్...

చదువులో చురుకుతనం.. గలగలా మాట్లాడే తత్వం.. టీనా చిన్నప్పటి నుంచి తెలివిగల విద్యార్థినిగా పేరు తెచ్చుకున్నారు. ఐఏఎస్ కావాలన్నది ఆమె కల. అందుకే డిగ్రీలో పొలిటికల్ సైన్స్ తీసుకుని, సివిల్ సర్వీసెస్‌కు సన్నద్ధమయ్యారు. ఆమె తండ్రి జస్వత్ దాబి బీఎస్ఎన్ఎల్‌లో జనరల్ మేనేజర్. తల్లి హిమాని ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీస్‌లో మాజీ అధికారిణి. కూతురు ఆశయ సాధనకు తల్లితండ్రులిద్దరూ అండగా నిలిచారు. టీనా, ఆమె చెల్లి రియాల చదువు కోసం హిమాని ఉద్యోగం మానేశారు. టీనాకు అమ్మే స్ఫూర్తి... రోల్‌మోడల్. టీనా పుట్టింది మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో. పెరిగింది, చదువుకున్నది మాత్రం ఢిల్లీలో!

## మొదటి ప్రయత్నంలోనే...

టీనా తొలి ప్రయత్నంలోనే సివిల్ సర్వీసెస్ పరీక్షలో విజయం సాధించడమే కాకుండా... ప్రథమ ర్యాంకు తెచ్చుకున్నారు. ట్రావెలింగ్‌ను ఇష్టపడే టీనా మంచి చిత్రకారిణి కూడా! చిన్నప్పటి నుంచి భారత రాజ్యాంగం, రాజకీయాలను ఒంటపట్టించుకున్నారు. రాజస్థాన్‌లో తొలిసారి బాధ్యతలు చేపట్టిన టీనా దాబి... ప్రస్తుతం భిల్వారా సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ (ఎస్‌డీఎం)గా విధులు నిర్వర్తిస్తున్నారు. 2016 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన టీనా... రెండో ర్యాంకర్ అథర్ ఆమిర్‌ను రెండేళ్ల కిందట వివాహం చేసుకున్నారు. ఐఏఎస్ శిక్షణా సమయంలో వీరిద్దరి పరిచయం... ప్రేమగా మారి... పెళ్లి పీటలు ఎక్కించింది.

## కఠినమే... కానీ...

లాక్‌డౌన్... చెప్పడం సులువే కానీ అమలు చేయడంలో ఎన్నో ఇబ్బందులు, సమస్యలు తలెత్తుతాయి. అలాగని ఆలోచిస్తూ కూర్చొంటే పరిస్థితి చేయి దాటిపోతుంది. అందుకే కరోనా కేసులు ఆందోళనకరంగా పెరుగుతున్న తరుణంలో భిల్వారా జిల్లా అధికారులు కఠిన నిర్ణయాలు తీసుకున్నారు. రాజస్థాన్ రాజధాని జైపూర్‌కు 250 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ప్రాంతంలో ఆ నిర్ణయాన్ని పక్కాగా అమలు చేయాలనుకున్నారు టీనా. ఇందు కోసం ఓ బృందాన్నిఏర్పాటు చేసుకున్నారు. ఆమె తీసుకున్న మొట్టమొదటి చర్య... పూర్తిస్థాయి ఐసొలేషన్. "మార్చి 19న భిల్వాడాలో కరోనా తొలి పాజిటివ్ కేస్ నమోదైంది. మరుసటి రోజుకు సంఖ్య పెరిగింది. దీనంతటికీ కారణం ఓ ప్రైవేట్ ఆసుపత్రి డాక్టర్లు, సిబ్బంది. ఇక్కడ వైరస్ వాళ్లతోనే మొదలైంది. దీంతో


స్కూలు పిల్లలతో...

భిల్వారా అంతటినీ లాక్‌డౌన్ చేసి, కర్ఫ్యూ కూడా విధించాలని నిర్ణయించారు. అలా కేంద్రం ప్రకటించడానికి కొన్ని రోజుల ముందే ఇక్కడ లాక్‌డౌన్ చేశాం. ఒక దశలో ఇటలీతో పోల్చి, పరిస్థితులు మరింత దిగజారకుండా వైరస్‌ను నియంత్రించేందుకు చర్యలు తీసుకున్నాం" అని వివరించారు టీనా.

## అసలు పరీక్ష అప్పుడే మొదలైంది...

లాక్‌డౌన్ తరువాతే అసలు పరీక్ష మొదలైంది జిల్లా అధికారులకు. "ప్రజలు బయటకు రాకుండా చూడటం పెద్ద సవాలు. లాక్‌డౌన్ తొలి మూడు నాలుగు రోజులు నగరంలోని ప్రతి ప్రాంతం నుంచి భయంకరమైన కాల్స్ వచ్చేవి. ఎన్నో సమస్యలు వినిపించేవి. అయితే దేశం కోసం పనిచేస్తున్నామన్న ఆలోచన మాలో అలసత్వం రానివ్వలేదు. ఇది హెల్త్ ఎమర్జెన్సీ. కనుక ఎంతటి కష్టమైనా భరించడానికి, ఏ సమస్యనైనా నెత్తికెత్తుకోవడానికి సిద్ధమయ్యాం" అంటూ తన అనుభవాలు చెప్పుకొచ్చారు టీనా. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రజలతో ఆమె సౌమ్యంగా మాట్లాడేవారు. ఎక్కడ సమస్య ఉంటే అక్కడ వాలిపోయేవారు. ఇంటింటికీ నిత్యావసరాలు అందేలా చర్యలు తీసుకున్నారు. అందరికీ అవగాహన కల్పించారు.

"అన్నింటి కంటే నాకు ఎదురైన పెద్ద సవాలు... కరోనా పేషెంట్లకు చికిత్స అందించడం. ఆ సమయంలో వాళ్ల ఆందోళన నన్ను భావోద్వేగానికి గురిచేసింది. మరోవైపు విద్యార్థులు వేరే ప్రాంతాల్లో చిక్కుకుపోయారు. అది చూసి వాళ్ల తల్లితండ్రులు తల్లడిల్లిపోయారు. అలాంటి పరిస్థితుల్లో వారికి సర్దిచెప్పడం చాలా కష్టం' అంటారు టీనా. ఆమె అలుపెరుగని కృషితో కరోనాపై భిల్వారా విజయం సాధించింది. దేశంలో ఈ వైరస్‌ను పారద్రోలిన తొలి ప్రాంతంగా నిలిచింది. టీనా బృందం అనుసరించిన ఈ 'మోడల్'ను ఇప్పుడు దేశమంతా ఆదర్శంగా తీసుకొంటోంది. ఒక ఐఏఎస్ అధికారిణిగా ఎందరో ప్రజల జీవితాలు మార్చవచ్చంటున్న ఆమె... భిల్వారాలో కరోనా కట్టడి ద్వారా దాన్ని చేతల్లో చూపించారు.

వర్క్‌వుట్ ఫ్రమ్ హోమ్

# నిలుచున్న చోటే వ్యాయామం

ఇప్పుడంతా ఇంట్లోనే కాలక్షేపం. మనసు పుట్టి వ్యాయామం చేద్దామన్నా సరిపడా ఖాళీ దొరకదు. అందుకే ఎక్కడికీ కదలకుండా... ఇంకా చెప్పాలంటే నిలుచున్న చోటే చేయగల మంచి ఎక్సర్‌సైజ్‌లు ఇవి. మీరూ ఓసారి ట్రై చేయండి.





**కిక్ ఇచ్చినట్టు..:** నిటారుగా నిలబడి, చేతులను ఛాతీ ఎత్తులో చాచండి. కుడి కాలును కిక్ ఇచ్చినట్టు పైకి లేపి, చేతులను తాకించేందుకు ప్రయత్నించండి. కానీ మోకాలు వంగకూడదు. అలా 30 సెకన్లపాటు చేసి, 30 సెకన్లు విశ్రాంతి ఇవ్వండి. ఇదే తరహాలో నాలుగు సెట్లు చేయండి.



**మోకాళ్లు వంచి..:** కాళ్లు కాస్త దూరంగా జరిపి నిల్చోండి. చేతులను తల వెనుక పెట్టుకోండి. ఇప్పుడు పొట్ట కండరాలను బిగించి, ఎడమ కాలును ఒక అడుగు ముందుకు వేసి, మోకాళ్లు కొద్దిగా బెండ్ చేయండి. ఇప్పుడు వెన్నెముక తిన్నగా పెట్టి, మీ ఛాతీ నేలకు సమాంతరంగా వచ్చేవరకు ముందుకు వంగండి. నిదానంగా నడుము పైభాగాన్ని ఎడమ వైపునకు తిప్పుతూ పైకి లేచి, మీ భుజాలను చూడండి. ఇలా 15 సార్లు చేయాలి.



**జాయ్ ఆఫ్ జంపింగ్..:** కాళ్లను కాస్త ఎడంగా పెట్టి నిల్చొని, చేతులు ముందుకు చాచండి. ఇప్పుడు జంప్ చేస్తూ, మోకాళ్లను సాధ్యమైనంత వరకు మీ ఛాతీకి దగ్గరగా తీసుకువచ్చే ప్రయత్నం చేయండి. మొదటి పొజిషన్‌కు వచ్చి, మళ్లీ పైన చెప్పినట్టు చేయండి. ఇలా 30 సెకన్లు వ్యాయామం, అంతే సమయం విశ్రాంతి ఇస్తూ నాలుగు సెట్లు చేయాలి.

స్టార్ రెసిపీ

# శిల్పా చిప్స్!





బాలీవుడ్ నటి, యోగా శిక్షకురాలు శిల్పాశెట్టి.. ఆమె తొలి ప్రాధాన్యం ఆరోగ్యం. లాక్‌డౌన్ కాలంలో ఎక్కువ కేలరీలు, కృత్రిమ రంగులు ఉండే ప్యాకేజ్డ్ ఫుడ్ జోలికి వెళ్లకుండా, ఆరోగ్యకరమైన ఆహారాన్నే తినాలంటున్నారు ఆమె. అలాంటి మంచి ఆరోగ్యకరమైన ఆహారం బంగాళదుంప చిప్స్.. తయారీ గురించి శిల్ప ఇటీవల తన యూట్యూబ్ చానెల్లో ఇలా వివరించారు...

**కావలసిన పదార్థాలు:**
- బంగాళదుంపలు - 2
- చిలగడదుంప - 1
- కారం,
- ఉప్పు,
- నూనె,
- మిరియాలు - తగినంత

**తయారీ:** ముందుగా బంగాళదుంపలను బాగా కడగండి.స్లైసర్‌తో పలుచని పొరలుగా చెక్కు తీయాలి. వీటిని డ్రై పేపర్ టవల్ మీద ఉంచి టిష్యూపేపర్‌తో నెమ్మదిగా అదిమితే తేమ పీల్చుకొని బాగా ఆరతాయి. తరువాత మిరియాలు, కారం, ఉప్పు, నూనెలు కలిపి ఈ చిప్స్‌కు బాగా పట్టించాలి. ట్రేలోపల ఆయిల్‌ను పూతలా రాసి సిద్ధం చేసుకున్న చిప్స్‌ను ఒకదానికి మరొకటి తాకకుండా ఎడంగా ఉంచాలి. ఓవెన్‌ను 120 డిగ్రీల వరకూ ప్రీహీట్ చేయాలి. ట్రేను అందులో గంటసేపు ఉంచి బయటకు తీయాలి. పావుగంట పాటు చల్లారనివ్వాలి. కరకరలాడుతూ నోటికి విందు చేసే బంగాళదుంప చిప్స్ రెడీ. గాలి చొరబడని డబ్బాలో ఉంచుకోని కాలక్షేపానికి తింటే సరి!

● కామిక్ కరోనా

కార్టూన్: చారి పి.ఎస్




అవగాహన




ప్రొఫెసర్ బీనా చింతలపూరి

# వారి 'సహాయం'తో భయాలు బలాదూర్!

**'కొవిడ్ - 19' లాక్‌డౌన్ కారణంగా ఇంటికే పరిమితమయ్యే పరిస్థితి. ఇలాంటి సమయంలో తలెత్తే మానసిక సమస్యలను 'సహాయం' అనే ఉచిత టెలిఫోన్ కౌన్సెలింగ్ ద్వారా చక్కదిద్దే పనికి పూనుకున్నారు ఉస్మానియా యూనివర్సిటీ సైకలాజికల్ కౌన్సెలింగ్ సెంటర్ ఇన్‌ఛార్జ్ డైరెక్టర్, ప్రొఫెసర్ బీనా చింతలపూరి. ఆమె అందిస్తున్న వివరాలు ఇవి!**

ఈ కౌన్సెలింగ్ సెంటర్ 2010లో ఏర్పాటైంది. తెలంగాణ ఆవిర్భావ సమయంలో ఎంతోమంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఆ సమయంలో ఉచిత టెలిఫోన్ కౌన్సెలింగ్ ద్వారా ఎంతోమంది జీవితాలను గతి తప్పకుండా నియంత్రించాం. అప్పటి నుంచి పలు రకాల మానసిక సమస్యలకు కౌన్సెలింగ్ ఇస్తూనే ఉన్నాం. తాజాగా కొవిడ్ - 19 పట్ల సర్వత్రా ఆందోళన, భయాలు, నిరాశ, నిస్సహాయత, అయోమయం నెలకొన్నాయి. అభద్రతాభావనకు లోనవడం, అవగాహనలేమితో తలెత్తే ఇలాంటి భయాలు, ఒత్తిడిలు మానసిక కుంగుబాటుకు లోను చేస్తాయి. అలాంటి స్థితిలో సమయానికి సరైన ఆసరా అందకపోతే ఆత్మహత్యలకూ ఒడిగడతారు. కాబట్టి అలాంటి దారుణాలను అడ్డుకోవాలనే సంకల్పంతో ఈ ప్రత్యేక ఉచిత టెలీ కౌన్సెలింగ్‌ను ప్రజలకు అందుబాటులోకి తెచ్చాం. ఇందుకోసం నాతో పాటు 15 మంది అనుభవజ్ఞులైన కౌన్సెలర్లు పని చేస్తున్నారు. అయితే సాధారణ పరిస్థితులతో పోల్చుకుంటే, ప్రస్తుత కొవిడ్ - 19 పరిస్థితి కొంత క్లిష్టమైనది. వారాల తరబడి ఇంటికే పరిమితమయ్యే ఇలాంటి స్థితి ఇంతకు ముందు ఎప్పుడూ ఎదురవలేదు. కాబట్టి ఇలాంటప్పుడు తలెత్తే మానసిక సమస్యలు, వాటిని ఎదుర్కోవలసిన విధానాల గురించి ముందుగా మేమందరం శిక్షణ తీసుకున్నాం!

## అమెరికా నుంచి శిక్షణ!

అమెరికాలోని 'టెక్' అనే సంస్థలో పని చేస్తున్న ప్రముఖ సైకలాజికల్ కౌన్సెలర్ సూర్యశ్రీ ద్వారా నాతో పాటు 15 మంది శిక్షణ పొందాం. శిక్షణ మొత్తం ఫోన్ ద్వారానే సాగింది. 30 గంటల పాటు పొందిన ఈ శిక్షణతో ఫోన్ ద్వారానే వ్యక్తుల మనస్తత్వాలను అంచనా వేయడం, వారి మనస్తత్వాన్ని వారే అర్థం చేసుకోగలిగేలా అవగాహన ఏర్పరచడం నేర్చుకున్నాం. ఇందుకోసం ఐదంచెల విధానాన్ని అనుసరిస్తాం. ఫోన్ అందుకున్న తర్వాత మొదట వారి వివరాలు అడిగి తెలుసుకుంటాం. ఆ తర్వాత కాల్ చేసిన వ్యక్తి ఆలోచనా విధానం, మానసిక స్థితి, ప్రవర్తన, భౌతికమైన మార్పులు, కొవిడ్ సంబంధిత భయాలు... ఇలా అంచెలవారీగా వారిని విశ్లేషించి, తగిన సూచనలు, సలహాలు అందిస్తాం. వ్యక్తుల వయసు, వారు ఉన్న స్థితి, వెసులుబాట్ల ఆధారంగా వారి మానసిక స్థితి మెరుగుపడే అంశాలు, పనులు కార్యక్రమాలను సూచిస్తాం.

ఇందులో భాగంగా మానసిక కుంగుబాటును దూరం చేసే, ఆహ్లాదకరమైన సంగీతాన్ని అందించే వెబ్‌సైట్ లింక్‌లను వారి ఫోన్‌కు పంపిస్తాం. మానసిక నిపుణుల వీడియో కౌన్సెలింగ్ లింకులనూ అందిస్తాం. పరిస్థితి తీవ్రతను బట్టి మానసిక నిపుణుల ఫోన్ కన్సల్టేషన్ల సౌలభ్యాన్నీ అందిస్తాం. మా టెలి కౌన్సెలింగ్ సంభాషణ మొత్తం 20 నుంచి 30 నిమిషాలలో ముగిస్తాం. మరిన్ని ఫోన్ కాల్స్ అందుకుని, ఎక్కువ మందికి సహాయపడడం కోసమే ఇంత తక్కువ సమయానికే కాల్‌ను పరిమితం చేశాం. అయితే ఫోన్ కాల్ ముగియగానే, అక్కడితో కౌన్సెలింగ్ ముగిసింది అనుకుంటే పొరపాటు. పరిస్థితి మెరుగు పడిందీ, లేనిదీ తెలుసుకోవడం కోసం అదే వ్యక్తికి, రెండు రోజుల విరామంతో ఫోన్ చేసి, వివరాలు తెలుసుకుంటాం. కౌన్సెలింగ్ సెంటర్‌కు వచ్చే ప్రతి కాల్, వ్యక్తుల వివరాలన్నీ గోప్యంగా ఉంచుతాం!

### విద్యార్థుల కోసం...

'లాక్‌డౌన్' అనేది ఇంట్లో ఉండే విద్యార్థులపై పెను ప్రభావం చూపుతుందని మనస్తత్వ నిపుణులు అంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో మానసిక సంఘర్షణకు గురయ్యే విద్యార్థులకు ఫోన్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించేందుకు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం సన్నాహాలు చేసింది. టెలీ కౌన్సెలింగ్ అవసరమైన విద్యార్థులు యూనివర్సిటీకి చెందిన మనస్తత్వ విశ్లేషకులు డాక్టర్ హైమావతి, డాక్టర్ సుభాష్‌లను 9515667087, 8008477643 నెంబర్లలో సంప్రదించొచ్చు.

### గర్భిణి భయాన్ని పోగొట్టాం!

కొవిడ్ - 19కు సంబంధించి ఓ నిండు గర్భిణి నుంచి కాల్ వచ్చింది. కొవిడ్ వార్తల వల్ల విపరీతమైన భయాందోళనకు లోనైన ఆమె కుటుంబసభ్యులతో సంబంధం లేకుండా, తన గదిలో స్వీయనిర్బంధం చేసుకుంది. తాను ప్రసవం కోసం ఆస్పత్రికి వెళ్లేది లేదనీ, స్నానాల గదిలో ఉన్న బాత్‌టబ్‌లోనే తనంతట తాను ప్రసవం చేసుకోవాలని నిర్ణయించుకుంది. కుటుంబ సభ్యులు ఆమె ప్రవర్తనకు కంగారుపడి మాకు ఆమె చేత కాల్ చేయించారు. టెలీ కౌన్సెలింగ్ ద్వారా ఆమె భయాన్ని అంచనా వేయగలిగాం. కొవిడ్ - 19 మరణాల పట్ల ఆమెకు అవగాహన కల్పించాం. ఆ వైరస్ సోకిన ప్రతి ఒక్కరికీ మరణమే శరణ్యం కాదనీ, దాని నుంచి పూర్తిగా కోలుకోవడం సాధ్యమే అనీ ఆమెకు భరోసా కలిగించాం. మా కౌన్సెలింగ్‌తో ఆమె పరిస్థితి మెరుగైంది.

## నాలుగు స్లాట్స్!

సోమవారం నుంచి శుక్రవారం వరకూ వారంలో నాలుగు రోజులు అందుబాటులో ఉండే ఉచిత ఫోన్ కౌన్సెలింగ్ కోసం నాలుగు స్లాట్లు కేటాయించాం! వేర్వేరు స్లాట్లకు వేర్వేరు నంబర్లు కేటాయించాం. అవేంటంటే....

- ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 వరకు: 9849353305
- మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 వరకు: 7674901954
- సాయంత్రం 4 నుంచి 6 వరకు: 8297976773
- సాయంత్రం 6 నుంచి రాత్రి 8 వరకు: 9573027033

ఇ మెయిల్ ద్వారా కూడా మమ్మల్ని సంప్రతించవచ్చు.
ఇమెయిల్: sahayamou@gmail.com.

● గోగుమళ్ల కవిత

థింక్ కరోనా!



# హాబీ టైమ్

హాబీని ఎంచుకోవడానికి వయసుతో పనిలేదు. అయితే తీరికలేని జీవితం మూలంగా హాబీలే లేకుండా పోయాయి. కానీ లాక్‌డౌన్ పుణ్యమా అని హాబీల గురించి ఆలోచించే సమయం చిక్కింది. రిలాక్స్ అవడానికి ఏదో ఒక హాబీని ఎంచుకుంటున్నారు.

- కోడింగ్, పెయింటింగ్, ఫొటోగ్రఫీ, వీడియో మేకింగ్, పేపర్ క్రాఫ్ట్, స్కెచింగ్, ఒరిగామి... ఇవన్నీ లాక్‌డౌన్ మూలంగా హాబీలుగా మారిపోతున్నాయి.
- కొందరు ఫేస్‌బుక్ గ్రూప్ క్రియేట్ చేసుకొని క్రియేటివ్‌గా ఏదైనా సరే అందులో పోస్ట్ చేయాలని నియమం పెట్టుకుంటున్నారు. అవి ఎలా ఉన్నాయో ఇతర గ్రూపుల నుంచి ఫీడ్‌బ్యాక్‌ను తీసుకుంటున్నారు.
- ఒరిగామిని నేర్చుకోవడానికి లాక్‌డౌన్ మంచి అవకాశంగా లభించిందని భావిస్తున్నారు. ఎప్పుడో స్కూల్ సమయంలో నేర్చుకోవాలనుకున్నా సరిగ్గా ఫోకస్ పెట్టలేకపోయినవాళ్లకు పర్‌ఫెక్ట్ సమయం ఇది.
- స్కెచింగ్ హాబీగా ఉన్న కొందరు యాప్స్ సహాయంతో స్కెచ్‌లు వేస్తున్నారు. స్కెచింగ్‌లో ప్రయోగాలు చేయడానికి యాప్స్ ఉపయోగపడుతున్నాయని వారు అంటున్నారు.
- సంగీతంలో హాబీ ఉన్న వారు ట్యూన్ మదిలో మెదిలిన వెంటనే ప్లే చేస్తున్నారు. ఇంతకు ముందైతే ఆఫీసు పని పూర్తయ్యాక ఇంటికొచ్చాక చేయాల్సి వచ్చేది.
- లాక్‌డౌన్ సమయంలో పిల్లలతో క్రియేటివ్‌గా గడపాలని చాలామంది తల్లితండ్రులు ప్రయత్నిస్తున్నారు.

ట్రెండింగ్



# మనోళ్ల సరదా వీడియో

అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్న కొంత మంది తెలుగు కుర్రాళ్లు కరోనాపై ఓ వీడియో రూపొందించారు. 'కేర్‌ఫుల్ కరోనా ఆగయా' పేరుతో తీసిన ఆ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కరోనా సృష్టించిన వాతావరణం, వైరస్ బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ తీసిన ఆ మ్యూజికల్ వీడియో నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది. అమెరికాలో కరోనా పరిస్థితులు, వ్యక్తిగత శుభ్రతకు సంబంధించిన అంశాలకు సరదాను జోడించి తమదైన శైలిలో వీడియో రూపొందించారు. హైదరాబాద్‌కు చెందిన ఈ టెకీలు న్యూజెర్సీ, న్యూయార్క్ నగరాల్లో ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. సిస్టమ్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న సాయి స్వరూప్ ఈ వీడియోకు దర్శకత్వం వహించారు. కల్యాణ్‌రెడ్డి ముంగి, మన్నెం అనిల్ రెడ్డి, వరుణ్‌రెడ్డి, సంపత్‌లు నటించారు. "గత నెల నేను ఇండియా ట్రిప్‌కు వచ్చాను. తిరిగి నేను అమెరికా చేరుకున్న నాలుగు రోజుల తరువాత లాక్‌డౌన్ ప్రకటించారు. అప్పుడే నాకు ఈ వీడియో రూపొందించాలనే ఆలోచన వచ్చింది" అని తన మనసులో మాటను పంచుకున్నారు సాయి స్వరూప్. కరోనా తీవ్రతను తెలియజేసే ఉద్దేశంతో రూపొందించిన ఈ వీడియో ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉంది.



# సినీ 'మైదాన్'

**స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌తో ఇప్పటికే మనం చాలా సినిమాలు చూసుంటాం.. ఆయా సినిమాల్లో కథానాయకుడు కాసేపు ఓ ఆటగాడిగా కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకోవడం పరిపాటే.. కానీ అచ్చమైన క్రికెట్ నేపథ్యంలోనూ ఇప్పటికే పలు బాలీవుడ్ సినిమాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా డాక్యుమెంటరీలు, వెబ్ సిరీస్‌లు కూడా విశేషంగా ఆదరణ పొందాయి. ఇవన్నీ ఇప్పుడు అమెజాన్, నెట్‌ఫ్లిక్స్, యూట్యూబ్‌లో అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం లాక్‌డౌన్ కారణంగా అందరూ ఇళ్లల్లోనే ఉంటున్న నేపథ్యంలో సరదాగా వాటిపై ఓ కన్నేద్దాం..**

### ఫైర్ ఇన్ బాబిలోన్



వెస్టిండీస్.. ఇప్పటి క్రికెట్ అభిమానులకు ఓ సాదాసీదా జట్టుగానే తెలుసు. కానీ ఒకప్పుడు విండీస్ అంటే ఏమిటో ఈ డాక్యుమెంటరీ చూస్తే అర్థమవుతోంది. ఆరున్నర అడుగులుండే పేసర్ల చేతుల్లోంచి నిప్పులు చిమ్ముకుంటూ వచ్చే బౌన్సర్లను ఎదుర్కొవాలంటే అప్పటి మహామహులు సైతం వణికిపోయేవారు. 1970, 80వ దశకంలో అత్యద్భుతమైన ఆటతో వీరు ప్రపంచ క్రికెట్‌ను హస్తగతం చేసుకున్న తీరును 2011లో విడుదలైన ఈ డాక్యుమెంటరీలో చూడొచ్చు. క్లయివ్ లాయిడ్ నాయకత్వంలో వివియన్ రిచర్డ్స్, 'ఫియర్‌సమ్ ఫోర్‌సమ్'గా పిలుచుకున్న పేసర్లు మైకేల్ హోల్డింగ్, కొలిన్ క్రాఫ్ట్, జోయెల్ గార్నర్, ఆండీ రాబర్ట్స్ విండీస్ జట్టును శత్రు దుర్భేద్యంగా మార్చేసిన వైనం చూస్తుంటే ఇప్పటి తరానికి రోమాలు నిక్కబొడుచుకుంటాయి.

### లగాన్

అమీర్ ఖాన్ నటించి, నిర్మించిన ఈ బాలీవుడ్ క్లాసిక్ గురించి తెలియనిదెవరికి.. ఉత్కంఠభరితంగా సాగే క్రికెట్ మ్యాచ్‌లో ఎన్ని మలుపులుంటాయో ఈ కల్పిత కథలోనూ పొందుపరిచారు. క్రికెట్ అంటే ఏంటో తెలియని ఓ పల్లెవాసులు తమపై పన్ను పోటును తొలగించుకునేందుకు అనుభవజ్ఞులైన ఇంగ్లిష్ జట్టుతో పోరుకు సై అంటారు. ఈనేపథ్యంలో జరిగే మ్యాచ్‌లో ఫిక్సింగ్, బౌన్సర్లు, డైవింగ్ క్యాచ్‌లు, చివరి బంతికి సిక్స్‌తో ముగించడం ఇలా.. అన్ని భావోద్వేగాలను అద్భుతంగా రంగరించడంతో సినిమా పూర్తయ్యేసరికి అప్పట్లో ప్రేక్షకులు నిలబడి మరీ చప్పట్లు కొట్టారు.

### రోర్ ఆఫ్ ది లయన్



మ్యాచ్ ఫిక్సింగ్ కారణంగా ఐపీఎల్ నుంచి రెండేళ్ల నిషేధం ఎదుర్కొన్న చెన్నై సూపర్ కింగ్స్.. ఆ తర్వాత చాంపియన్‌గా ఎదిగిన వైనంపై ఈ వెబ్ సిరీస్ సాగుతుంది. ఈ రెండేళ్ల కాలంలో జట్టు యాజమాన్యం.. ఆటగాళ్లలో కలిగిన భావోద్వేగాలను.. బరిలోకి దిగాక ఎలాంటి వ్యూహాలతో ఆడి విజేతగా నిలిచామో ఇందులో జట్టు కెప్టెన్ ధోనీ వివరిస్తాడు.

### ఇన్‌సైడ్ ఎడ్జ్

క్రికెట్‌ను ఆధారం చేసుకుని సాగే చీకటి కార్యకలాపాలను అద్భుతంగా తెరకెక్కించిన వెబ్ సిరీస్ ఇది. ఇప్పటికే రెండు పార్టులుగా వచ్చి అభిమానులను ఆకట్టుకుంది. ముంబై మావెరిక్స్ అనే కల్పిత టీ20 జట్టుకు సంబంధించిన కథ ఇది. మైదానంలో క్రికెటర్లకంటే జట్ల యజమానులు, పరిపాలకులు, బుకీల పాత్ర కూడా చాలానే ఉంటుందని దీంట్లో చూడవచ్చు.

### ఇక్బాల్



ఉత్తర భారతంలోని ఓ పల్లెటూరిలో నివసించే మూగ, చెవిటి యువకుడికి క్రికెట్ అంటే ప్రాణం. అడుగడుగునా ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొంటూ జాతీయ జట్టుకు ఎలా ఎంపికయ్యాడన్న కథతో ఈ బాలీవుడ్ సినిమా రూపుదిద్దుకుంది. అతడిలోని ప్రతిభను గమనించిన ఓ తాగుబోతు కోచ్ అండగా నిలవడంతో అతడి కల నిజమవుతుంది. సెలెక్టర్ పాత్రలో కపిల్ దేవ్ కాసేపు కనిపిస్తాడు.

### బాడీలైన్



1932-33 యాషెస్ సిరీస్‌లో ప్రఖ్యాత బ్యాట్స్‌మన్ డాన్ బ్రాడ్‌మన్ హవాను అడ్డుకునేందుకు ఇంగ్లండ్ జట్టు పన్నిన వ్యూహమిది. బాడీలైన్ బౌలింగ్‌తో పేసర్ డగ్లస్ జార్డిన్ లెగ్‌సైడ్ ఫీల్డింగ్‌ను ఏర్పాటు చేసుకుని డాన్‌పై ఆధిపత్యం ప్రదర్శించాడు. పలువురు బ్యాట్స్‌మెన్ గాయాలపాలు కావడంతో ఈ బౌలింగ్ తీరు వివాదాస్పదమైంది.

### ది టెస్ట్

2018లో వెలుగు చూసిన బాల్ ట్యాంపరింగ్ ఉదంతం తర్వాత ఆస్ట్రేలియా జట్టు ప్రతిష్ఠ మసకబారింది. కెప్టెన్ స్మిత్, వార్నర్‌లపై ఏడాది నిషేధం విధించడంతో ఆసీస్ ప్రదర్శన కూడా పాతాళానికి చేరింది. ఈ కష్టకాలం నుంచి తిరిగి పూర్వపు స్థితికి చేరేలా సాగించిన ప్రయాణమే ఈ డాక్యుమెంటరీ.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)



# కపిల్-కోహ్లీ ఇద్దరూ ఇద్దరే!



శ్రీకాంత్

**న్యూఢిల్లీ:** ఎలాంటి అంచనాలు లేని స్థితిలో 1983లో భారత జట్టుకు వన్డే వరల్డ్‌కప్ అందించిన ఘనత అప్పటి కెప్టెన్ కపిల్‌దేవ్‌ది. అంతులేని ఆత్మవిశ్వాసానికి అతడి నాయకత్వం మారుపేరుగా నిలిచింది. సరిగ్గా అదే రీతిన ప్రస్తుత కెప్టెన్ విరాట్ కోహ్లీ కూడా సాగుతున్నాడని మాజీ ఓపెనర్ కృష్ణమాచారి శ్రీకాంత్ అభిప్రాయపడ్డాడు. వీరిద్దరూ ఓటమిని అంత తేలిగ్గా అంగీకరించరని తెలిపాడు. 1983 వరల్డ్‌కప్ విజేత జట్టులో శ్రీకాంత్ ఉండగా.. ధోనీ కెప్టెన్సీలో 2011 చాంపియన్ జట్టులో కోహ్లీ ప్రాతినిధ్యం వహించాడు. 'నేను కపిల్‌తో కలిసి ఆడా. అలాగే సెలెక్షన్ కమిటీ చైర్మన్‌గా కోహ్లీని జట్టుకు ఎంపిక చేశా. వీరిద్దరి ప్రవర్తన ఒక్కలాగే ఉంటుంది. వారిపై వారికి నమ్మకం ఎక్కువ. గెలిచి తీరాల్సిందే అనే పట్టుదలతో బరిలోకి దిగుతారు. ఓటమికి లొంగని తీరును చేజింగ్ సమయంలో మనం గమనించవచ్చు. ఇరువురూ ఆశావాద దృక్పథంతోనే కనిపిస్తారు' అని కపిల్, కోహ్లీలను శ్రీకాంత్ పొగిడాడు.



### ఐపీఎల్ రద్దయితే.. ధోనీకి చాన్స్ లేనట్టే

ఈ ఏడాది ఐపీఎల్ జరగకపోతే.. జాతీయ జట్టులోకి ధోనీ అవకాశాలు మృగ్యమేనని కృష్ణమాచారి శ్రీకాంత్ జోస్యం చెప్పాడు. 'ధోనీ రాక విషయంలో నేను దాటవేత ధోరణిని అవలంబించను. నేను గనక సెలెక్షన్ కమిటీ చైర్మన్‌గా ఉంటే ఏం చేసేవాడినో అదే చెప్తున్నా. ఐపీఎల్ రద్దయితే, ధోనీకి జట్టులో అవకాశాలు లేనట్టే. ధోనీ కథ ముగిస్తే.. అతని స్థానంలో కేఎల్ రాహుల్ మంచి చాయిస్' అని చిక్కా చెప్పుకొచ్చాడు.

### అప్పుడే రిటైరవ్వాల్సింది: అక్తర్



ధోనీ గతేడాది వన్డే వరల్డ్‌కప్ తర్వాతే రిటైరవ్వాల్సిందని పాక్ మాజీ స్పీడ్‌స్టర్ షోయబ్ అక్తర్ వ్యాఖ్యానించాడు. ఇప్పటికే జట్టుకు తన వంతు కృషి చేసిన ధోనీ.. ఆట నుంచి తప్పుకోకుండా ఎందుకింత జాప్యం చేస్తున్నాడో అర్థం కావడం లేదన్నాడు. కాగా భారత్-పాక్ సిరీస్‌పై తాను చేసిన వ్యాఖ్యలపై కపిల్ స్పందించడంపై అక్తర్ వ్యాఖ్యానిస్తూ 'కపిల్ భాయ్‌కి డబ్బు అవసరం లేదేమో.. కానీ వాటి అవసరం చాలామందికి ఉంది' అని అన్నాడు.



## 22 ఏళ్ల యువకుడితో.. నెమార్ తల్లి డేటింగ్..

**బ్రెజీలియా:** సాకర్ సూపర్ స్టార్ నెమార్ జూనియర్ తల్లి నడీనె గొంజాల్వెస్ (52) ఓ యువకుడితో డేటింగ్‌లో ఉన్నట్టు ఇన్‌స్టాగ్రామ్‌లో వెల్లడించింది. 2016లో భర్త నుంచి విడాకులు తీసుకున్న నడీనె కొద్దికాలంగా టియాగొ రమోస్ అనే 22 ఏళ్ల మోడల్‌తో డేటింగ్ చేస్తోంది. నెమార్ (28) కంటే టియాగొ ఆరేళ్లు చిన్నవాడు కావడం విశేషం. టియాగొ..నెమార్‌కు వీరాభిమాని. తాజాగా టియాగొతో కలిసి ఉన్న ఫొటోని నడీనె ఇన్‌స్టాలో పోస్ట్ చేయడంతో వీరి బంధం బహిర్గతమైంది. దీనిపై 'కొత్త బంధంలో సంతోషంగా ఉండు అమ్మా' అని నెమార్ కామెంట్ చేశాడు.

## ఐపీఎల్‌పై నిర్ణయం నేడు!

**న్యూఢిల్లీ:** ఐపీఎల్-13వ సీజన్ భవితవ్యం సోమవారం తేలనుంది. ప్రస్తుత లాక్‌డౌన్ పరిస్థితుల నేపథ్యంలో ఐపీఎల్ జరుగుతుందా? లేదా అన్నది అనుమానంగా మారింది. ఇప్పటికే లీగ్‌ను ఈనెల 14 దాకా వాయిదా వేసిన బీసీసీఐ.. తాజాగా కేంద్రం లాక్‌డౌన్‌ను పొడిగించే యోచనలో ఉండడంతో ఎలాంటి నిర్ణయం తీసుకోవాలన్న దానిపై మల్లగుల్లాలు పడుతోంది. అయితే, కేంద్రం నిర్ణయంపై వేచి చూస్తున్నామనీ.. ఆ తర్వాతే ఐపీఎల్ భవితవ్యాన్ని నిర్ణయించనున్నట్టు బీసీసీఐ అధ్యక్షుడు గంగూలీ వెల్లడించాడు. అయినా, జనజీవనమే స్తంభించిపోయిన ప్రస్తుత పరిస్థితుల్లో ఆటలకు చోటే లేనప్పుడు.. లీగ్ నిర్వహణ ఎలా సాధ్యమవుతుందంటూ? దాదా పరోక్షంగా ఐపీఎల్ లేనట్టేనన్న సంకేతాలిచ్చాడు. 'సోమవారం ఐపీఎల్‌పై స్పష్టత ఇస్తా. నిజం చెప్పాలంటే .. లాక్‌డౌన్ కారణంగా జనజీవనం స్తంభించిపోతోంది. ఇలాంటి పరిస్థితుల్లో క్రీడలకు చోటెక్కడిది? ఏదేమైనా ఐపీఎల్ నిర్వహణ సాధ్యాసాధ్యాలపై సోమవారం వివరాలు వెల్లడిస్తాం' అని గంగూలీ చెప్పుకొచ్చాడు.

## 1200 మంది డాక్టర్లతో సచిన్..



**ముంబై:** అంతర్జాతీయ క్రికెట్‌లో పాతికేళ్లు కొనసాగిన సచిన్ టెండూల్కర్ తన అపార అనుభవాన్ని ఇతరులతో పంచుకోవడంలో ఎప్పుడూ ముందుంటాడు. అలాగే క్రీడాకారుల గాయాలపై సచిన్ 12 వందల మంది డాక్టర్లతో ఆన్‌లైన్‌లో అభిప్రాయాలను పంచుకున్నాడు. ఈ లాక్‌డౌన్ సమయంలో స్పోర్ట్స్ ఇంజ్యూరీస్‌పై యువ డాక్టర్లకు సచిన్‌తో అవగాహన కల్పించాలని ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ సుధీర్ వారియర్ భావించాడు. అందుకే శనివారం ఈ ఆన్‌లైన్ సెషన్‌ను ఏర్పాటు చేసి సచిన్‌ను ఆహ్వానించాడు.

## 'లారా 400'కి 16 ఏళ్లు..



**ఆంటిగ్వా:** కరీబియన్ దిగ్గజం బ్రయాన్ లారా పేరు చెప్పగానే క్రికెట్ అభిమాని ఎవరికైనా ఠక్కున గుర్తొచ్చేది అతడు ఇంగ్లండ్‌పై చేసిన క్వాడ్రపుల్ (400 నాటౌట్) శతకమే. 2004లో వెస్టిండీస్‌లో ఇంగ్లండ్‌తో జరిగిన 4 టెస్టుల సిరీస్‌లోని ఆఖరి మ్యాచ్‌లో లారా ఈ ఘనత సాధించాడు. అతడు ఈ భారీ అజేయ శతకం చేసి ఆదివారానికి సరిగ్గా 16 ఏళ్లు అవుతుంది. ఈ సిరీస్ మొదలయ్యే నాటికి లారా ఫామ్‌లో లేడు. తొలి మూడు టెస్టుల్లో కలిపి 100 రన్సే చేశాడు. లారా పనైపోయిందని విమర్శలు చుట్టుముట్టిన సమయంలో చిరస్మరణీయమైన ఇన్నింగ్స్ ఆడి టెస్టుల్లో అత్యధిక వ్యక్తిగత స్కోరు రికార్డును సొంతం చేసుకున్నాడు. 582 బంతులు ఎదుర్కొని 43 ఫోర్లు, 4 సిక్సర్లతో 400 పరుగులు చేశాడు. టెస్టులో ఒక ఇన్నింగ్స్‌లో 350 ప్లస్ వ్యక్తిగత పరుగులు రెండుసార్లు సాధించిన ఏకైక క్రికెటర్ లారానే కావడం విశేషం.

# బిజినెస్

## గోల్డ్ ఈటీఎఫ్స్ కళకళ

**2019-20లో రూ.1,600 కోట్ల పెట్టుబడులు**

**న్యూఢిల్లీ:** వరుసగా ఆరేళ్ల పాటు ఇన్వెస్టర్లు బంగారం ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (ఈటీఎఫ్)కు దూరంగా ఉన్నారు. అయితే గత ఆర్థిక సంవత్సరం (2019-20)లో మాత్రం వీరి పెట్టుబడులు పెరిగాయి. ఇందుకు కారణం కరోనా వైరస్ వ్యాప్తి మూలంగా ఏర్పడిన భయాందోళనలే. తమ పెట్టుబడులకు బంగారం రక్షణను ఇస్తుందన్న విశ్వాసంతో ఇన్వెస్టర్లు బంగారాన్ని నమ్ముకున్నారు. అందుకే పెట్టుబడుల్లో జోరు పెరిగింది. కరోనా వైరస్ ప్రపంచ ఆర్థిక వ్యవస్థను, స్టాక్ మార్కెట్లను అల్లకల్లోలం చేస్తోంది. రానున్న కాలంలో పరిస్థితులు మరింత ఘోరంగా ఉండవచ్చన్న అంచనాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలోనే బంగారంలో పెట్టుబడులు పుంజుకుంటున్నాయి.

- 2020 మార్చి నాటికి బంగారం ఫండ్స్ నిర్వహణలోని ఆస్తులు (ఏయూఎం) 79 శాతం పెరిగి 7,949 కోట్లకు చేరుకున్నాయి. 2019 మార్చి చివరినాటికి ఇవి రూ.4,447 కోట్లుగా ఉన్నాయని గణాంకాలు వెల్లడిస్తున్నాయి
- 2019-20 ఆర్థిక సంవత్సరంలో ఇన్వెస్టర్లు నికరంగా 14 గోల్డ్ లింక్డ్ ఈటీఎఫ్‌లలో రూ.1,613 కోట్ల పెట్టుబడులు పెట్టారు. 2019-20లో వీరు రూ.412 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు
- 2017-18లో రూ.835 కోట్లు, 2016-17లో రూ.775 కోట్లు, 2015-16లో రూ.903 కోట్లు, 2014-15లో 1,475 కోట్లు, 2013-14లో రూ.2,293 కోట్ల పెట్టుబడులను ఇన్వెస్టర్లు వెనక్కి తీసుకున్నారు. అయితే 2012-13లో మాత్రం రూ.1,414 కోట్ల పెట్టుబడులు పెట్టారు.

# దశల వారీగా లాక్‌డౌన్ ఎత్తేయండి

**అంతకు ముందే మరో సహాయ ప్యాకేజీ ప్రకటించాలి**

**ప్రభుత్వానికి సీఐఐ సూచన**

**న్యూఢిల్లీ:** లాక్‌డౌన్‌ను దశల వారీగా ఎత్తివేయాలని పారిశ్రామిక సంఘాలు కోరుతున్నాయి. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఈ మేరకు ప్రభుత్వానికి పలు సూచనలు చేసింది. ఇందుకోసం ముందుగా కరోనా తీవ్రత ఆధారంగా ఆయా ప్రాంతాలను రెడ్, గ్రీన్, సాఫ్రాన్ (కాషాయ) జోన్లుగా విభజించాలని సూచించింది. ఆ తర్వాత ఆయా జోన్లలో ఉన్న పరిశ్రమలను ఒకటి నుంచి మూడు వారాల గ్యాప్‌తో నిదానంగా ప్రారంభించాలని కోరింది.

**ప్యాకేజీ కావాలి**

పరిశ్రమల ప్రారంభానికి ముందే ఆయా పరిశ్రమల కోసం ప్రత్యేక ఆర్థిక సహాయ ప్యాకేజీ ప్రకటించాలని సీఐఐ ప్రభుత్వాన్ని కోరింది. వస్త్ర, ఫార్మా, ఫుడ్ ప్రాసెసింగ్, ఖనిజాలు-లోహాలు, ఈ-కామర్స్, ఆటోమొబైల్స్, రసాయన పరిశ్రమలు దేశ ఆర్థిక వ్యవస్థకు అత్యంత కీలకమని తెలిపింది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ పరిశ్రమలను క్రమ పద్ధతిలో పునఃప్రారంభించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరింది.

**ఇతర సూచనలు**

- ఆయా ప్రాంతాల్లో పరిశ్రమల పునఃప్రారంభ విషయాన్ని తగినంత ముందుగా ప్రకటించాలి
- కరోనా ప్రభావం లేని గ్రీన్ జోన్‌లో అన్ని పరిశ్రమలను ఒకేసారి పునఃప్రారంభించవచ్చా? లేదా?అనే విషయం పరిశీలించాలి
- కరోనా ప్రభావం తక్కువగా ఉన్న సాఫ్రాన్ (కాషాయం) జోన్‌లో ఏయే పరిశ్రమలను ముందుగా తిరిగి ప్రారంభించాలో నిర్ణయం తీసుకోవాలి
- కరోనా తీవ్రత ఎక్కువగా ఉన్న రెడ్ జోన్లలో అత్యవసర, మినహాయింపు ఉన్న సేవలను మాత్రమే అనుమతించాలి
- ప్రారంభమైన అన్ని ఫ్యాక్టరీలు, ఇతర కేంద్రాల వద్ద తప్పనిసరిగా కార్మికుల ఆరోగ్య రక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలి
- ఏ కంపెనీ అయినా అవసరమైన పూర్తి రక్షణ చర్యలు తీసుకోకపోతే భారీగా జరిమానాలు విధించాలి
- అత్యవసర వస్తు, సేవలు, ఉద్యోగాలు, జీవనోపాధిని కాపాడే పరిశ్రమలను వెంటనే ప్రారంభించాలి
- ఎగుమతి ఆధారిత పరిశ్రమలనూ వెంటనే ప్రారంభించాలి.

**పరిశ్రమల సూచనలకు ఆహ్వానం**

ప్రభుత్వం కూడా కీలకమైన వస్త్ర, రసాయనాలు, ఎలక్ట్రానిక్స్, ఫార్మా కంపెనీలు ఎక్కువగా ఉండే క్లస్టర్లలో లాక్‌డౌన్ ఎత్తివేసేందుకు సిద్ధమవుతోంది. ఇందుకు అవసరమైన సూచనలు చేయాలని పరిశ్రమ వర్గాలను కోరింది. ఈ క్లస్టర్లలో లాక్‌డౌన్ ఎత్తివేస్తే ఉత్పత్తి, కార్మికులు, ముడి సరుకులు, తుది ఉత్పత్తుల ఎగుమతి, దిగుమతుల పరంగా ఎదురయ్యే ఇబ్బందులపై పరిశ్రమ వర్గాలు తమ అభిప్రాయాలు తెలపాలని విజ్ఞప్తి చేసింది.

## సుదీర్ఘ లాక్‌డౌన్‌తో ఐటీ కొలువుల్లో కోతలు!

**నాస్కామ్ మాజీ ప్రెసిడెంట్ ఆర్ చంద్రశేఖర్**

**హైదరాబాద్:** కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించేందుకు దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ కొనసాగుతున్న విషయం తెలిసిందే. అయితే సుదీర్ఘకాలం లాక్‌డౌన్ కొనసాగడం మూలంగా ఐటీ పరిశ్రమలో ఉద్యోగాల కోతకు దారితీయవచ్చని నాస్కామ్ మాజీ ప్రెసిడెంట్ ఆర్ చంద్రశేఖర్ సంకేతాలిచ్చారు. వర్క్ ఫ్రమ్ హోమ్ సంస్కృతి దీర్ఘకాలంలో సానుకూలంగా ఉండవచ్చని, ఐటీ కంపెనీల పెట్టుబడులను ఆదా చేసే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. వెంచర్ క్యాపిటలిస్టుల నిధులతో స్టార్టప్స్ మనుగడ సాగిస్తున్నాయని, ప్రస్తుత పరిణామాలు ఇంకా దిగజారితే ఈ సంస్థలు మరింత గడ్డ పరిస్థితులను ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు.



"పెద్ద కంపెనీలు ఉద్యోగులను తగ్గించుకోకుండా ఉండటానికి రెండు కారణాలున్నాయి. ఒకటేమిటంటే.. వారు తమ ఉద్యోగులను కోల్పోవాలనుకోరు. ఆయా కంపెనీల వద్ద తగినంత సొమ్ము ఉంది. పెద్ద కంపెనీల్లో కొన్ని ఉద్యోగులను తొలగించాలనుకుంటే.. తాత్కాలిక ఉద్యోగులను తగ్గించుకోవచ్చు. కానీ రెగ్యులర్, శాశ్వత ఉద్యోగులను కోల్పోవాలనుకోరు. అయితే రెండు మూడు నెలల పాటు ఇదే పరిస్థితి కొనసాగితే వాటిపై కూడా ఒత్తిడి రావడానికి అవకాశం ఉంటుంది. ఉద్యోగులకు సబ్సిడీలు కొనసాగిస్తూ ఉండలేని పరిస్థితి ఏర్పడవచ్చు. ఎంతకాలం అది కొనసాగుతుందన్నదే ప్రశ్న" అని చంద్రశేఖర్ అన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రపంచవ్యాప్తంగా చాలా కంపెనీలు ఇంటి నుంచి పనికే ప్రాధాన్యం ఇస్తున్నాయి. ఇది స్వల్పకాలంలో పరిశ్రమపై ప్రతికూల ప్రభావం చూపినా దీర్ఘకాలంలో ఇది పని సంస్కృతిని మార్చే అవకాశం ఉందని చెప్పారు. మరికొన్ని నెలలపాటు ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుత పరిస్థితులే కొనసాగితే ఐటీ రంగంలోని పెద్ద కంపెనీల్లోనూ ఉద్యోగ కోతలు తప్పదని అన్నారు.

**డిమాండ్ తగ్గుతుంది:** ప్రపంచమంతా ఒత్తిడికి గురవుతున్న నేపథ్యంలో ఐటీ పరిశ్రమకు డిమాండ్ తగ్గుతుందని భావిస్తున్నట్టు నాస్కామ్ మాజీ చైర్మన్ బీవీఆర్ మోహన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రపంచంలోని ఏ ఆర్థిక వ్యవస్థ కూడా బాగుండే అవకాశం లేదన్నారు. అన్ని ఎంతో కొంత ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయని చెప్పారు. కాబట్టి డిమాండ్ తగ్గడానికి అవకాశం ఉందని చెప్పారు.

## టెక్ వ్యూ: 9000 పైన నిలదొక్కుకుంటేనే



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం పాజిటివ్ ట్రెండ్‌తో ప్రారంభమై చివరకు పటిష్ఠంగా ముగిసింది. టెక్నికల్‌గా రిలీఫ్ ర్యాలీని చవిచూసింది. కొద్ది రోజులుగా 1500 పాయింట్లకు పైగా ర్యాలీని కనబరిచిన నిఫ్టీ ప్రస్తుతం స్వల్పకాలిక నిరోధ స్థాయిలైన 9000 పాయింట్లకు ఎగువన ఉంది. టెక్నికల్‌గా బ్రేకవుట్ సాధించటంతో పుల్‌బ్యాక్ రియాక్షన్‌కు అవకాశం ఉంది. స్వల్పకాలిక ట్రేడర్లు అప్రమత్తంగా వ్యవహరించాలి. 9000 పాయింట్లను అధిగమించటంతో ప్రస్తుతం ఇవి మద్దతు స్థాయిలుగా మారాయి. ఈ స్థాయిలకు ఎగువన నిలదొక్కుకుంటేనే అప్‌ట్రెండ్ ఆశలు సజీవంగా ఉంటాయి.

**బుల్లిష్ స్థాయిలు:** రికవరీ కోసం ప్రధాన నిరోధ స్థాయిలైన 9200 ఎగువన నిలదొక్కుకోవాలి. తదుపరి నిరోధ, టార్గెట్ స్థాయి 9500.

**బేరిష్ స్థాయిలు:** 9000 వద్ద నిలదొక్కుకోలేకపోతే కరెక్షన్‌ను సూచిస్తుంది. తదుపరి ప్రధాన మద్దతు స్థాయి 8800. ఇక్కడ కూడా నిలదొక్కుకోలేకపోతే తదుపరి మద్దతు, టార్గెట్ స్థాయి 8500. సత్వర అప్‌ట్రెండ్ కోసం ఈ స్థాయిల వద్ద నిఫ్టీ కచ్చితంగా రికవరీ కావాల్సి ఉంటుంది.

**బ్యాంక్ నిఫ్టీ:** ఈ సూచీకి ప్రధాన నిరోధ స్థాయి 20500. ఇక్కడ కరెక్షన్‌కు గురయితే ప్రధాన మద్దతు స్థాయి 19000 దిగువన ఉంటుంది.

**పాటర్న్:** మార్కెట్ 25 రోజుల సగటు చలన స్థాయిల వద్ద గట్టి పరీక్షను ఎదుర్కొంటోంది. ప్రస్తుతం 9200 వద్ద అప్‌ట్రెండ్ కోసం "ఏటవాలుగా దిగువకు కనిపిస్తున్న రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" నిలదొక్కుకోవాలి. 8800 వద్ద "అడ్డంగా కనిపిస్తున్న సపోర్ట్ ట్రెండ్ లైన్" కన్నా దిగజారితే మరింత డౌన్‌ట్రెండ్ ఉంటుంది. 8500 వద్ద "అడ్డంగా కనిపిస్తున్న సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద తదుపరి మద్దతు స్థాయిలుంటాయి.

**టైమ్:** ఈ సూచీ ప్రకారం బుధవారం మైనర్ రివర్సల్ ఉంది.



**కోటక్ మహీంద్రా బ్యాంక్ (రూ.1252) కొనుగోలు స్థాయిలకు చేరువలో..**

| | | |
|---|---|---|
| రూ.1250 ఎగువన అప్‌ట్రెండ్ | మొదటి నిరోధం రూ.1320 | రెండో నిరోధం రూ.1400 |
| రూ.1200 దిగువన డౌన్‌ట్రెండ్ | మొదటి మద్దతు రూ.1130 | రెండో మద్దతు రూ.1060 |

| సోమవారం స్థాయిలు | |
|---|---|
| నిరోధం | 9200, 9340 |
| మద్దతు | 9000, 8900 |

www.sundartrends.in

## జీడీపీ వృద్ధి రేటు 3% లోపే

**ప్రపంచ బ్యాంక్ అంచనా**



**వాషింగ్టన్:** ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2020-21)లో భారత జీడీపీ వృద్ధి రేటు మూడు దశాబ్దాల కనిష్ఠ స్థాయికి పడిపోతుందని ప్రపంచ బ్యాంక్ స్పష్టం చేసింది. ఈ కాలానికి వృద్ధి రేటు 1.5 నుంచి 2.8 శాతం మధ్య నమోదయ్యే అవకాశం ఉందని ఒక నివేదికలో పేర్కొంది. ఇది నిజమైతే ఆర్థిక సంస్కరణలు ప్రారంభమైన 1991 తర్వాత ఇదే కనిష్ఠ జీడీపీ వృద్ధి రేటు అవుతుంది. కరోనాతో పాటు డిమాండ్ మందగించడం ఇందుకు ప్రధాన కారణమని ప్రపంచ బ్యాంక్ తెలిపింది. 2020 మార్చితో ముగిసిన 2019-20 ఆర్థిక సంవత్సరంలోనూ భారత జీడీపీ 4.8 శాతం నుంచి 5 శాతం మధ్య ఉండే అవకాశం ఉందని పేర్కొంది.

## ర్యాలీకి అవకాశాలెక్కువ!

గత వారం నిఫ్టీ మళ్లీ కీలకమైన 9,000 పాయింట్ల బెంచ్‌మార్క్‌ని అధిగమించింది. అంతకు ముందు వారంతో పోలిస్తే 12 శాతానికి పైగా పెరిగి 300 పాయింట్లకు పైగా లాభపడింది. కరోనా ఉధృతి తగ్గుతోందన్న వార్తలు ఈ రిలీఫ్ ర్యాలీకి ప్రధానంగా దోహదం చేశాయి.

**ఈ వారం ఎలా:** టెక్నికల్‌గా చూస్తే నిఫ్టీ గత వారం 20 రోజుల అసాధారణ సగటు చలన (ఈఎంఏ) స్థాయిని అధిగమించింది. కరోనాకు సంబంధించి ప్రతికూల వార్తలేమీ లేకపోతే కొద్ది రోజుల్లో నిఫ్టీ 9,500-9,700 పాయింట్లకు చేరుకునే అవకాశం ఉంది. ప్రతికూల సంఘటనలు చోటు చేసుకుంటే మాత్రం 8,900-8,650 మధ్య కదలాడవచ్చు.

**స్టాక్ రికమండేషన్స్..**

**కాంకర్ (కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా):** ఇటీవల రూ.340 కనిష్ఠ స్థాయిని తాకి న ఈ నవరత్న కంపెనీ షేరు గత వారం ఎన్ఎస్ఈలో రూ.374.25 వద్ద ముగిసింది. రానున్న రోజుల్లో రూ.417-420 మధ్య కదలాడే అవకాశం ఉంది. రూ.352 స్టాప్‌లాస్‌తో ఈ షేరును కొనుగోలు చేయవచ్చు.

**మారుతి సుజుకీ:** ఈ మధ్యనే రూ.4,000 కనిష్ఠ స్థాయిని తాకిన మారుతి షేరు గత వారం 33 శాతం లాభంతో రూ.5,326.75 వద్ద క్లోజైంది. ఈ వారం రూ.5,150 స్థాయికి చేరుకుంటే రూ.5,700-5,900 టార్గెట్‌తో ఇన్వెస్టర్లు ఈ షేరును కొనుగోలు చేయవచ్చు. స్టాప్‌లాస్ రూ.4,720.

**- సమీత్ చవాన్, చీఫ్ అనలిస్ట్ టెక్నికల్, డెరివేటివ్స్, ఏంజెల్ బ్రోకింగ్**

**గమనిక:** పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

### ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



| | | | |
|---|---|---|---|
| 12వ తేదీకి.. | | విజయవాడ | 345 |
| హైదరాబాద్ | 365 | విశాఖపట్నం | 345 |
| 13వ తేదీకి.. | | వరంగల్ | 368 |
| చిత్తూరు | 443 | డజను గుడ్లు రూ. 54 | |
| గోదావరి | 280 | | |

### ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 85 | విజయవాడ | 80 |
| వరంగల్ | 85 | గుంటూరు | 80 |
| మహబూబ్‌నగర్ | 85 | ఒంగోలు | 80 |
| కరీంనగర్ | 85 | చిత్తూరు | -- |
| కర్నూలు | 85 | నెల్లూరు | -- |
| విశాఖపట్నం | 75 | అనంతపురం | -- |
| గోదావరి | 85 | | |



శ్రీకాకుళం జిల్లా పైడిభీమవరం వద్ద వాహనాలపై మందు స్ప్రే చేసిన తర్వాతే జిల్లాలోకి అనుమతిస్తున్న దృశ్యం

## ప్రతి వాహనంపై స్ప్రే

▸▸ శ్రీకాకుళంలో కట్టుదిట్టంగా కరోనా నివారణ చర్యలు

శ్రీకాకుళం, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లాలో కరోనా పాజిటివ్ కేసులు ఒక్కటి కూడా నమోదు కానప్పటికీ అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లాకు విశాఖపట్నం, విజయనగరం జిల్లాలు సరిహద్దులుగా ఉన్నాయి. నిత్యావసరాలను తరలించే వాహనాలకు లాక్‌డౌన్‌లో మినహాయింపు ఉండటంతో ఆ రెండు జిల్లాల నుంచి సరుకు రవాణా వాహనాలు వస్తున్నాయి. దీంతో వాటిపైనా శ్రీకాకుళం జిల్లా అధికారులు నిఘా పెట్టారు. కరోనా నిరోధక టన్నెల్‌ను కూడా ఏర్పాటు చేశారు. వాహనాలు ఈ టన్నెల్ ద్వారానే రాకపోకలు సాగించాలి. అదే సమయంలో వాహనాలపై సోడియం హైపోక్లోరైట్ ద్రావణం స్ప్రే చేస్తున్నారు.

## బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మివేయొద్దు

▸▸ పొగాకు, గుట్కా నమిలి రోడ్లపై ఊస్తే కఠిన చర్యలు: ప్రభుత్వం

అమరావతి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ వ్యాప్తిని నిరోధించేందుకు బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మివేయడాన్ని నిషేధిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. భారతీయ వైద్య పరిశోధన మండలి(ఐసీఎంఆర్) సిఫారసుల మేరకు ఈ నిర్ణయం తీసుకుంది. నోటి నుంచి వచ్చే తుంపరలు, బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మివేయడం ద్వారా కరోనా వ్యాపిస్తుందని ఐసీఎంఆర్ ఇదివరకే కేంద్రాన్ని అప్రమత్తం చేసింది. వైరస్ సోకిన వ్యక్తులు పొగాకు ఉత్పత్తులు, గుట్కా, ఇతర మసాలా గమ్ పదార్థాలు నమిలి రోడ్లపై ఉమ్మివేస్తే వైరస్ వేగంగా వ్యాప్తిచెందే ప్రమాదం ఉందని, ఈ నేపథ్యంలో అంటువ్యాధుల చట్టంలోని నిబంధనల మేరకు బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మివేయడాన్ని నిషేధించాలని సూచించింది.

## విద్యుత్ సంస్థలకు కలిసొచ్చిన కరోనా!

అమరావతి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఏపీ విద్యుత్ సంస్థలకు కరోనా ఒక కోణంలో కలిసివచ్చేలా చేసింది. బహిరంగ మార్కెట్లో విద్యుత్ ధరలు బాగా పడిపోవడంతో అక్కడ కొనుగోలు చేయడం ద్వారా అవి రూ.56 కోట్లు ఆదా చేసుకోగలిగాయి. బహిరంగ మార్కెట్లో ఇప్పుడు యూనిట్ విద్యుత్ రూ.2.04 నుంచి రూ.2.64 మధ్యలో లభిస్తోంది. దీంతో సొంత థర్మల్ ప్లాంట్లలో విద్యుదుత్పత్తి నిలిపివేసి అవి విద్యుత్‌ను బయట కొనుగోలు చేస్తున్నాయి. మార్చిలో ఇలా రోజుకు 14 మిలియన్ యూనిట్ల నుంచి 20 మిలియన్ యూనిట్ల మధ్యలో కొనుగోలు చేశాయి. ఇంత తక్కువకు బహిరంగ మార్కెట్లో విద్యుత్ దొరకడం చాలా అరుదు.

## జగన్.. స్పైడర్ భైరవుడు: దేవినేని ఉమా

విజయవాడ, ఏప్రిల్ 12: ప్రజలు ఏడుస్తుంటే చూసి ఆనందించే శాడిస్ట్ మనస్తత్వం ఉన్న వ్యక్తి ఈ రాష్ట్రాన్ని పాలిస్తుండటం రాష్ట్ర ప్రజల దురదృష్టమని మాజీ మంత్రి దేవినేని ఉమ విమర్శించారు. ఆదివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. స్పైడర్ సినిమాలో విలన్ భైరవుడిలాంటి శాడిస్టిక్ మనస్తత్వం ఉన్నవారు ఈ రాష్ట్రాన్ని పాలిస్తున్నారన్నారు. కరోనా మహమ్మారి నుంచి తమ రాష్ట్ర ప్రజల ప్రాణాలు ఎలా కాపాడుకోవాలా అని అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆలోచిస్తుంటే జగన్ మాత్రం కక్ష సాధింపు చర్యలను ఎలా అమలు చేయాలా అని ఆలోచిస్తున్నారని విమర్శించారు.

## ప్రోత్సాహకాలు చెల్లించండి: ఎంఎస్ఎంఈలు

అమరావతి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): కరోనా ప్రభావం వల్ల దెబ్బతిన్న సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి పరిశ్రమ(ఎంఎస్ఎంఈ)లను ఆదుకోవాలని ఏపీ ఎంఎస్ఎంఈ అసోసియేషన్ కేంద్రాన్ని కోరింది. లాక్‌డౌన్ కారణంగా ఎంఎస్ఎంఈ పరిశ్రమలన్నీ మూతపడ్డాయని, కానీ ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు కార్మికులు వేతనాలు తగ్గించలేదని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఎంఎస్ఎంఈ కార్మికుల వేతనాల్లో 50శాతం ప్రభుత్వమే ఇవ్వాలని అసోసియేషన్ కోరింది. కేంద్ర మంత్రి గడ్కరీకి లేఖ రాసింది.

## టీ ఎంసెట్ సహా ప్రవేశ పరీక్షలన్నీ వాయిదా

హైదరాబాద్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): నెలాఖరు వరకు లాక్‌డౌన్ పొడిగింపుతో మే నెలలో జరగాల్సిన అన్ని ప్రవేశ పరీక్షలు(సెట్స్) వాయిదా పడ్డాయి. వీటిని తప్పని పరిస్థితుల్లో వాయిదా వేస్తున్నట్లు తెలంగాణ ఉన్నత విద్యామండలి ప్రకటించింది. ప్రభుత్వంతో సంప్రదించిన తర్వాత నూతన షెడ్యూల్‌ను జారీ చేస్తామని చైర్మన్ పాపిరెడ్డి వెల్లడించారు.

## మండలిలో ఆర్డినెన్స్‌కు చెక్: యనమల

అమరావతి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషనర్‌ను మార్చడం కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆర్డినెన్స్‌ను శాసన మండలిలో అడ్డుకుంటామని మండలిలో ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు ఆదివారం ఓ ప్రకటనలో ప్రకటించారు. కొత్త ఎన్నికల కమిషనర్‌ను తీసుకు రావడం కోసం పాత కమిషనర్ పదవీకాలాన్ని కుదిస్తూ తీసుకొచ్చిన ఈ ఆర్డినెన్సు రాజ్యాంగంలోని 243(కె) అధికరణానికి ఈ ఆర్డినెన్స్ వ్యతిరేకమని, జూన్‌లో ఉభయ సభల సమావేశాల సందర్భంగా మండలిలో ఎట్టి పరిస్థితుల్లోనూ దీనికి ఆమోదం తెలిపేది లేదని స్పష్టం చేశారు.

## సోషల్ మీడియాలో కరోనా సమాచారం

అమరావతి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియా ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో కొవిడ్-19కి సంబంధించిన పూర్తి సమాచారం తెలుసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసింది. ఫేస్‌బుక్, వాట్సాప్ ద్వారా సమాచారాన్ని పొందే అవకాశం ఏర్పాటు చేసినట్లు వైద్యారోగ్యశాఖ తెలిపింది. వాట్సాప్‌లో 8297104104 నంబర్‌కు 'హాయ్' అని టైప్ చేసి సెండ్ చేయగానే అందరికీ కొవిడ్-19 వివరాలు అందుబాటులోకి రానున్నాయి. ఫేస్‌బుక్‌లో ఆరోగ్య ఆంధ్ర మెసెంజర్ ద్వారా సమాచారం పొందవచ్చు.

## ఛత్తీస్‌గఢ్ నుంచి ఏపీ విద్యార్థులు రాష్ట్రానికి

అమరావతి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ఇటలీ నుంచి వచ్చి ఛత్తీస్‌గఢ్ బోర్డర్‌లో చిక్కుకున్న తెలుగు విద్యార్థులు స్వరాష్ట్రానికి రావడానికి లైన్ క్లియర్ అయింది. 33 మంది తెలుగు విద్యార్థులను ఏపీకి రప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని చొరవ తీసుకున్నారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆ విద్యార్థులకు విముక్తి లభించింది. విద్యార్థులు సోమవారం విశాఖపట్నానికి చేరుకోనున్నారు.

## అమెరికాలో కాల్పులు.. నెల్లూరు విద్యార్థికి తీవ్ర గాయాలు

మనుబోలు, ఏప్రిల్ 12: ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన నెల్లూరు విద్యార్థి డేగా ధీరజ్ కుమార్ రెడ్డి అక్కడ దుండగుల చేతుల్లో కాల్పులకు గురై ప్రాణాలతో పోరాడుతున్నాడు. ఇలినియస్ యూనివర్సిటీ సమీపంలో గురువారం కొందరు దుండగులు ధీరజ్‌పై కాల్పులు జరిపి పర్స్ ఎత్తుకుపోయారు. కడుపు, కాలులోకి బుల్లెట్లు దూసుకెళ్లడంతో అతని పరిస్థితి విషమంగా మారింది. అతనికి వెంటిలేషన్‌పై చికిత్స అందిస్తున్నారు. అతని పరిస్థితి ఇంకా విషయమంగానే ఉందని, అయితే తొలి రెండు రోజులతో పోలిస్తే ఆదివారం కాస్త మెరుగైనట్లేనని ధీరజ్ స్నేహితులు వెల్లడించారు. పొదలకూరు మండలం లింగంపల్లికి చెందిన ధీరజ్‌రెడ్డి చిన్న వయసులోనే తల్లిదండ్రులను కోల్పోయాడు. అమ్మమ్మ, మేనమామలు చేరదీసి చదివించారు. ఇంజనీరింగ్ పూర్తికాగానే బెంగళూరులో ఉద్యోగంలో చేరాడు. అయితే ఎంఎస్ చేయాలన్న కోరికతో జనవరిలో అమెరికా వెళ్లాడు.

### ఆన్‌లైన్‌లో నిధుల సేకరణ

ధీరజ్ వైద్యానికి సుమారు 2.5 లక్షల డాలర్ల వరకూ ఖర్చు అవుతుంది. అంత డబ్బు భరించే స్థోమత లేకపోవడంతో ధీరజ్ స్నేహితుడు కిషోర్ చిట్టమూరు ఆన్‌లైన్‌లో నిధుల సేకరణ చేపట్టారు. దానికి మంచి స్పందన వచ్చింది. ఇప్పటి వరకూ 1.76 లక్షల డాలర్ల నిధులు సమకూరాయి. భారత ప్రభుత్వం కూడా సహకరిస్తే ధీరజ్ ప్రాణాలతో బయటపడొచ్చని అతని స్నేహితులు భావిస్తున్నారు.





ఆదివారం హనుమాన్ జంక్షన్, విశాఖపట్నంలో చికెన్ కోసం బారులు తీరిన జనం

# దాస్తే ముప్పే!

▸▸ కరోనా కేసులపై ప్రభుత్వం దాటవేత

అమరావతి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ తీవ్ర ప్రమాదకరమని తెలిసినా.. ప్రభుత్వం మాత్రం పాజిటివ్ కేసుల విషయంలో దోబూచులాడుతోంది. రాష్ట్రంలో కరోనా ప్రభావం తీవ్రంగా ఉన్నప్పటికీ.. ముఖ్యమంత్రి అలాంటిదేమీ లేదు పొమ్మంటున్నారు. అధికారులూ వంతపాడుతున్నారు. కరోనా అసలు సమస్యే కాదన్న ధోరణితో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలో 417 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. పాజిటివ్ కేసుల విషయంలో మనం తొమ్మిదో స్థానంలో ఉన్నాం. ఇదే సమయంలో మరణాల సంఖ్య కూడా పెరుగుతోంది. ఇప్పటి వరకూ ప్రభుత్వ లెక్కల ప్రకారం ఆరుగురు కరోనాతో మృతి చెందారు. కానీ ప్రభుత్వ పెద్దలు ప్రతి విషయాన్ని దాచి పెట్టే ధోరణిలో వ్యవహరిస్తున్నారు. శనివారం ప్రధాని మోదీ రాష్ట్రాల సీఎంలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వం ఇదే విధంగా వ్యవహరించింది. ఆ రోజు రాష్ట్రంలో 405 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. కానీ ప్రధానికి ఇచ్చిన నివేదికలో 381 కేసులు మాత్రమే చూపించారు. శుక్రవారం సాయంత్రం వరకూ నమోదయిన కేసులు మాత్రమే చూపించారు. మీడియాకు ఇస్తున్న బులెటిన్లలో కూడా దాపరికమే నడుస్తోంది. ఒకేసారి 30 పాజిటివ్ కేసులు వచ్చినా.. ఈ రోజు 15, రేపు 15 విడుదల చేద్దామన్నట్లుగా అధికారులు వ్యవహరిస్తున్నారు. శనివారం రాత్రికి 415 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. కానీ బులెటిన్‌లో 405 మాత్రమే చూపించారు. ఆదివారం రాత్రి వరకూ అసలు బులెటినే విడుదల చేయలేదు. సీఎంకు ఇచ్చిన రిపోర్టులో మాత్రం రాష్ట్రంలో 417 పాజిటివ్ కేసులున్నట్లు చూపించారు. కరోనా ప్రాణాంతకమని తెలిసీ అడ్డగోలుతనంతో ఎందుకు వ్యవహరిస్తున్నారో అర్థం కావడం లేదని వైద్య వర్గాలు అంటున్నాయి. కేంద్రం ప్రతి రోజూ రెండుసార్లు బులెటిన్లు విడుదల చేస్తోంది.

### మరణాలపై దాపరికమెందుకు?

ప్రభుత్వం చివరకు మరణాలను కూడా దాచిపెడుతోంది. నెల్లూరులో కరోనా వచ్చిన వ్యక్తి మృతి చెందారు. ఈ విషయాన్ని అధికారులు అనధికారికంగా చెప్పారు తప్ప.. ఇప్పటివరకు అధికారికంగా ధ్రువీకరించలేదు. పాజిటివ్ కేసులు, మరణాలను దాచాల్సిన అవసరం ఏమిటన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. పాజిటివ్ కేసులు, మరణాలను వెంటనే ధ్రువీకరిస్తే ప్రజలు కూడా మరింత అప్రమత్తమవుతారు. బాధ్యత కూడా పెరుగుతుంది. కరోనా లక్షణాలను గుర్తించినవారు, వారితో కాంటాక్టు అయిన వారు వెంటనే ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకునే అవకాశం ఉంటుంది. విజయవాడలో కరోనాతో మృతి చెందిన వ్యక్తి వివరాలను వెల్లడించకపోవడం వల్ల భారీ మూల్యం చెల్లించుకోవలసి వచ్చింది. విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో మరణించిన వ్యక్తి మృతదేహాన్ని అధికారులు ఎలాంటి జాగ్రత్తలు లేకుండా అతి సాధారణంగా బంధువులకు అప్పగించేశారు. కరోనాతో చనిపోయిన వ్యక్తి మృతదేహానికి దహన కార్యక్రమాలు జరిపేటప్పుడు కొన్ని నిబంధనలు పాటించాలి. కానీ ఆరోగ్యశాఖ అధికారులు కనీసం కరోనా వచ్చిందని కూడా చెప్పకుండా మృతదేహాన్ని బంధువులకు అప్పగించేశారు. బంధువులకు కూడా విషయం తెలియక, అంత్యక్రియలకు వందల మంది పాల్గొన్నారు. అతను చనిపోయిన నాలుగు రోజుల తర్వాత అతడిది కరోనా మరణంగా ధ్రువీకరించారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఇప్పటి వరకూ అతని ద్వారా సుమారు 8 మందికి కరోనా సోకినట్లు తెలుస్తోంది. ఇది జరిగిన తర్వాతైనా బంధుమిత్రులకు పరీక్షలు నిర్వహించారో లేదో కూడా తెలియదు. ఈ నేపథ్యంలో పాజిటివ్ కేసుల సంఖ్య ఎంత పెరుగుతుందో చూడాలి. రాష్ట్రంలో ఇలాంటి సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఒకవైపు రాష్ట్రంలో ప్రతి వ్యక్తికీ మాస్కులు పంచాలని సీఎం ఆదేశించినా.. కరోనా తీవ్రంగా ఉందంటూ రాష్ట్ర ప్రజలను అప్రమత్తం చేయడం ప్రభుత్వం విఫలమవుతోంది.

**ఎందుకీ సర్వేలు?**

ఇప్పటికి రాష్ట్రంలో మూడు విడతల్లో ప్రభుత్వం సర్వే చేసినట్లు చెప్పింది. మూడో విడత సర్వే ఇంకా నడుస్తోంది. కరోనా తీవ్రత లేకపోతే మూడు సార్లు సర్వేలు ఎందుకు చేశారు? మొదటి సర్వే నుంచి ఇప్పటి వరకూ వేల మంది అనుమానితులను అధికారులు గుర్తించారు. మూడో సారి చేసిన సర్వేలోనే సుమారు 33 వేల మందిని ఆశావర్కర్లు, ఆరోగ్య సిబ్బంది గుర్తించారు. సీఎం జగన్ వీరందరికి కరోనా పరీక్షలు చేయాలని ఆదేశించారు. నిజంగా కరోనా తీవ్రంగా లేకపోతే వీరికి పరీక్షలెందుకు?

# రెడ్‌జోన్లపై వార్

(మొదటి పేజీ తరువాయి)

పంపుతానని, రెడ్ జోన్లలో పూర్తి స్థాయిలో ఆంక్షలు అమలుచేయాలని డీజీపీ ఆదేశించారు. ఆరెంజ్‌జోన్లలో సైతం లాక్‌డౌన్ కట్టుదిట్టం చేయాలని సూచించారు. కరోనా ప్రభావం తక్కువగా ఉన్న గ్రీన్‌జోన్ నుంచి బలగాలను రెడ్, ఆరెంజ్ జోన్లకు సర్దుబాటు చేసే బాధ్యతను డీఐజీలు, శాంతి భద్రతల విభాగం అధికారులకు అప్పగించారు. వైరస్ కేసులు పెరుగుతున్న ప్రాంతాలకు అదనపు బలగాలను తరలించాలని.. స్వయంగా పర్యవేక్షించాలని వారిని ఆదేశించారు.

### గుంపులుగా నేతలు..

కొన్నిచోట్ల రాజకీయ పార్టీల నేతలు కార్యకర్తలతో గుంపులుగా రావడంపైనా సమావేశంలో చర్చకు వచ్చింది. రెడ్‌జోన్ ప్రాంతాల్లో ఎవరినీ ఉపేక్షించవద్దని డీజీపీ సూచించారు. సరిహద్దుల్లో కొందరిని వదిలేయడం, రాజకీయ నాయకుల పట్ల చూసీచూడనట్లు వ్యవహరించడం, సామాన్యులపై కేకలు వేయడం కాకుండా.. నిబంధనలు ప్రతి ఒక్కరికీ సమానంగా వర్తింపజేసేలా సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలివ్వాలని ఎస్పీలకు చెప్పారు. విజయవాడలాంటి నగరాల్లో రాత్రిళ్లు పోలీసులు సరిగా పనిచేయడం లేదని, స్వయంగా ఈ విషయాన్ని పరిశీలించానని ఆయన అన్నట్లు తెలిసింది. కొందరు అధికారులకు మెమో జారీ చేసిన ఆయన.. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.

### తబ్లీగీ గుట్టుపట్టింది మనోళ్లే..!

కరోనా సోకిన వారికి వైద్యం చేయడంలో డాక్టర్లు ముందున్నా.. వారికి వైరస్ ఎలా సోకిందో గుర్తించడంలో మాత్రం పోలీసులదే కీలక పాత్ర. గుంటూరులో ఒక వ్యక్తికి వైరస్ సోకినట్లు మొదట గుర్తించిన పోలీసులు.. అతడి సెల్‌ఫోన్ తీసుకుని కాల్ డేటా పరిశీలించారు. టెక్నాలజీ సహాయంతో ఢిల్లీలోని నిజాముద్దీన్ ప్రాంతంలో అతడికి వైరస్ సోకినట్లు గమనించారు. తబ్లీగీ జమాత్‌పై కేంద్ర పోలీసులకు సైతం మొదట సమాచారం ఇచ్చింది రాష్ట్ర పోలీసులే. అది కూడా గుంటూరు అర్బన్ పోలీసులు ఉపయోగించిన టెక్నాలజీతోనే. వైరస్ సోకిన వ్యక్తికి బంధువైన అధికార పార్టీ ఎమ్మెల్యేని సైతం క్వారంటైన్‌కు పంపారు. అలాంటిది గుంటూరు జిల్లాలో ఇప్పుడు పరిస్థితి తీవ్రంగా ఉంది. ఈ విషయమై డీజీపీ ఆరాతీయగా.. పాజిటివ్ వచ్చిన వారితో ఎవరెవరు ఎక్కువ సమయం గడిపారన్నది గుర్తించి.. వారిని కూడా క్వారంటైన్‌కు తరలించాల్సి ఉందని జిల్లా పోలీసు ఉన్నతాధికారులు చెప్పారు. అయితే సిబ్బంది తక్కువగా ఉన్నందున ఆశించిన పనితీరు చూపించలేకపోతున్నామని తెలపడంతో అదనపు బలగాలు పంపేందుకు సవాంగ్ సమ్మతించారు. కర్నూలు, నెల్లూరు, ప్రకాశంలో కూడా ఇదే పరిస్థితి ఉండడంతో ఆయా ప్రాంతాలకు అదనపు బలగాలను పంపారు. రెడ్, ఆరెంజ్ జోన్లపై నిఘా పెంచి వైరస్ మరింత వ్యాపించకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



### లారీలను ఇబ్బంది పెట్టొద్దు..

లాక్‌డౌన్ తర్వాత పాలు, కూరగాయలు, ఇతర నిత్యావసరాల వాహనాలను మాత్రమే అనుమతిస్తున్న పోలీసులు.. లారీలు, గూడ్స్ వాహనాల విషయంలో ఇకపై కాస్త మెతకగా వ్యవహరించాలని నిర్ణయించారు. పాస్ ఉంటేనే అనుమతిస్తామంటూ సరుకు వాహనాలను అడ్డుకోవద్దని డీజీపీ సూచించారు. లాక్‌డౌన్‌ను పొడిగించే అవకాశం ఉంటే నిత్యావసరాలతో పాటు ఇతరత్రా అవసరాలకు కూడా కొరత ఏర్పడే అవకాశం ఉందన్నారు. రాయలసీమ జిల్లాల నుంచి మామిడి, బత్తాయి, ద్రాక్ష దిగుబడులను బెంగళూరు, హైదరాబాద్ ప్రాంతాలకు తరలిస్తున్నారు. అటువంటి వాటిని అడ్డుకుంటే రైతులకు అన్యాయం జరుగుతుందని, డ్రైవర్, క్లీనర్ తప్ప మూడో వ్యక్తిని అనుమతించవద్దని సవాంగ్ స్పష్టం చేశారు. ప్రయాణికులను తరలిస్తే వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేయాలని ఆదేశించారు. ఆదివారం సాయంత్రం నుంచే రాష్ట్రంలోని రోడ్లపైకి వచ్చే లారీలు, ఇతర గూడ్స్ వాహనాల రద్దీ గత మూడు వారాలతో పోల్చితే పెరిగింది.

### ప్రజలు సహకరించాలి: సవాంగ్

పోలీసులకు ఎవరినీ ఇబ్బంది పెట్టే ఉద్దేశం లేదని, ప్రజల ప్రాణాల కోసం ప్రభుత్వ ఆదేశానుసారం పని చేస్తున్నామని డీజీపీ అన్నారు. ప్రజలు అర్థం చేసుకుని తీవ్రత తగ్గేవరకూ ఇళ్లలోనే ఉంటూ పోలీసులకు సహకరించాలని కోరారు. అనవసరంగా బయటకు వస్తే కేసులు నమోదు చేయడంతోపాటు వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

## గవర్నర్ కూడా ఒత్తిళ్లకు గురయ్యారా?

▸▸ అంత వేగంగా సంతకాలు ఎందుకు పెట్టారు?

▸▸ అనుమానాలను నివృత్తి చేయాలి

▸▸ క్వారంటైన్ నిబంధనలు వైసీపీ నేతలకు వర్తించవా?: సోమిరెడ్డి

అమరావతి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ కూడా ఒత్తిళ్లకు గురవుతున్నారా అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి సందేహం వ్యక్తం చేశారు. 'ఎస్ఈసీ తొలగింపు, కొత్త కమిషనర్ నియామకాలకు సంబంధించిన ఫైళ్లను ఆయన గంటకూడా ఆపకుండా వెంటనే సంతకాలు పెట్టి పంపారు. న్యాయ నిపుణుల సలహాలు కూడా తీసుకొన్నట్లు లేదు. గవర్నర్ స్వయంగా న్యాయ కోవిదులై ఉండీ ఇలా వ్యవహరించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఆయనకూడా బెదిరింపులకు గురవుతున్నారా? అందుకే త్వరగా సంతకాలు పెట్టి పంపుతున్నారా?.. గవర్నర్ ఈ అనుమానాలను నివృత్తి చేయాలి' అని సోమిరెడ్డి కోరారు. ఏపీలో తన ప్రాణాలకు ప్రమాదం ఉందని, ఆ స్థాయిలో బెదిరింపులు వస్తున్నాయని ఎస్ఈసీ రమేశ్‌కుమార్ స్వయంగా కేంద్రానికి ఫిర్యాదు చేశారని, అందుకే గవర్నర్ కూడా బెదిరింపులకు గురవుతున్నారా అన్న అనుమానం కలుగుతోందన్నారు. రమేశ్‌కుమార్ తొలగింపు కోర్టులో నిలబడుతుందని తాను అనుకోవడం లేదని, అదే జరిగితే సీఎం జగన్ నైతిక బాధ్యత వహిస్తారా అని ప్రశ్నించారు. అసలు.. రమేశ్‌కుమార్ ఏం తప్పు చేశారని ఆయనపై సీఎం కక్ష బూనారు? కరోనా వ్యాపించే ప్రమాదం ఉందని గుర్తించి ఎన్నికలు వాయిదా వేశారు. ఆ తర్వాత ఏం జరిగింది? దేశమంతా లాక్‌డౌన్ పెట్టారు. ఆయన చేసింది తప్పా? దానికి ఇంత క్రూరంగా తొలగించాలా' అని సోమిరెడ్డి ప్రశ్నించారు. 'టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు అమరావతి వస్తే ఆయనను 14రోజులు క్వారంటైన్‌లో పెడతామని మంత్రులు ప్రకటనలు ఇస్తున్నారు. 84ఏళ్ల వ్యక్తిని తమిళనాడు నుంచి తీసుకువచ్చి ఎస్ఈసీగా ప్రమాణ స్వీకారం చేయించారు. రోజూ అనేకమంది ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి జగన్‌ను కలిసి విరాళాలు ఇస్తున్నారు. మంత్రులు రాష్ట్రాల మధ్య తిరుగుతున్నారు. వైసీపీ నేతలను బలవంతపు వసూళ్లు చేసి కరోనా పంపిణీ పేరుతో నియోజకవర్గాల్లో పంపిణీ చేస్తున్నారు. ఆ పేరుతో వందల మందిని వెంటేసుకొని తిరుగుతూ నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. వీరందరికీ క్వారంటైన్ నిబంధనలు ఎందుకు వర్తించవు.. వారు పాటించకుండా ఇతరులకు నీతులు చెబుతున్నారు' అని సోమిరెడ్డి విమర్శించారు.

## ప్రతి మనిషికీ 3 మాస్కులు

(మొదటి పేజీ తరువాయి)

ఏఎన్ఎంలు రెఫర్ చేశారని.. ఇందులో 9,107 మందికి పరీక్షలు అవసరమని డాక్టర్లు భావించారని అధికారులు తెలిపారు. అయితే 32,349 మందికీ వైద్య పరీక్షలు నిర్వహించాలని సీఎం నిర్దేశించారు. కోవిడ్ కేసులు అధికంగా ఉన్న జోన్లలో 45,000 పరీక్షలకు వైద్యశాఖ సిద్ధమవుతోందని జవహర్‌రెడ్డి చెప్పారు. వైరస్ వ్యాప్తి, ఉధృతి అంచనాకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామని సీఎంకు తెలిపారు. హైరిస్క్ ఉన్నవారిపట్ల అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించారు. వృద్ధులు, మధుమేహం, రక్తపోటు ఇతరత్రా వ్యాధులతో బాధపడేవాళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వీరిలో ఎవరికైనా కరోనా లక్షణాలు కనిపిస్తే తక్షణమే అత్యుత్తమ ఆస్పత్రుల్లో చేర్పించి వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కరోనా కేసులు, వ్యాప్తి చెందడానికి ఉన్న అవకాశాలనూ దృష్టిలో ఉంచుకుని జోన్లు, క్లస్టర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. రైతుబజార్లలో, మార్కెట్లలో భౌతిక దూరం పాటించేలా సర్కిళ్ల మార్కింగ్ తప్పనిసరని స్పష్టం చేశారు. జనం గుమిగూడకుండా చూడాలన్నారు. కాగా, రాష్ట్రంలో ఆదివారం ఉదయం 9 గంటల వరకూ 417 కేసులు నమోదయ్యాయని అధికారులు తెలిపారు. విదేశాల నుంచి వచ్చినవారిలో 13 కేసులుంటే.. వారితో కాంటాక్టు అయిన 12మందికి పాజిటివ్‌గా తేలిందని చెప్పారు. ఢిల్లీ వెళ్లినవారిలో 199మందికి పాజిటివ్ వస్తే.. వారిద్వారా 161మందికి వైరస్ సోకిందన్నారు. మిగిలిన కేసులు.. ఇతర రాష్ట్రాలకు వెళ్లడం వల్ల వచ్చాయని తెలియజేశారు. ఇతరత్రా మార్గాల ద్వారా సోకినవారు 32 మంది ఉన్నారని వివరించారు.

# గుంటూరు గిలగిల

(మొదటి పేజీ తరువాయి)

గిలగిల్లాడుతోంది. తాజాగా 16మందికి పాజిటివ్ నిర్ధారణ కావడంతో జిల్లాలో కేసుల సంఖ్య 91కి పెరిగిపోయింది. దీంతో అత్యధిక కరోనా కేసుల జాబితాలో నిన్నటి వరకూ మొదటి స్థానంలో ఉన్న కర్నూలును వెనక్కునెట్టిన గుంటూరు టాప్‌కి చేరింది. తాజాగా నిర్ధారణ అయిన కేసుల్లో అధికారులు ఏడింటిని ధ్రువీకరించారు. ఇందులో గుంటూరు నగరానికి చెందిన ఐదుగురు ఉన్నారు. ఇప్పటికే కరోనా బారిన పడిన డాక్యుమెంట్ రైటర్ పక్కింటి వ్యక్తికి(వలంటీర్) కూడా వైరస్ సోకింది. పొన్నూరులో ఓ ఆర్ఎంపీకి పాజిటివ్ వచ్చింది. రెండురోజుల క్రితం కరోనా నిర్ధారణ అయిన మాజీ సైనికుడికి చికిత్స చేయడంతో ఆయనకూ వ్యాధి సంక్రమించింది. వాస్తవానికి ఢిల్లీ సమావేశాల నుంచి వచ్చిన వారితో కానీ, విదేశీ వ్యక్తులతో గానీ ఆ సైనికుడికి నేరుగా సంబంధాలు లేకపోవడం గమనార్హం. వీరుకాకుండా జిల్లాలో మరో 9మందికి పాజిటివ్ రాగా వీరిలో గుంటూరులో ఒకే కుటుంబానికి చెందిన ఏడుగురు, నరసరావుపేటలో ఇద్దరు ఉన్నట్లు సమాచారం. ఈ తొమ్మిది కేసుల వివరాలను అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. నెల్లూరు జిల్లాలో మరో 4 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. ఇందులో నెల్లూరు నగరంలో 3, వాకాడు మండలంలో ఒకటి ఉన్నాయి. దీంతో జిల్లాలో మొత్తం కేసుల సంఖ్య 52కు పెరిగింది. టీపీ గూడూరు మండలంలోనూ మరో పాజిటివ్ కేసు నమోదైందని ప్రచారం జరుగుతున్నా అధికారికంగా ప్రకటించలేదు. చిత్తూరు జిల్లాలో మరో పాజిటివ్ కేసు నమోదైంది. రేణిగుంట మండలానికి చెందిన యువకుడు(28) ఢిల్లీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. గత నెల 24న ఢిల్లీ నుంచి విమానంలో చెన్నై చేరుకుని అక్కడనుంచి వేర్వేరు వాహనాల్లో స్వగ్రామం వచ్చారు. గ్రామస్థులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో వడమాలపేట మండలంలో ఉన్న అమ్మమ్మ ఇంటికి వెళ్లిపోయారు. ఆయన వచ్చిన విమానంలో ప్రయాణించిన కొందరు వైరస్ బారిన పడినట్టు సమాచారం అందడంతో సహ ప్రయాణికులందరికీ పరీక్షలు నిర్వహించాలని కేంద్రం నుంచి ఆదేశాలందాయి. దీంతో అధికారులు అతడిని ఈ నెల 9న తిరుపతిలోని పద్మావతి నిలయం క్వారంటైన్‌కు తరలించారు. నమూనాలు ల్యాబ్‌కు పంపగా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. కర్నూలు జిల్లాలో మరో ఇద్దరికి పాజిటివ్ వచ్చింది. దీంతో జిల్లాలో బాధితుల సంఖ్య 84కు చేరింది. కడప జిల్లా బద్వేలు పట్టణానికి చెందిన వృద్ధుడి(65)కి కరోనా సోకింది. ఢిల్లీ వెళ్లి వచ్చి పాజిటివ్‌గా నిర్ధారణ అయిన వ్యక్తితో సన్నిహితంగా ఉన్న ఈయనకు కూడా వ్యాధి సంక్రమించింది.

**జిల్లాల వారీగా కేసుల వివరాలు...**

| జిల్లా | పాజిటివ్ | డిశ్చార్జి |
|---|---|---|
| గుంటూరు | 91 | 1 |
| కర్నూలు | 84 | - |
| నెల్లూరు | 52 | 1 |
| ప్రకాశం | 41 | 1 |
| కృష్ణా | 35 | 6 |
| కడప | 31 | - |
| పశ్చిమగోదావరి | 22 | - |
| చిత్తూరు | 21 | 1 |
| విశాఖపట్నం | 20 | 4 |
| తూర్పుగోదావరి | 17 | 1 |
| అనంతపురం | 15 | - |
| మొత్తం | 429 | 15 |

### విజయవాడలో ముగ్గురు డిశ్చార్జి

విజయవాడ కొవిడ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురు పూర్తిగా కోలుకోవడంతో వైద్యాధికారులు ఆదివారం సాయంత్రం వారిని డిశ్చార్జి చేశారు. వీరిలో మక్కా వెళ్లొచ్చిన విజయవాడకు చెందిన వృద్ధుడు ఒకరు, గుంటూరుకు చెందిన దంపతులు ఉన్నారు.

### పెరుగుతున్న కరోనా మృతులు

గుంటూరు జిల్లా దాచేపల్లికి చెందిన వ్యక్తి కరోనాతో మృతిచెందినట్లు అధికారులు నిర్ధారించారు. గుంటూరుకు చెందిన వృద్ధుడు(72) కరోనాకు చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. ఢిల్లీ వెళ్లి రావడం ద్వారా ఇతనికి వైరస్ సోకింది. కాగా, కొవిడ్-19 బారినపడి చికిత్స పొందుతున్న విజయవాడకు చెందిన వ్యక్తి(55) ఆదివారం సాయంత్రం మృతి చెందారు. ఈయన మరణాన్ని ఇంకా అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. విజయవాడ కోవిడ్ ఆస్పత్రిలోనే ఐసీయూలో చికిత్స పొందుతున్న మరో కరోనా అనుమానితుడు కూడా ఆదివారం మృతి చెందారు. ఆయనకు సంబంధించిన వైద్య పరీక్షల రిపోర్టులు ఇంకా రావాల్సి ఉందని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఇదిలాఉండగా, కరోనా సోకి చెన్నైలో చికిత్స పొందుతున్న నెల్లూరు డాక్టర్ పరిస్థితి విషమించినట్లు సమాచారం. ప్రస్తుతం ఆయనకు వెంటిలేటర్‌పై చికిత్స అందిస్తున్నట్లు వైద్య వర్గాల ద్వారా తెలిసింది.

### ఇక్కడ నెగెటివ్.. అక్కడ పాజిటివ్

ప్రకాశంలో పది రోజుల క్రితం ఓ వ్యక్తి స్వాబ్‌ను పరీక్షలకు పంపించగా ఫలితం నెగెటివ్ వచ్చింది. నెల్లూరుకు చెందిన అతను టీవీ మెకానిక్‌గా పనిచేస్తూ ఒంగోలులో నివాసం ఉంటున్నాడు. ఇతను నాలుగు రోజుల క్రితం నెల్లూరు వెళ్లాడు. అక్కడ జ్వరం రావడంతో క్వారంటైన్‌కు తరలించి నమూనాలు పరీక్షలకు పంపించారు. ఇప్పుడు అతనికి పాజిటివ్ అని తేలింది. అతనికి ప్రకాశం జిల్లాలో వైరస్ అంటుకుందా, నెల్లూరు వెళ్తుండగా మార్గమధ్యంలో సోకిందా అనే దిశగా వివరాలు సేకరిస్తున్నారు.

**ఆ నలుగురే!**



చావు.. పుట్టుకలు మనుషులను కలుపుతాయంటారు.. అయితే వాటినీ అడ్డుకుంది కరోనా మహమ్మారి!!. అనుబంధాలను చెరిపేసింది.. విశాఖ నగరం సీతంపేటలో మధురానగర్‌కు చెందిన పి.అప్పలకొండ(73) అనే వృద్ధురాలు ఆదివారం చనిపోయింది. ఆమెది సాధారణ మరణమే. లాక్‌డౌన్ ఆంక్షలతో చుట్టుపక్కల వారే కాదు బంధువులు కూడా ముఖం చూపించ లేదు. నలుగురు స్థానికులు పాడె మోసేందుకు ముందుకు వచ్చారు. మృతురాలి కుమార్తె కృష్ణవేణే కన్నతల్లికి తలకొరివి పెట్టి ఆఖరి రుణం తీర్చుకుంది.

- సీతంపేట(విశాఖపట్నం)

# కరోనా కల్లోలం

# ఒక్కో దేశం.. ఒక్కో కారణం

## కరోనా వ్యాప్తికి మర్కజ్ లాంటి ఘటనలెన్నో

కరోనా వైరస్ పట్ల అవగాహన లేకపోవటం ఒక వైపు.. 'ఈ వైరస్ మననేం చేస్తుందిలే..' అనే తెంపరితనం మరోవైపు.. ఇలా రకరకాల కారణాల వల్ల అనేక దేశాల్లో కరోనా కరాళ నృత్యం చేస్తోంది. మన దేశంలో మర్కజ్ వల్ల కేసుల సంఖ్య భారీగా పెరిగినట్టు.. వివిధ దేశాల్లో కరోనా వ్యాపించటానికి ప్రధాన కారణాలేమిటో చూద్దాం.. - స్పెషల్ డెస్క్

### దక్షిణ కొరియా

దక్షిణ కొరియాలో కరోనా కేసుల సంఖ్య ఇబ్బడిముబ్బడిగా పెరగడానికి కారణం పేషెంట్ 31. డేగు అనే పట్టణానికి చెందిన ఈ మహిళ కరోనా బారిన పడింది. ఆ సంగతి తెలియక.. ఓ చర్చిలో సమావేశాలకు హాజరైంది. ఆమె ద్వారా అక్కడున్నవారికి వైరస్ సోకి.. ఆ దేశంలో కేసుల సంఖ్య వేలల్లోకి చేరింది.

### ఇరాన్

ఇరాన్‌లో తొలి కరోనా కేసు నమోదు కావటానికి నాలుగు రోజుల ముందు (అంటే ఫిబ్రవరి 11న) షియా మత పెద్దలందరినీ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ కలిశారు. సాధారణంగా ఇలాంటి సమావేశాలలో ఖమేనీ చేతిని మత పెద్దలు గౌరవంతో ముద్దాడటం ఒక సంప్రదాయం. అయితే భద్రతాధికారులు మత పెద్దలను ఖమేయి వద్దకు వెళ్లనివ్వలేదు. కానీ ఆ తర్వాత వారం రోజులకే కరోనా కేసుల సంఖ్య పెరుగుతూ వచ్చింది. దీనితో ప్రభుత్వం అనేక ప్రాంతాలలో కట్టుదిట్టమైన ఆంక్షలు విధించింది. అయితే వీటిని మత పెద్దలు విమర్శిస్తూ వచ్చారు. దేశవ్యాప్తంగా ప్రభుత్వం విధించిన ఆంక్షలను ప్రజలు బేఖాతరు చేస్తూ రావటంతో ఇరాన్‌లో కరోనా బాధితుల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది.

### స్పెయిన్

కరోనా మరణాలు ఎక్కువగా ఉన్న దేశాల్లో ఒకటైన స్పెయిన్‌లో ఫిబ్రవరి మొదటివారం దాకా పెద్దగా కేసులేమి లేవు. మూడో వారంలో ఇటలీ నగరం మిలన్‌లో జరిగిన ఒక ఫుట్‌బాల్ మ్యాచ్‌కు బెర్మాగో అనే పట్టణానికి చెందిన 2,500 మంది అభిమానులు హాజరయ్యారు. వారే స్పెయిన్‌లో కరోనా వ్యాప్తికి కారణమయ్యారు. వీరు తిరిగి వచ్చిన తర్వాత స్పెయిన్‌లో కరోనా విపరీతంగా వ్యాపించడం మొదలు పెట్టింది. మార్చి 7, 8 తేదీల్లో మ్యాడ్రిడ్‌లో జరిగిన వోక్స్ పార్టీ సమావేశంలో కొన్ని వేల మంది పాల్గొన్నారు. వీరిలో ఎంత మందికి కరోనా ఉందో కూడా తెలియని పరిస్థితి ఏర్పడింది.

### ఫ్రాన్స్

వైరస్ తమను ఏమి చేయదనే భావన వల్లే ఆ దేశం తీవ్రంగా నష్టపోయిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఒక స్కీయింగ్ రిసార్టుకు వెళ్లిన ఆంగ్లేయుడి ద్వారా అక్కడ దాదాపు 40 మందికి కరోనా వైరస్ వ్యాపించింది. వారి నుంచి కొన్ని వందల మందికి సోకింది.

### ఇటలీ

చైనా తర్వాత కరోనా వ్యాప్తి అధికంగా కనిపించింది ఇటలీలోనే. ఆ దేశంలో జనవరి 29న తొలి కేసు నమోదయింది. వెనువెంటనే ఆ దేశంలో ఆరు నెలల ఎమర్జెన్సీ ప్రకటించారు. అయితే కరోనా వ్యాప్తిని ఆ దేశ పౌరులు చాలా తేలికగా తీసుకున్నారు. దీంతో మార్చి మొదటి వారానికి కేసుల సంఖ్య విపరీతంగా పెరిగిపోయింది. మార్చి చివరికి పరిస్థితి పూర్తిగా అదుపు తప్పింది.

### అమెరికా

అమెరికాకు కరోనా వైరస్ ఐరోపా నుంచే వచ్చిందని జన్యుపరీక్షల ఆధారంగా శాస్త్రవేత్తలు తేల్చారు. కరోనా నేపథ్యంలో విదేశీయులను అనుమతించడం.. లాక్‌డౌన్ ప్రకటించకపోవటం వల్ల కూడా తీవ్ర నష్టం జరిగిందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## కర్ఫ్యూ పాస్ చూపమన్నందుకు.. ఏఎస్సై చేయి నరికేశాడు

▸ పటియాలాలో నిహంగ్ సిక్కుల దాడి



దాడిలో గాయపడిన ఏఎస్సై హర్జీత్ సింగ్

చండీగఢ్, ఏప్రిల్ 12: లాక్‌డౌన్ వేళ.. కారులో గుంపుగా వచ్చిన వ్యక్తులను కర్ఫ్యూ పాస్ చూపించమన్నందుకు ఏడుగురు నిహంగ్ సిక్కులు తల్వార్లతో పోలీసులపై దాడిచేశారు. ఓ ఏఎస్సై చేతిని నరికివేశారు. ఈ ఘటన పంజాబ్‌లోని పటియాలా జిల్లా సనౌర్ వద్ద చోటుచేసుకుంది. డీజీపీ దినకర్ గుప్తా కథనం ప్రకారం.. సోమవారం ఉదయం 6.15 సమయంలో సనౌర్‌లోని కూరగాయల మార్కెట్ వద్ద పోలీసులు.. తనిఖీలు చేపట్టి, కర్ఫ్యూ పాసులు ఉన్నవారినే లోనికి అనుమతిస్తున్నారు. ఈ క్రమంలో ఓ కారు బారికేడ్లను ఢీకొంటూ ఆ ప్రాంతానికి దూసుకువచ్చింది. వెంటనే పోలీసులు ఆ కారును చుట్టుముట్టారు. కారులో ఉన్న ఏడుగురు నిహంగ్ సిక్కులు తల్వార్లు పట్టుకుని కిందకు దిగారు. వెంటనే పోలీసులపై విరుచుకుపడ్డారు. ఏఎస్సై హర్జీత్ సింగ్ చేతిని ఓ దుండగుడు నరికివేశాడు. సదర్ పటియాలా ఎస్‌హెచ్‌వో, మరో కానిస్టేబుల్‌ను గాయపరిచారు. ఆ తర్వాత దుండగులంతా బల్బేరాలోని ఓ గురుద్వారాలో దాక్కొన్నారు. చేయి తెగిపడిన ఏఎస్సైని చికిత్స నిమిత్తం చండీగఢ్‌లోని పీజీఐఎంఈఆర్ ఆస్పత్రికి తరలించామని, అక్కడ ప్లాస్టిక్ సర్జరీ నిపుణులు ఏడున్నర గంటల పాటు శస్త్రచికిత్స నిర్వహించి, అతడి చేతిని తిరిగి అతికించారని డీజీపీ వివరించారు. దుండగులు నక్కి ఉన్న గురుద్వారాను జిల్లా పోలీసులు, స్పెషల్ ఆపరేషన్ గ్రూప్ చుట్టుముట్టాయి. దాంతో దుండగులు పోలీసులపైకి కాల్పులు జరిపారని, లోనికి వస్తే.. ఎల్పీజీ సిలిండర్‌ను పేల్చేస్తామని బెదిరించారని చెప్పారు. గురుద్వార మర్యాదను పాటిస్తూనే.. ఏడుగురు దుండగులను అరెస్టు చేశామని డీజీపీ తెలిపారు. వారి నుంచి తల్వార్లు, మూడు పిస్టళ్లు, పెట్రోల్ బాంబులు, గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు.

# ఒక్క రోజులో 918

## దేశంలో 8,447కు చేరిన కేసులు

▸ 273కు పెరిగిన మృతుల సంఖ్య

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఒక్క రోజులోనే 918 కరోనా వైరస్ కేసులు నమోదయ్యాయని కేంద్ర ఆరోగ్య శాఖ సంయుక్త కార్యదర్శి లవ్ అగర్వాల్ వెల్లడించారు. వీటిలో 80 శాతం మందికి రోగ తీవ్రత స్వల్పంగానే ఉందని తెలిపారు. ఆదివారం ఆయన ఇక్కడ విలేకర్లతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా కేసులు 8,447కు చేరాయని తెలిపారు. కరోనాతో 273 మంది మృతిచెందగా, ఇప్పటిదాకా 716 మంది కోలుకున్నారని చెప్పారు.శనివారం సాయంత్రం నుంచి కొత్తగా 31 మరణాలు నమోదయ్యాయని పేర్కొన్నారు. 151 పరీక్షా కేంద్రాల్లో 1.87 లక్షల మందికి కరోనా వైద్య పరీక్షలు నిర్వహించామని వివరించారు. కరోనాను ఎదుర్కోవడంలో దేశం సంసిద్ధత గురించి ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. "దేశంలో ప్రస్తుతం కొవిడ్-19 కేసులు 8,356 ఉన్నాయి. వాటిలో కేవలం ఐదు శాతం మందికే ఆస్పత్రిలో చికిత్స, ఆక్సిజన్ సపోర్ట్ అవసరం. దీనికి 1,671 పడకలు అవసరం కాగా... లక్షకు పైనే పడకలు అందుబాటులో ఉన్నాయ"ని తెలిపారు. దేశవ్యాప్తంగా 601 కొవిడ్ ఆస్పత్రులు ఉన్నాయని, 9 వేల పడకలతో 51 ఆస్పత్రులను సాయుధ దళాలు సిద్ధం చేస్తున్నాయని చెప్పారు. ఆదివారం మహారాష్ట్రలో కొత్తగా 221 కేసులు నమోదయ్యాయి. దీంతో మొత్తం 1,982కు పెరిగాయి. మరో 22 మంది మరణించడంతో మృతుల సంఖ్య 149కి చేరింది. మధ్యప్రదేశ్‌లో 36, గుజరాత్‌లో 22, ఢిల్లీలో 19మంది మృత్యువాతపడ్డారు. కేసుల సంఖ్యలో మహారాష్ట్ర తర్వాత స్థానాల్లో ఢిల్లీ (1,069), తమిళనాడు (969) ఉన్నాయి.



### ఈఎన్‌టీ నిపుణులు కావాలి: కేంద్రం

కరోనా వైరస్ లక్షణాలు ఉన్న వ్యక్తుల నుంచి వైద్య పరీక్షల కోసం నమూనాలు సేకరించడానికి ఈఎన్‌టీ నిపుణులు, రెసిడెంట్ డాక్టర్ల సేవలను వినియోగించుకోవాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించింది. గొంతు, స్వాబ్ నమూనాల సేకరణకు అర్హులైన సిబ్బంది అవసరం చాలా ఉందని తెలిపింది. కరోనా హాట్‌స్పాట్లుగా గుర్తించిన ప్రాంతాల్లో నిత్యావసర వస్తువులను ఇంటింటికి వెళ్లి అందజేసేందుకు రాష్ట్రాలు చర్యలు చేపడుతున్నాయని కేంద్ర హోం శాఖ సంయుక్త కార్యదర్శి పీఎస్ శ్రీవాస్తవ తెలిపారు.

### కర్ణాటకలో మరో 17 మందికి కరోనా

కర్ణాటకలో కరోనా పేషెంట్ల సంఖ్య 232కు చేరింది. ఆదివారం మరో 17 మందికి వైరస్ నిర్ధారణ అయింది. కలబుర్గిలో రెండేళ్ల బాలుడికి కుటుంబ సభ్యుల ద్వారా వైరస్ సోకింది.

## వలస కూలీలు.. కరోనా వాహకులు..!

▸ భారత్‌కు ప్రపంచ బ్యాంకు హెచ్చరిక

వాషింగ్టన్, ఏప్రిల్ 12: వలస కూలీలు కరోనా వైరస్ వాహకులుగా మారే ప్రమాదం ఉందని ప్రపంచ బ్యాంకు హెచ్చరించింది. లాక్‌డౌన్ నేపథ్యంలో భారత్‌లో నగరాలు, పట్టణాల్లో పనుల్లేక వలస కార్మికులు తమ స్వస్థలాలకు పయనమవుతున్నారని.. ఇలాంటి వారి వల్ల గ్రామాలకూ వైరస్ వ్యాపించే ప్రమాదం ఉందని పేర్కొంది. ప్రాథమిక సమాచారం మేరకు వలస కూలీలు ఉన్న వివిధ నగరాలు, పట్టణాల్లో ఇప్పటికే వైరస్ పాజిటివ్ కేసులు ఉన్నాయని తెలిపింది. భారత ఉపఖండంలో లాక్‌డౌన్ వల్ల భారీ సంఖ్యలో ఉన్న వలస కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారంది. వీరిలో అత్యధికులు రోజు కూలీలని, పనిలేకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో సొంత ప్రాంతాలకు తిరిగి వలస వెళ్లిపోతున్నారని తెలిపింది.

## వారణాసి నుంచి తెలుగువారి తరలింపు!

▸ లాక్‌డౌన్‌తో చిక్కుకుపోయిన 1000 మంది స్వస్థలాలకు..

▸ బీజేపీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వారణాసిలో చిక్కుకుపోయిన తెలుగురాష్ట్రాల యాత్రికులు ఎట్టకేలకు స్వస్థలాలకు వెళ్లనున్నారు. లాక్‌డౌన్ కారణంగా గత నెల 22 నుంచి దాదాపు వెయ్యి మంది వారణాసిలోనే ఉండిపోవాల్సి వచ్చింది. వారందరినీ స్వస్థలాలకు తరలించనున్నట్టు బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి, ఎంపీ జీవీఎల్ నరసింహారావు వెల్లడించారు. లాక్‌డౌన్ కారణంగా ఎక్కడివారు అక్కడే ఉండాలన్న నిబంధనలు అమల్లో ఉన్నా.. ప్రత్యేక కేసుగా పరిగణిస్తూ ప్రధాని నరేంద్రమోదీ ఆమోదంతో వారిని ఏపీ, తెలంగాణలకు ప్రత్యేక బస్సుల్లో సురక్షితంగా తరలించేందుకు ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి కార్యాలయం కూడా అనుమతించిందని జీవీఎల్ తెలిపారు. గత నెల 22 నుంచి వారణాసిలో చిక్కుకున్న తెలుగువారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా వసతి, ఆహార సదుపాయాలు కల్పించడంలో జీవీఎల్ సహకరించిన విషయం తెలిసిందే. యూపీ ప్రభుత్వం వారికి వైద్య పరీక్షలు నిర్వహించింది. అనంతరం ప్రత్యేక బస్సుల్లో ఆదివారం సాయంత్రం సాగనంపారు. ఇప్పటివరకు మొత్తం 15 బస్సులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మిగిలిన వారి తరలింపు కోసం అవసరమైన బస్సులను కూడా ఏర్పాటు చేసే చర్యలు తీసుకుంటున్నట్లు జీవీఎల్ ఆదివారం రాత్రి విలేకరులకు తెలిపారు. తెలుగు రాష్ట్రాల యాత్రికులతో పాటు వారణాసిలో చిక్కుకున్న ఇతర రాష్ట్రాలవారిని కూడా వారి స్వస్థలాలకు పంపేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జీవీఎల్ తెలిపారు.

## సినారె వాక్యాలే ప్రేరణ

▸ స్వీయ నిర్బంధానికి మానసికంగా సిద్ధమయ్యా.. యోగా చేస్తున్నా: వెంకయ్య

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): 'నా కాళ్లను కట్టేసుకుని, మనసు వేగాన్ని మరింత పెంచి దినచర్యలో స్వల్ప మార్పులు చేసుకుని స్వీయ నిర్బంధాన్ని ఆస్వాదిస్తున్నాను. మనసును సిద్ధం చేసుకోవడం తప్ప నేను ప్రత్యేకంగా చేసిందేమీ లేదు' అని ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు అన్నారు. లాక్‌డౌన్ సందర్భంగా ఏవిధంగా స్వీయనిర్బంధాన్ని పాటిస్తున్నారని అనేక మంది మిత్రులు అడగడంతో వెంకయ్య స్పందించారు. ఆదివారం సామాజిక మాధ్యమాల ద్వారా తన దినచర్య విధానాన్ని వెల్లడించారు. రోజూ ఉదయం 5-30కి అన్నమాచార్య కీర్తనలను వింటూ దినచర్య ప్రారంభిస్తానని చెప్పారు. రాత్రి వరకూ ప్రభుత్వంలోని కీలక వ్యక్తులు, అధికారులతో తన ఆలోచనలను పంచుకుంటూ.. రోజంతా లాక్‌డౌన్ కాలాన్ని సద్వినియోగం చేసుకుంటూ గడుపుతున్నానని వివరించారు. ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు తెలుగు, హిందీ, ఆంగ్ల భాషల పత్రికలను ఆన్‌లైన్‌లో చదవడం అలవాటు చేసుకున్నానని, వాటిలోని ప్రాముఖ్యం గల అంశాలను, వ్యాసాలను సేవ్‌చేసి పెట్టుకుంటున్నానని తెలిపారు. ఉపరాష్ట్రపతి భవన్ ప్రాంగణంలో పచ్చికబయలుపై నడక, క్రమం తప్పకుండా యోగా చేస్తున్నానని చెప్పారు. ఫోన్లలోనే మాట్లాడుతూ రాజ్యసభకు సంబంధించిన నిర్ణయాలన్నీ తీసుకుంటున్నానన్నారు. కేంద్ర మంత్రులు, అధికారులు, పాత మిత్రులు, పాత్రికేయ మిత్రులు, సంపాదకులు, బంధువులు శ్రేయోభిలాషులతో క్రమం తప్పకుండా మాట్లాడడం ఇటీవలి కాలంలో అలవాటు చేసుకున్నానని తెలిపారు. జ్ఞానపీఠ గ్రహీత డాక్టర్ సి.నారాయణ రెడ్డి (సినారె) తన విశ్వంభర కావ్యంలో చెప్పిన వాక్యాలు ఈ మధ్య ఎక్కువగా గుర్తుకొస్తున్నాయని వెంకయ్య చెప్పారు. రుషిత్వానికీ- పశుత్వానికీ, సంస్కృతికీ- దుష్కృతికీ, స్వచ్ఛందతకూ- నిర్బంధతకూ తొలి బీజం మనసు అని సినారే అన్నారని, సినారె వాక్యాలే ప్రేరణ అని ఆయన పేర్కొన్నారు.

### భక్తి పాటలు వింటూ స్వాంతన!



సాయంత్రం పూట ఘంటసాల, సుశీల, జానకి, బాలు లాంటి వారు పాడిన పాటలు వింటూ, పాత చిత్రాలు చూస్తూ ఆనందిస్తున్నానని పేర్కొన్నారు. ఉపరాష్ట్రపతి భవన్ ఆవరణలో ఉన్న ఆంజనేయ స్వామి మందిరానికి వెళతానని, అక్కడ తన సతీమణితో కలిసి భక్తి పాటలు వింటుంటే మనసు సాంత్వన కలిగిస్తోందని చెప్పారు. 1970లో తన వివాహమైనప్పటి నుంచీ తాను పట్టుమని 10 రోజులు ఇంటిపట్టున లేనని, ఇప్పుడు లాక్‌డౌన్ మూలంగా తాను, తన శ్రీమతి ఉషమ్మ.. జీవితంలో ఎన్నడూ లేనంతగా ఎక్కువ సమయం కలిసి ఉంటున్నామని, ఇది ఎంతో సంతోషం కలిగిస్తోందని వెంకయ్య చెప్పారు.

## ఆకలి తీర్చలేక.. ఐదుగురు పిల్లల్ని గంగలో తోసేసిన తల్లి

జహంగీరాబాద్ (యూపీ), ఏప్రిల్ 12: లాక్‌డౌన్ కారణంగా సంపాదన కోల్పోయిన ఓ తల్లి.. బిడ్డల ఆకలి తీర్చే దారి లేక తన ఐదుగురు పిల్లల్నీ గంగపాల్జేసింది. ఉత్తరప్రదేశ్‌లోని జహంగీరాబాద్‌లో రోజువారీ కూలీగా పనిచేసే ఓ మహిళ.. లాక్‌డౌన్ వల్ల ఉపాధి కోల్పోయింది. తన ఐదుగురు పిల్లలు ఆకలితో అలమటిస్తుంటే వాళ్లకు తిండిపెట్టే దారిలేక గంగా నదిలో తోసేసింది. పోలీసులు పిల్లల కోసం నదిలో గాలింపు చర్యలు చేపట్టారు.

## మాస్క్ ధరించకుంటే నష్టమే

▸ వైద్యనిపుణుల సూచన

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: 'మాస్క్ మస్ట్' అంటూ ప్రభుత్వాల మార్గదర్శకాలు.. 'కరోనాను మాస్కులు ఆపలేవు' అంటూ నిపుణుల విశ్లేషణలు.. 'కరోనా లక్షణాలు ఉన్నవారు, రోగులకు సపర్యలు చేసేవారికే మాస్క్' అంటూ ప్రపంచ ఆరోగ్య సంస సూచనలు!! ప్రజలకు పై సూచనలు, మార్గదర్శకాలు అయోమయాన్ని మిగిల్చాయి. దీంతో ఈ అంశంపై సర్వత్రా చర్చ జరుగుతోంది. కొందరు వైద్యనిపుణులు మాత్రం.. మాస్క్ ధరించకుంటే కలిగే నష్టమే ఎక్కువ అని చెబుతున్నారు. ప్రధానంగా జన సమ్మర్ధ ప్రదేశాల్లో తిరిగే వారు తప్పనిసరిగా మాస్క్ ధరించాలని చెబుతున్నారు.

## కేసులన్నీ క్వారంటైన్‌లో..

▸ కోర్టులు మూసివేయొద్దు: న్యాయవాది

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: కరోనా మహమ్మారి విజృంభిస్తున్న నేపథ్యంలో న్యాయస్థానాలను సుదీర్ఘకాలం మూసివేయడం మంచిది కాదని, ఇది 'స్వీయ విధ్వంసక ఆలోచన' అని సీనియర్ న్యాయవాది రాకేశ్ ద్వివేది పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్ఏ బోబ్డే, ఇతర న్యాయమూర్తులకు లేఖ రాశారు. 'ప్రజలకు అత్యంత ప్రధానమైన, ప్రాణాధారమైన అనేక కేసులు క్వారంటైన్‌లో ఉన్నాయి. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ అంటే కోర్టును ఐసీయూలో ఆక్సిజన్ మీద ఉంచడమే. కాబట్టి మనం మరింత మెరుగ్గా కార్యకలాపాలను ఎలా నిర్వహించాలన్నదానిపై దృష్టి పెట్టాలి' అని ఆ లేఖలో పేర్కొన్నారు. కోర్టు హాళ్లలో జడ్జిలు, న్యాయవాదులు మాస్కులు ధరించవచ్చని, భౌతిక దూరం పాటిస్తూ కేసుల విచారణ చేపట్టవచ్చని ద్వివేది సూచించారు. విచారణ సమయంలో కక్షిదారులను లోనికి అనుమతించవద్దని, కేసు విచారణ ముగియగానే న్యాయవాదులు ఇంటికి వెళ్లిపోవాలని సూచించారు.

### లాక్‌డౌన్‌లో పిల్లలపై పెరిగిన వేధింపులు

దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ కొనసాగుతున్న క్రమంలో పిల్లలపై వేధింపులు కూడా పెరిగిపోయాయని, ఈ అంశాన్ని సుమోటోగా స్వీకరించాలని సీజేఐకి న్యాయవాదులు సమీర్ సోధి, ఆర్జూ అనేజా లేఖ రాశారు. లాక్‌డౌన్‌లో మొత్తంగా నేరాల శాతం తగ్గినప్పటికీ పిల్లలకు వేధింపులు మాత్రం ఎక్కువయ్యాయన్నారు.

# తెలంగాణలో మరో 28 కేసులు

▸ మరో ఇద్దరు మృతి

హైదరాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): దేశం, రాష్ట్రంలో కరోనా వ్యాప్తి ఆగడం లేదని, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, అధికార యంత్రాంగం మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని సీఎం కేసీఆర్ సూచించారు. తెలంగాణలో ఆదివారం కొత్తగా 28 మందికి కరోనా సోకినట్లు తేలిందని, చికిత్స పొందుతూ ఇద్దరు చనిపోయారని, ఏడుగురు కోలుకుని డిశ్చార్జి అయ్యారని తెలిపారు. రాష్ట్రంలో కరోనా సోకిన వారి సంఖ్య 531కి చేరగా, మరణాల సంఖ్య 16కు పెరిగిందని, మొత్తం 103 మందిని డిశ్చార్జి చేశామని వివరించారు. ఇంకా, 412 మంది ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నట్లు చెప్పారు. కరోనా నివారణకు చేపడుతున్న చర్యలు, లాక్ డౌన్ అమలు తీరు, పేదలకు అందుతున్న సాయం, పంటల కొనుగోళ్లు తదితర అంశాలపై సీఎం కేసీఆర్ ఆదివారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ప్రస్తుత పరిణామాలు గమనిస్తుంటే కరోనా వ్యాప్తి ఆగడం లేదని స్పష్టమవుతోందని కేసీఆర్ అన్నారు. "రాష్ట్రంలో ఆదివారం కూడా గణనీయ సంఖ్యలో పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. పక్కనే ఉన్న మహారాష్ట్రలో పరిస్థితి భయంకరంగా ఉంది. దేశవ్యాప్తంగానూ కేసులు, మరణాలు పెరిగాయి. ఈ పరిస్థితి ఉన్నందునే లాక్‌డౌన్ పొడిగింపు నిర్ణయం తీసుకున్నాం. పరిస్థితి తీవ్రతను ప్రజలు అర్థం చేసుకోవాలి. వీలైనంత వరకు ఇళ్లకే పరిమితం కావాలి. బయటకు వెళ్లాల్సి వస్తే భౌతిక దూరం పాటించాలి. ఏమాత్రం అనుమానం వచ్చినా పరీక్షలు చేయించుకోవాలి. కరోనా సోకిన వ్యక్తులున్న ప్రాంతాలను దిగ్బంధించి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ప్రజలు దీనికి సహకరించాలి. ప్రభుత్వ నిర్ణయాలను ప్రజలు పాటించినప్పుడే కరోనాను నివారించగలం" అని అన్నారు. అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని, ఎవరికి లక్షణాలు కనిపించినా పరీక్షలు నిర్వహించాలని, వారి కాంటాక్టులపైనా దృష్టి సారించాలని సూచించారు. అంతర్రాష్ట్ర సరిహద్దుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. "మర్కజ్ వెళ్లొచ్చిన వారెవరైనా తెలిసో తెలియకో పరీక్షలు చేయించుకోకుంటే.. వెంటనే ముందుకు రావాలి. ఇది వారి కోసం, వారి కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం చెబుతున్న మాట" అని అన్నారు. ఇక, రాష్ట్రంలో తొలుత హైదరాబాద్‌కే పరిమితమైన కరోనా కేసులు.. ఇప్పుడు జిల్లాల్లోనూ అనూహ్యంగా పెరుగుతున్నాయి. రాష్ట్రంలో 28 జిల్లాల్లో కరోనా కేసులు ఉంటే.. 14 జిల్లాల్లో కేసుల సంఖ్య డబుల్ డిజిట్‌కు చేరింది. అందులో ఐదారు జిల్లాల్లో అయితే 20కి పైగా కేసులు నమోదయ్యాయి.

## విధుల్లో చేరేందుకు 450 కి.మీ నడిచిన పోలీసు

లఖ్‌నవు, ఏప్రిల్ 12: భార్య ఆరోగ్యం బాగోలేదని సెలవు మీద సొంతూరు కాన్పూర్‌కు దగ్గర్లోని బౌతికి వెళ్లిన ఆ పోలీస్ కానిస్టేబుల్ లాక్‌డౌన్‌తో ఇరుక్కుపోయాడు. సెలవులు ముగిశాయి. విధుల్లో చేరాలంటే ఉన్నచోటు నుంచి 450 కిలోమీటర్లు ప్రయాణించాలి. వాహనాలేవీ అనుమతించని పరిస్థితుల్లో ఆ కానిస్టేబుల్ అంత దూరం నడుచుకుంటూనే వెళ్లి డ్యూటీలో చేరాడు. యూపీకి చెందిన ఆనంద్ పాండే అనే కానిస్టేబుల్‌దీ నిబద్ధత. సెలవులు ముగిశాక.. మూడు రోజుల పాటు నడిచి తాను పనిచేస్తున్న పోలీస్ స్టేషన్‌కు వెళ్లి విధుల్లో చేరాడు. పాండే నిబద్ధతను పోలీసులు కొనియాడారు.

## అదనపు డబ్బుతో తీవ్ర ద్రవ్యోల్బణం

▸ సీఎం 'క్యూఈ' ప్రతిపాదనపై 'ఆంధ్రజ్యోతి'తో గోవిందరావు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కరోనా వల్ల ఏర్పడ్డ ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి ఆర్థిక వ్యవస్థలోకి అదనపు డబ్బును సరఫరా చేస్తే.. రూపాయి విలువ పడిపోవడం, ద్రవ్యోల్బణం వంటి సమస్యలు తలెత్తుతాయని ప్రముఖ ఆర్థిక వేత్త, 14వ ఆర్థిక సంఘం సభ్యుడు గోవిందరావు హెచ్చరించారు. ప్రధాని మోదీతో జరిగిన సీఎంల సమావేశంలో తెలంగాణ సీఎం కేసీఆర్.. ఈ మేరకు చేసిన ప్రతిపాదన (క్వాంటిటేటివ్ ఈజింగ్) పై గోవిందరావు స్పందించారు. ప్రభుత్వాలు అప్రమత్తంగా లేకుంటే ఈ చర్య వల్ల 1991కి ముందు స్థాయి ఆర్థిక సంక్షోభం తలెత్తే ప్రమాదం లేకపోలేదని హెచ్చరించారు. వ్యవస్థలో అదనపు డబ్బు సరఫరా జరిగేలా చూడడాన్నే క్వాంటిటేటివ్ ఈజింగ్ అంటారని ఆయన వివరించారు. ఈ పద్ధతిలో.. రిజర్వు బ్యాంకు కొత్త కరెన్సీని ప్రింట్ చేయడం ద్వారా ప్రభుత్వానికి రుణ సౌకర్యాన్ని కల్పిస్తుందని ఆయన చెప్పారు. ఇతర దేశాల్లో కూడా ఇలాంటివి జరిగినప్పటికీ మన దేశంలో మాత్రం దీని వల్ల జరిగే పర్యవసానాలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆయన అభిప్రాయపడ్డారు. దేశంలో వినియోగం, పెట్టుబడులు పెంచడానికి, మౌలిక సదుపాయాలపై ఖర్చు పెట్టడానికి.. పన్నుల నుంచి, ఇతర మార్గాల నుంచి వచ్చే ఆదాయం సరిపోకపోతే రిజర్వు బ్యాంకు నుంచి డబ్బు తేవడం ఒక్కటే మార్గాంతరమని ఆయన వివరించారు. రిజర్వు బ్యాంకు డబ్బును సృష్టిస్తే దాని ప్రత్యక్ష ప్రభావం ప్రభుత్వ రుణాలపై పడుతుందని ఆందోళన వెలిబుచ్చారు. కరోనా వైరస్ వ్యాప్తిని అరికట్టిన తర్వాత డబ్బు సరఫరాతో ఆర్థిక వ్యవస్థ వేగంగా కోలుకునేందుకు చర్యలు చేపట్టాలని.. డబ్బు సరఫరాకు తగ్గట్లుగా ఉత్పత్తి పెంచాలని గోవింద రావు సూచించారు. లేనిపక్షంలో ద్రవ్యోల్బణం తీవ్రతరం కావడంతో పాటు ఎగుమతులు దిగుమతుల సమతౌల్యం దెబ్బతింటుందని, రూపాయి విలువ బాగా పడిపోవడం వంటి పరిణామాలు ఎదురుకాక తప్పదని ఆయన చెప్పారు. ప్రస్తుత సంక్షోభం నేపథ్యంలో.. రాష్ట్రాలు కానీ, కేంద్రం కాని ఆర్థిక లోటు వంటి విషయాలపై పెద్దగా దృష్టి కేంద్రీకరించకూడదని ఆయన అభిప్రాయపడ్డారు.

## పొడిగింపుపై త్వరలో ప్రకటన: కిషన్‌రెడ్డి

దేశవ్యాప్తంగా లాక్‌డౌన్ కాలపరిమితి పొడిగింపుపై త్వరలో కేంద్రం నుంచి ప్రకటన వెలువడనున్నట్లు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. దేశంలో కరోనా మహమ్మారి నియంత్రణలోనే ఉన్నదని, ఇతర దేశాలతో పోలిస్తే మన దగ్గర రోగులు, మృతుల సంఖ్య చాలా తక్కువగా ఉందని చెప్పారు. దేశంలో కరోనా కేసుల్లో 70% మర్కజ్‌తో సంబంధమున్నవేనన్నారు.

## తమిళనాట ఒక్కరోజే 106 మందికి కరోనా

▸ వీరిలో 90 మంది ట్రావెల్ హిస్టరీ లేనివారే

చెన్నై, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): తమిళనాడులో ఆదివారం కొత్తగా 106 కరోనా పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. రాష్ట్రంలో మొత్తం పాజిటివ్ కేసుల సంఖ్య 1,075కు చేరింది. వీరిలో 50 మంది డిశ్చార్జ్ కాగా, 11 మంది చనిపోయారు. తాజా కేసుల్లో 16 మందికి ట్రావెల్ హిస్టరీ ఉండగా, అలాంటివారి సాన్నిహిత్యం వల్ల మిగిలిన 90 మందికి కరోనా వ్యాపించిందని ఆరోగ్యశాఖ కార్యదర్శి బీలా రాజేశ్ తెలిపారు.

## ఐసోలేషన్ వార్డులో వైద్యుడి అత్యాచారం

పట్నా, ఏప్రిల్ 12: ప్రైవేటు వైద్య కళాశాల ఆస్పత్రిలోని కరోనా ఐసోలేషన్ వార్డులో చేరిన మహిళపై ఓ వైద్యుడు అత్యాచారం చేయడంతో ఆమె మృతిచెందింది. ఈ దారుణం బిహార్‌లోని గయలో చోటుచేసుకుంది. మృతురాలి స్వస్థలం పంజాబ్‌లోని లుధియానా. గత నెల 25న భర్తతో కలిసి గయ వచ్చింది. లుధియానాలో ఉండగా రెండో నెలలో ఆమెకు గర్భస్రావం అయింది. గయ వచ్చిన రెండు రోజులకు ఆమెకు రక్తస్రావం కావడంతో అనుగ్రహ్ నారాయణ మగధ్ వైద్య కళాశాల ఆస్పత్రిలో చేర్పించాడు భర్త. ఈ నెల 1న ఆమెలో కరోనా వైరస్ లక్షణాలు కనిపిస్తున్నాయంటూ ఐసోలేషన్ వార్డుకు తరలించారు. అక్కడ ఆమెపై ఓ వైద్యుడు వరుసగా రెండు రోజులు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఆమెకు కరోనా వైరస్ సోకలేదని వైద్య పరీక్షల్లో తేలడంతో 4న డిశ్చార్జి చేశారు. 6న ఆమెకు మళ్లీ తీవ్ర రక్తస్రావం కావడంతో ఆస్పత్రికి తీసుకొచ్చారు. చికిత్స పొందుతూ ఆమె మృతిచెందింది. ఆమె మరణించాక వైద్యుడి అమానుషాన్ని బంధువులు బయటపెట్టారు.

## వ్యంగ్య కామెంట్లు.. 'టిక్‌టాక్' హీరోకి కరోనా

భోపాల్, ఏప్రిల్ 12: మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లాకు చెందిన ఓ పాతికేళ్ల యువకుడు.. టిక్‌టాక్‌లో బాగా ఫేమస్. కరోనాపై కొన్నిరోజులుగా వ్యంగ్య వీడియోలు పోస్టు చేస్తున్నాడు. మాస్కులు ధరించిన వారిని గేలిచేసి పారేస్తున్నాడు. కరోనా రాకూడదంటే.. దేవుడిని నమ్ముకోవాలిగానీ చిన్న గుడ్డముక్కను నమ్ముకోవడమేంటి? అంటూ ఆ వీడియోల్లో ప్రశ్నిస్తున్నాడు. తాజాగా అతడు ఆ జిల్లాలో తొలి కోవిడ్-19 పాజిటివ్ కేసుగా నమోదయ్యాడు. ప్రస్తుతం ఐసోలేషన్ వార్డులో చికిత్స పొందుతున్నాడు. ఫేస్ మాస్కే దేవుడు.. ధరించండి అంటూ ఐసొలేషన్ వార్డు నుంచి అతడు చేసిన చివరి పోస్టును చూసి జనం నవ్వుకుంటున్నారు.

## 'అపానం' ద్వారానూ కరోనా వ్యాప్తి: వైద్యులు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 12: ఇప్పుడున్న పరిస్థితుల్లో 'అపానవాయువూ అపాయమే' అంటున్నారు వైద్యులు. కరోనా వ్యాప్తిలో అపానవాయువు కీలక పాత్ర పోషిస్తోందని, నియంత్రించకపోతే.. ప్రపంచం మొత్తం వ్యాపిస్తుందని చెబుతున్నారు. దీనిపై ఈ ఏడాది మొదట్లో పరీక్షలు జరిపిన వైద్యులు.. దాదాపు సగం మంది కరోనా రోగుల మలంలో ఈ వైరస్ ఉందని తేల్చారు. అందువల్ల వారు విడిచే అపానవాయువులో కూడా వైరస్ కొంచెమైనా ఉండే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు.

## నిత్యావసరాలకు 'సురక్షా స్టోర్లు'

దేశ వ్యాప్తంగా కచ్చితమైన భద్రతా ప్రమాణాలు పాటిస్తూ.. ప్రజలకు నిత్యావసరాలు అందించేందుకు 'సురక్షా స్టోర్లు' ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది. సరుకులు, ప్రజా రవాణాపై ఆంక్షలను పొడిగిస్తున్న నేపథ్యంలో ఈ మేరకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. దేశవ్యాప్తంగా రానున్న 45 రోజుల్లో 20 లక్షల సురక్షా స్టోర్లు ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. ఇందులో భాగంగా కిరాణా దుకాణాలనే 'శానిటైజ్డ్ రిటైల్ స్టోర్స్'గా మారుస్తారని, నిత్యావసరాలు విక్రయించే ఈ దుకాణాల్లో నావెల్ కరోనా వైరస్ వ్యాప్తి నివారణకు అవసరమైన అన్ని చర్యలూ తీసుకుంటారని సమాచారం. ఈ ప్రతిష్ఠాత్మక ప్రణాళికను ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్య పద్ధతిలో అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. సురక్షా స్టోర్లలో పచారీ సామగ్రి, గృహోపకరణాలు, దుస్తులు, సెలూన్లు ఉంటాయి.

## వైద్యులు సూచిస్తేనే క్లోరోక్విన్ వాడాలి

వైద్యుల సూచనలు లేకుండా హైడ్రాక్సీ క్లోరోక్విన్ వాడొద్దని ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రణ్‌దీప్ గులేరియా సూచించారు. ఇది గుండెపై ప్రభావం చూపిస్తుందని, గుండె సంబంధిత సమస్యలతో బాధపడేవారు ఈ మందు తీసుకోవడం ప్రమాదకరమని హెచ్చరించారు. ప్రస్తుత స్థితిలో కరోనా చికిత్సకు ప్లాస్మాథెరపీ ఒక్కటే మార్గమని, వ్యాధి నుంచి కోలుకున్న వారిని తమ రక్తం డొనేట్ చేయవలసిందిగా కోరాలని గులేరియా డాక్టర్లకు సూచించారు.

## కొవిడ్-19పై హెచ్చార్డీ పోర్టల్ ఆరంభం

కొవిడ్-19కు ప్రత్యేకించి ఓ పోర్టల్‌ను కేంద్ర మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖ ఆదివారం ఆరంభించింది. కరోనాకు సంబంధించి తమ శాఖ పరిధిలోని విభాగాలు, విద్యాసంస్థలు తీసుకుంటున్న చర్యలను ఈ పోర్టల్ ద్వారా ఎప్పటికప్పుడు నమోదు చేయడంతో పాటు పర్యవేక్షిస్తుంటారు.

## డీడీ న్యూస్ రీడర్ పార్వతీ ప్రసాద్ మృతి



పార్వతి (ఫైల్)

ఆబిడ్స్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఆకాశవాణి, దూరదర్శన్ న్యూస్ రీడర్, రచయిత్రి పింగళి పార్వతీ ప్రసాద్(70) ఆదివారం మృతి చెందారు. కొద్ది రోజులుగా అస్వస్థతతో ఉన్న ఆమె హైదరాబాద్ అమీర్‌పేట్‌లోని తన నివాసంలో కన్నుమూశారు. ఆమె మృతి ఎన్నో రంగాలకు తీరని లోటని తెలంగాణ సారస్వత పరిషత్ కార్యదర్శి, న్యూస్‌రీడర్ డాక్టర్ జుర్రు చెన్నయ్య అన్నారు. 1980వ దశకం నుండి ఆకాశవాణి, దూరదర్శన్‌లో పనిచేసిన పార్వతీ ప్రసాద్.. ఆకాశవాణిలో కార్యక్రమ నిర్మాణంతో ప్రారంభించి.. వార్తా విభాగంలో సీనియర్ న్యూస్ రీడర్‌గా దాదాపు 35 ఏళ్ల పాటు సేవలందించారని పేర్కొన్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : K. Srinivas,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.